బుధవారం 31-7-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 130


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 31-7-2024
II





యంగ్ రైటర్స్... కథలు రాస్తారా?

కొత్త తరం నుంచి కొత్త ఆలోచనలు పుడతాయి. కొత్త సాహిత్యం వస్తుంది. కొత్త కథా వస్తువులు మిలమిలమని మెరుస్తాయి. అందుకే కథలు రాయాలనుకుంటున్న నేటి తరానికి వేదిక పరవాలనుకుంటోంది సాక్షి. 30 ఏళ్ల లోపు యువ రచయితల కోసం 'సాక్షి ఫన్‌డే'లో 'యువ కథ' శీర్షిక ప్రారంభించనుంది. 'సాక్షి ఫన్‌డే' మేగజీన్‌లో ఒకటి లేదా రెండు పేజీల నిడివి వచ్చేలా కథలు రాసి పంపండి. అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తాం. ఒక్క కథ జీవితాంతం మీకో మంచి సాంగత్యం కాగలదు. గుర్తింపు మార్గం ఇవ్వగలదు. ప్రయత్నించండి.

మా చిరునామా: యువ కథ, సాక్షి ఫన్ డే, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. ఈమెయిల్: funday.kathalu@gmail.com

● కమ్ బ్యాక్

జెంగ్ సైరన్

'కొన్ని విజయాలు కూడా పరాజయాలే. కొన్ని పరాజయాలు కూడా విజయాలే' నిజమే! ఆటలోని పరాజితులు లోకం దృష్టిగా పెద్దగా రారు. అయితే టానియా జెంగ్ పరిస్థితి వేరు. ఈ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణీ ప్రిలిమినరీ రౌండ్‌లోనే వైదొలగినా... ఆమె విజేతగానే వెలిగిపోయింది. దీనికి కారణం ఆమె వయసు. 58 సంవత్సరాల వయసులో తన ఒలింపిక్ కలను నిజం చేసుకున్న చైనీస్ - చిలీ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి టానియా జెంగ్ సంచలనం సృష్టించింది....

తల్లి టేబుల్ టెన్నిస్ కోచ్ కావడంతో చిన్నప్పటి నుంచే ఆ ఆటపై జెంగ్‌కు ఆసక్తి ఏర్పడింది. బడిలో కంటే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కనిపించిందే ఎక్కువ. అక్కడ ఎంతోమంది ప్రొఫెషనల్ ప్లేయర్స్‌తో మాట్లాడే అవకాశం దొరికింది.

వారితో మాట్లాడడం అంటే... ఆటల పాఠాలు నేర్చుకోవడమే!

తొమ్మిది సంవత్సరాల వయసు నుంచి టేబుల్ టెన్నిస్‌లో జెంగ్‌కు తల్లి శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. 11 ఏళ్ల వయసులో ఎలిట్ స్పోర్ట్స్ అకాడమీలో చేరింది జెంగ్. పన్నెండేళ్ల వయసులో ప్రొఫెషనల్ ప్లేయర్ అయింది. నేషనల్ జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకుంది. పదహారు సంవత్సరాలకు చైనీస్ టేబుల్ టెన్నిస్ టీమ్‌లో చోటు సంపాదించింది. 'ప్రామిసింగ్ ప్లేయర్'గా పేరు తెచ్చుకుంది.

'అంతా ఓకే' అనుకొని ఉంటే జెంగ్ ప్రయాణం మరోలా ఉండేది. అయితే ఆ సమయంలో టేబుల్ టెన్నిస్‌కు సంబంధించి నిబంధనలు ఏవో మార్చడం జెంగ్‌కు చిరాకు తెప్పించింది. ఆ చిరాకు కోపంగా మారి తనకు ప్రాణ సమానమైన టేబుల్ టెన్నిస్‌కు దూరం అయింది.

కొంత కాలం తరువాత...

తనకు అందిన ఆహ్వానం మేరకు చిలీలో స్కూల్ పిల్లల టేబుల్ టెన్నిస్ కోచ్‌గా కొత్త ప్రయాణం ప్రారంభించింది. జియాంగ్ జెంగ్ పేరు కాస్తా టానియా జెంగ్‌గా మారింది. 'జెంగ్' తాను పుట్టిపెరిగిన చైనా అస్తిత్వం. 'టానియ' తనకు ఎంతో ఇష్టమైన, కొత్త జీవితాన్ని ఇచ్చిన చిలీ అస్తిత్వం.

వివిధ ప్రాంతాలకు కుమారుడు ఒంటరిగా పోటీలకు వెళ్లే సమయానికి జెంగ్ టెన్నిస్ రాకెట్‌కు దూరం అయింది. సుదీర్ఘ విరామం తరువాత రీజినల్ టోర్నమెంట్స్ కోసం మళ్లీ రాకెట్ పట్టింది. మళ్లీ విజయ పరంపర మొదలైంది. 2023 పాన్ అమెరికన్ గేమ్స్‌లో కాంస్యం గెలుచుకోవడంతో చిలీలో జెంగ్‌కు ఎంతోమంది అభిమానులు ఏర్పడ్డారు. ఒలింపిక్స్ 2024కు క్వాలిఫై కావడంతో జెంగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది.



తన కుమారుడికి టేబుల్ టెన్నిస్‌లో కోచింగ్ ఇస్తున్న సమయంలో పోటీలలో పాల్గొనాలనే ఉత్సాహం జెంగ్‌లో మొదలైంది. 2004, 2005 నేషనల్ లెవల్ టోర్నమెంట్స్‌ను గెలుచుకుంది.

టేబుల్ టెన్నిస్‌లో చూపించే అద్భుత ప్రతిభాపాటవాలతో చిలీ మీడియా ఎట్రాక్షన్‌గా మారింది జెంగ్. ఆమె ఆట ఆడే తీరు చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్‌కు ఎంతో ఇష్టం.

ఎప్పటి నుంచో నేస్తంగా ఉన్న 'విజయం' ఒలింపిక్స్‌లో ముఖం చాటేసినా... జెంగ్ ముఖంలోని వెలుగు తగ్గలేదు. అదే పోరాట స్ఫూర్తి! కుమార్తెను ఒలింపిక్స్‌లో చూడాలనేది 92 సంవత్సరాల తండ్రి కల. ఆ కలను నిజం చేసి తండ్రి కళ్లలో వెలుగు నింపింది జెంగ్.

'గో ఎట్ ఇట్, గో విత్ ఎవ్రీ థింగ్' అంబరాన్ని అంటే సంతోషంతో అంటున్నాడు ఆ పెద్దాయన.

'ఒలింపిక్ గ్రాండ్ మదర్' 'కమ్ బ్యాక్ క్వీన్'... ఇలా రకరకాల కాప్షన్‌లతో జెంగ్ గురించి సోషల్ మీడియాలో గొప్పగా పోస్టులు పెడుతున్నారు నెటిజనులు.

'ఒలింపిక్స్ అనేది నా జీవితకాల కల. క్వాలిఫై అవుతానని ఊహించలేదు. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. విరివిగా ఆటలు ఆడాలనే ఉత్సాహం పెరిగింది' అంటుంది టానియ జెంగ్.

మేడ మీద వంట

మేడ మీద వడియాలు పెటుకున్నట్టే, మేడ మీద పంటలు కూడా ఇటీవల ఎక్కువైంది. బెంగళూరుకు చెందిన రేవా జింగాన్ మాలిక్ మాత్రం రోజూ ఉదయం తొమ్మిది గంటలకు మేడ మీదకెళ్లి వంట మొదలుపెడుతుంది. అదే సోలార్ కుకింగ్. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ హితమైన జీవనశైలి లో భాగంగా ఆమె ఈ సోలార్ కుకింగ్‌ని అనుసరిస్తోంది. ఎల్‌పీజీ గ్యాస్ వాడకం వల్ల భూమికి జరిగే హానిని తనవంతుగా నిలువరించగలిగినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారామె. వండడానికి, ఎండ బెట్టడానికి అనువుగా ఆమె డిజైన్ చేయించుకున్న సోలార్ ఎక్విప్‌మెంట్ గురించి...

ప్రత్యామ్నాయ జీవనశైలి

ఎల్‌పీజీ వాడకం ఎక్కువైంది. గడచిన ఐదేళ్లలో మనదేశం దిగుమతులు కూడా ఆ మేరకు పెరిగిపోతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 11.4 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 2022-23 నాటికి 18.3 ఎమ్ఎమ్‌టీలకు చేరింది. మన ఉత్పత్తుల శాతం నాలుగుగా ఉంటే వినియోగ శాతం 22కి చేరింది. అందుకే సస్టెయినబుల్ లివింగ్ మాత్రమే అసలైన ప్రత్యామ్నాయం అనుకున్నాను. అదే విషయాన్ని పిల్లలకు, పెద్దలకు బోధిస్తున్నాను. ప్రతిదీ ప్రభుత్వమే చేయాలని ఎదురు చూడరాదు, మనవంతుగా ప్రయత్నాలు మొదలు పెట్టాలి. కొన్ని దేశాల్లో సూర్యరశ్మి తగినంత ఉండదు, కానీ మనదేశంలో సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది. ఇతర ఇంధనాల వలె వాడుకకు అనువుగా చేయడానికి ప్రాసెసింగ్ అవసరం, సోలార్ ఎనర్జీని వాడడానికి మనం ప్రత్యేకంగా శ్రమించాల్సింది ఏమీ లేదు. ఒకసారి సోలార్ కుకర్‌ని కొంటే సంవత్సరాల పాటు వినియోగించుకోవచ్చు. నాలుగేళ్ల కిందట 18వేల రూపాయలకు కొన్నాను. శీతాకాలం, వర్షాకాలం కొంచెం ఇబ్బంది ఉంటుంది. 850 వాట్స్ సోలార్ ఇన్వర్టర్ అమర్చడం ద్వారా ఆ సమస్యనూ పరిష్కరించుకున్నాను.



అన్నం, పప్పు, కూరగాయలకు మూడు అరల సోలార్ కుకర్ డిజైన్ చేయించుకున్నాను. ఉదయం ఎనిమిది గంటలకు బియ్యం, పప్పు కడిగి, నానబెట్టి, కూరగాయలు తరిగి తొమ్మిదింటికి మేడ మీదకు వెళ్లి కుకర్ ఆన్ చేసి వస్తాను. పదకొండు గంటలకల్లా వంట పూర్తవుతుంది. పాలు మరిగించడం నుంచి ప్రతిదీ ఇందులోనే చేస్తున్నాను. పప్పులు, గింజలు, రైజిన్స్, వేయించడం నుంచి ఎండబెట్టి పొడి చేసుకునే పసుపు, ఎండు మిర్చి వరకు అందులోనే చేస్తున్నాను. మంట లేని వంట మాది''.

యోగం

తల నుంచి మోకాలి వరకు

తల నుంచి మోకాలి వరకు ఉండే ఈ భంగిమను జాను శీర్షాసన అంటారు. 'జాను' అంటే మోకాలు 'శీర్ష' అంటే తల. ఈ ఆసనాన్ని వేసే ముందు మ్యాట్ పైన సుఖాసనంలో కూర్చోవాలి.



ఒక కాలును ముందుకు చాపి, చేతులతో ఆ కాలి పాదాన్ని పట్టుకోవాలి. తలను మోకాలి మీదుగా ఉంచాలి. మడిచి ఉన్న రెండవ కాలు పాదం మరొక కాలును తాకినట్టుగా, పొట్ట దగ్గరగా ఉండాలి. ఈ ఆసనంలో ఎక్కువ సేపు ఉండటం వల్ల వెన్నెముక సాగినట్టుగా, దిగువ శరీరం అంతా రిలాక్స్ అయినట్టుగా అనిపిస్తుంది.

జీర్ణక్రియ, శ్వాసకోశ పనితీరును మెరుగుపరుస్తుంది. నడుము నొప్పి, ఒత్తిడి, నిరాశ, అలసటపై ప్రభావం చూపుతుంది.

అధిక బరువుకు: మొదట్లో ఈ ఆసనం వేస్తున్నప్పుడు కొంత సవాల్‌గా అనిపిస్తుంది. ఎక్కువ ఒత్తిడి లేకుండా మెల్లగా ప్రయత్నించడం వల్ల ఈ భంగమను సాధన చేయవచ్చు. ఒక కాలును ఒకసారి రెండవ కాలును మరొకసారి 5 సార్లు మార్చుతూ చేయాలి. రోజూ పరగడుపున పది సార్లు ఈ ఆసనం వేయడం వల్ల అధికబరువు, గ్యాస్ట్రిక్, మధుమేహం సమస్యలకు మంచి పరిష్కారం లభిస్తుంది. రోజులో ఉండే ఒత్తిడి నుంచి కూడా త్వరగా రిలాక్స్ అవుతారు.

సూచన: గర్భిణులు, హెర్నియా, ఆస్తమా, స్పాండిలోసిస్, స్లిప్డ్ డిస్క్ వంటి సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు లేదా యోగా నిపుణుల ఆధ్వర్యంలో మాత్రమే సాధన చేయాలి.



- జి.అనూషా రాకేష్,
యోగా ట్రైనర్

నైట్ బ్రషింగ్ తప్పనిసరి...

రాత్రివేళల్లో నిద్రపోయేముందు బ్రష్ చేసుకోడాన్ని అందరూ తప్పనిసరిగా అలవరచుకోవాలి. ఎందుకంటే మెలకువతో ఉన్నప్పుడు అందరూ తినడానికీ, మాట్లాడటానికీ... ఇలా అనేక పనుల కోసం నోటిని అనేక మార్లు తెరుస్తుంటారు. కానీ నిద్రలో కనీసం ఏడెనిమిది గంటలు నోరు మూసుకుపోయే ఉండటంతో నోట్లో సూక్ష్మజీవుల సంఖ్య చాలా ఎక్కువగా వృద్ధిచెందుతాయి. రాత్రి పూట నోటిలో ఊరే లాలాజలం కూడా చాలా తక్కువే. ఫలితంగా నోట్లో సూక్ష్మజీవులు విపరీతంగా పెరిగిపోయి, అవి దంతాలకు హానికరమైన యాసిడ్‌నూ ఉత్పత్తి చేస్తుంటాయి. అందువల్ల నోటి ఆరోగ్యం దెబ్బతినడంతో పళ్లూ తీవ్రంగా దెబ్బతినే అవకాశం పగటి కంటే రాత్రి పూటే ఎక్కువ. అందుకే రాత్రి పడుకునేముందు బ్రష్ చేసుకునే అలవాటు పళ్లకు జరిగే హానిని గణనీయంగా తగ్గించడంతో పాటు నోటి ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుంది.



ఆహారం

చచ్చు గింజలు తింటే ప్రమాదం

వేరుశనగపప్పులు బూజు పట్టి, చర్మం ముడుచుకుని పోయి ఉన్నాయంటే అవి తెగుళ్ల కారణంగా విషపూరితమయ్యాయని అర్థం. ఫంగస్ సోకిన, ముడుచుకుని పోయిన వేరుశనగ పప్పులను తినడం ఆరోగ్యానికి హానికరం. ఈ విషాల బారిన పడకుండా దేహాన్ని సంరక్షించే ప్రక్రియలో మొదటగా దెబ్బతినేది కాలేయం, వ్యాధినిరోధక వ్యవస్థ.



సుజాత స్టీఫెన్ ఆర్.డి.
న్యూట్రిషనిస్ట్

బూజు పట్టిన పప్పులు లివర్ డ్యామేజ్‌కి కారణమవుతాయి. కాలేయం వాపు, మచ్చలతోపాటు పనితీరు లోపించడం, లివర్ క్యాన్సర్ వంటి అనారోగ్యాలు సంభవిస్తాయి. వీటితో పాటు తక్షణం బయటపడే అనేక ఇతర అనారోగ్యాలు, అలర్జీలు, కడుపు నొప్పి, డయేరియా, తల తిరగడం, వాంతులవడం వంటి సమస్యలు ఇబ్బంది పెడతాయి. దీర్ఘకాలంలో ఎదురయ్యే సమస్యల్లో బ్రాంకైటిస్, ఆస్మాతోపాటు ఇతర శ్వాసకోశ సంబంధ సమస్యలు, కిడ్నీ ఫెయిల్యూర్, పెద్ద పేగు క్యాన్సర్‌లకు దారితీస్తుంది. సంవత్సరాలపాటు ఆహారంలో ఇవి కొనసాగినట్లయితే నర్వస్ సిస్టమ్ కూడా బలహీనపడుతుంది. తరచూ తలనొప్పి, దేహంలో ప్రకంపనలు, జ్ఞాపకశక్తి లోపించడం జరుగుతుంది. మనం ఊహించని మరో సమస్య పునరుత్పత్తి వ్యవస్థ అపసవ్యతలకు లోనుకావడం కూడా.



అందుకే వేరుశనగపప్పుల నాణ్యతను పరిశీలించుకున్న తర్వాత మాత్రమే వంటల్లో వాడాలి. పప్పులను కొన్న వెంటనే పేపర్ మీద పోసి బూజుపట్టిన, ముడుచుకు పోయిన పప్పులను తొలగించి మంచి పప్పులను డబ్బాల్లో నిల్వ చేసుకోవాలి. పప్పులు సేకరించి నూనె పట్టించుకునే వాళ్లు కూడా బూజు పట్టిన పప్పులను, డొల్లగా ఉన్న పప్పులను జాగ్రత్తగా ఏరి పారేసి మంచి పప్పులతో నూనె పట్టించుకోవాలి.

ఫ్రూట్ ఫాస్టింగ్

పండంటి ఉపవాసం

ఉపవాసాలు రకరకాలు. ఒక రోజంతా కేవలం నీటిని తాగుతూ ఇతర ఏ ఆహారమూ తీసుకోకుండా ఉపవసించడాన్ని జలోపవాసం అంటారు. ఒక రోజంతా పండ్లను మాత్రమే తీసుకుంటూ ఇతర ఏ ఆహారపదార్థాలను తీసుకోకుండా ఉండడాన్ని ఫలోపవాసం అంటారు. వారం లేదా రెండు వారాలకో రోజు ఏదో ఒక ఉపవాసాన్ని పాటించడం వల్ల దేహం ఆరోగ్యంగా ఉంటుంది.







డీటాక్స్ అండ్ ప్యూరిఫికేషన్: ఫ్రూట్ ఫాస్టింగ్ ప్రధానంగా దేహంలోని వ్యర్థాలను తొలగించి దేహఅంతర్గత అవయవాలను శుద్ధి చేస్తుంది. పండ్లలోని ఎంజైమ్‌లు కాలేయాన్ని శక్తివంతం చేసి పనితీరును ఉత్తేజితపరుస్తుంది. పండ్లలో నీరు, ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి జీర్ణాశయం, పేగులు శుభ్రపడతాయి. పండ్లలోని విటమిన్‌లతోపాటు ఖనిజ లవణాలు అందుతాయి. ఆహారం తీసుకోనప్పుడు తలతిరగడం వంటి సమస్యలు ఉంటాయి. కానీ ఫ్రూట్ ఫాస్టింగ్‌తో ఆ అసౌకర్యం ఉండదు. దేహానికి అవసరమైన పోషకాలన్నీ అందుతుంటాయి.





స్ట్రెంగ్తనింగ్ బాడీ అండ్ మైండ్: ఫ్రూట్ ఫాస్టింగ్ కేవలం దేహాన్ని శుద్ధి చేయడం మాత్రమే కాదు మెదడును కూడా ఉల్లాసపరుస్తుంది. దేహం తేలిగ్గా ఉంటూ శక్తివంతంగా ఉండడంతో ఆత్మవిశ్వాసం స్థాయులు పెరుగుతాయి. బద్ధకం దూరమవుతుంది. మెదడు చురుగ్గా ఉండి ఆలోచనలు చైతన్యవంతంగా సాగుతాయి.



ఏ పండ్లు మంచివి! ఫ్రూట్ ఫాస్టింగ్ సమయంలో పుచ్చకాయ, కమలాపండ్లు, ద్రాక్ష, యాపిల్, మామిడి, పైన్ యాపిల్, బొప్పాయి, అరటిపండ్లను ప్రధానంగా తీసుకుంటారు. అయితే బాడీ క్లెన్సింగ్ కోసం ఫ్రూట్ ఫాస్టింగ్ చేసేటప్పుడు అరటి పండును మినహాయించడమే మంచిదంటున్నారు నిపుణులు.



● చైతన్య పథం



అద్భుతాలు జరగడానికి అల్లావుద్దీన్ అద్భుత దీపం అక్కర్లేదు. కాస్త ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. అలీన ఆ ఆత్మవిశ్వాసంతో సాధించిన అద్భుతం...మిట్టీ కేఫ్. ఆఫీసుల నుంచి రెస్టారెంట్‌ల వరకు దివ్యాంగులకు సరియైన సౌకర్యాలు లేని పరిస్థితి. 'నేను ఉద్యోగం చేస్తాను' అని అడిగితే 'సారీ' చెప్పే పరిస్థితి. ఇది తెలిసి కూడా దివ్యాంగులను ఉద్యోగులుగా, ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా చూడాలని కల కన్నది అలీనా అలమ్. ఇరవై మూడు సంవత్సరాల వయసులో ఆమె మొదలుపెట్టిన 'మిట్టీ కేఫ్' ఆ తరువాత కాలంలో అద్భుతం సృష్టించింది. 'మిట్టి కేఫ్' అనేది ఇప్పుడు ఒక కేఫ్ బ్రాండ్ మాత్రమే కాదు ఆత్మవిశ్వాసాన్ని ప్రతిధ్వనించే బ్రాండ్...

అలీన అద్భుత దీపం... ఆత్మవిశ్వాసం



దివ్యాంగుల కోసం పనిచేస్తున్న బెంగళూరులోని 'సమర్థన' ట్రస్ట్‌లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ చేస్తున్న రోజుల్లో 'మిట్టీ కేఫ్' ఆలోచన అలీనా అలమ్‌కు వచ్చింది. సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన కలను సాకారం చేసుకోవడానికి 'మిట్టీ కేఫ్' మంచి ఆలోచన అనుకుంది.

'పెళ్లి చేసుకో లేదా ఉద్యోగం చెయ్' అన్నారు తల్లిదండ్రులు. అలీనా మాత్రం సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దారిలో నడక మొదలుపెట్టింది. దివ్యాంగుల కోసం, దివ్యాంగుల చేత నడుస్తున్న 'మిట్టీ కేఫ్'లు సక్సెస్ అయ్యాయి.

'మన దేశంలోని లక్షలాది మంది దివ్యాంగులు సమాన అవకాశాల కోసం, ఆర్థికంగా సొంతకాళ్ల మీద నిలబడడం కోసం ఎదురుచూస్తున్నారు. సమస్య అనేది వారి సామర్థ్యం గురించి కాదు. సమస్య మనం చూసే దృష్టి కోణంలో ఉంది. వారి గురించి మనకు ఎన్నో అపోహలు ఉంటాయి. చిన్న చూపు ఉంది. ఈ పరిస్థితి పూర్తిగా మారిపోవాలి' అంటున్న అలీన 'మిట్టీ కేఫ్' ద్వారా ఎంతోమంది దివ్యాంగులకు ఉపాధితోపాటూ ఆత్మస్థైర్యాన్నీ ఇచ్చింది.

దాతలు ఇచ్చిన విరాళాలతో 'మిట్టీ కేఫ్' మొదలైంది. 'సంకల్పం మంచిదైతే సహాయపడడానికి సమాజం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది' అన్నట్లు ఒక ప్రింటింగ్ ప్రెస్ యజమాని కేఫ్‌కు సంబంధించిన పోస్టర్‌లను ఉచితంగా ముద్రించి ఇచ్చాడు.

దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 'మిట్టీ కేఫ్'లను తీర్చిదిద్దారు. దృష్టి లోపం ఉన్నవారు బిల్లింగ్ చేయడానికి వీలుగా బిల్లింగ్ సిస్టమ్‌లో ఆడియో ఫీచర్ ఉంది. మెనూ బ్రెయిలీ లిపిలో ఉంటుంది. వినికిడి లోపం ఉన్న, మూగ ఉద్యోగులు కస్టమర్‌లతో కమ్యూనికేట్ చేయడానికి ప్లకార్డులు కూడా ఉంటాయి.

హుబ్లీలోని చిన్న షెడ్‌లో మొదలైన 'మిట్టీ కేఫ్' ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించింది. దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్ట్స్, పెద్ద కంపెనీలు, బ్యాంకులు... మొదలైన వాటిలో 46 'మిట్టీ కేఫ్'లు నడుస్తున్నాయి. గత సంవత్సరం సుప్రీంకోర్టు ప్రాంగణం, రాష్ట్రపతి భవన్, ఐఐఎం-బెంగళూరులో 'మిట్టీ కేఫ్'లను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా మరిన్ని విమానాశ్రయాలు, మెట్రో, రైల్వే స్టేషన్‌లలో 'మిట్టీ కేఫ్'లు ఏర్పాటు చేయనున్నారు.

'కరేజ్' 'మ్యాజిక్' అనే మాటలు అలీన నోటి నుంచి తరచుగా వినిపిస్తుంటాయి. 'ధైర్యం' ఉన్న చోటే ఊహించని అద్భుతాలు, మ్యాజిక్‌లు జరుగుతాయి. 'మిట్టీ కేఫ్' రూపంలో అద్భుతం సృష్టించడానికి అలీనాలోని ధైర్యమే కారణం. ఆమెకు బాగా ఇష్టమైన కొటేషన్...

'ఎక్కడ దయాగుణం ఉంటుందో...
అక్కడ మంచితనం ఉంటుంది.
ఎక్కడ మంచితనం ఉంటుందో...
అక్కడ అద్భుతం ఆవిష్కృతం అవుతుంది'

'మనం మాత్రం ఏం చేయగలం' అనుకునే నిరాశావాదులకు అలీన ఆలమ్ విజయం కనువిప్పు లాంటిది. కొత్త దారి చూపే కాంతి కిరణంలాంటిది. 'మిట్టీ కేఫ్'లో పనిచేసిన దివ్యాంగ ఉద్యోగులలో కొందరు సొంతంగా ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా రాణించడం మరో మంచి విజయం.

అభిప్రాయం

వంధ్యత్వం కాదు.. అంధత్వం

ప్రకృతిలోని జీవరాశులను ప్రేమించే వాళ్లంతా మాతృత్వం కలవారే! దీనికి జెండర్ లేదు. వాత్సల్యం, కరుణే దానికి కొలమానం! అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార పర్వాన్ని ఫాలో అవుతున్నవాళ్లకు అర్థమయ్యే ఉంటుంది ఈ ప్రస్తావన ఇప్పుడు ఎందుకో! అవును, కమలా హ్యారిస్ గురించి జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ ప్రస్తావన. రాజకీయ ఎన్నికల ప్రచారంలో హుందాతనం.. అగ్రరాజ్యంలోనూ పూజ్యమని అర్థమైంది. అవతలి పక్షాన్ని ఎదుర్కోవడానికి ముఖ్యంగా మహిళానేతల విషయంలో ఎక్కడైనా వాళ్ల దక్షత కన్నా వ్యక్తిగతేచ్ఛలే పరిగణనలోకి తీసుకునేట్టున్నారు. దీనికి అభివృద్ధి చెందిన దేశాలు, వర్తమాన దేశాలనే వ్యత్యాసం లేనట్టుంది. పిల్లల్లేని మహిళలు దుర్భర జీవితాన్ని గడుపుతారని, వాళ్లు సమాజానికి భారమే తప్ప వాళ్ల వల్ల ఒరుగుతున్నదేమీ లేదని రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ వాక్రుచ్చాడు.



ఈ కామెంట్.. పిల్లల్లేని కమలా హ్యారిస్‌నుద్దేశించే నని ప్రపంచమంతా గ్రహించి, ఆమె పక్షాన నిలిచింది. పిల్లలను కనాలా వద్దా అనేది పిల్లల్ని కనే శారీరక స్థితి, పెంచే సామాజిక పరిస్థితులను బట్టిమహిళ నిర్ణయించుకోవాలని, ఆ నిర్ణయాధికారం ఆమె హక్కని నాగరిక సమాజం గొంతు చించుకుని అరిచింది. దాని మీద ఉద్యమాలనూ లేవనెత్తింది. ఇంతలోతైన ఆలోచన, అంత విశాలమైన దృక్పథం లేని వాన్స్ లాంటి వాళ్లకు కనీసం దాన్ని ఓ పర్సనల్ చాయిస్‌గా గుర్తించాలనే స్పృహ కూడా లేనట్టుంది. పెళ్లి, పిల్లలు అనేది వ్యక్తిగతం. పిల్లల్లేని చాలామంది ఆడవాళ్లు అనాథలను చేరదీసి, ఇరుగుపొరుగు పిల్లలను పోగేసి.. బంధువుల బిడ్డలను అక్కున చేర్చుకుని వాళ్లను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దిన ఉదంతాలు కోకొల్లలు! ఇందుకు కమలా హ్యారిస్ కూడా ఉదాహరణగా నిలుస్తారు. కడుపున పుట్టిన పిల్లల్లేకపోయినా ఆమె అద్భుతమైన మాతృమూర్తి! తన భర్త పిల్లలకు అమ్మతనాన్ని పంచింది. జేడీ వాన్స్ వ్యాఖ్యల క్రమంలో ఆ పిల్లలు కమలా హ్యారిస్ చేయి వదల్లేదు. ఆమె భుజాల చుట్టూ చేయివేసి ఆమె మనోనిబ్బరాన్ని మరింత పెంచుతున్నారు. దీన్ని ప్రపంచమూ హర్షిస్తోంది. అలాంటి మాతృమూర్తి మీద నోరు పారేసుకున్న వాన్స్.. తండ్రైనా హృదయం లేనివాడిగా ముద్రపడ్డాడు. నిజానికి అమెరికా అధ్యక్ష పదవికి తమ అభ్యర్థిగా డెమోక్రటిక్ పార్టీ కమలా హ్యారిస్‌ని ప్రకటించగానే ఆ పార్టీ విజయావకాశాలు అనూహ్యంగా పెరిగాయి. ఆ ధాటిని తట్టుకోలేక రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులు ప్రతిపక్ష అభ్యర్థి జెండర్‌ను లక్ష్యంగా చేసుకుని, ఆమె వ్యక్తిగత జీవితం మీద దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. కమలా హ్యారిస్ మాతృత్వానికి.. అమెరికా అవసరాలకు లంకె ఏంటి? అక్కడే కాదు ఎక్కడైనా సరే.. స్త్రీల వ్యక్తిగత విషయాలకు.. దేశ పురోగతికి ఏమిటి సంబంధం? ఒకవేళ సంబంధమే ఉంది అనుకుంటే అప్పుడు పురుషుడి వ్యక్తిగత విషయాలూ అంతే ప్రభావం చూపిస్తాయి కదా! పెళ్లి, పిల్లలు.. ఎవరికైనా వాళ్ల వ్యక్తిగతమే! ఒకవేళ వాన్స్ అన్నదే తీసుకున్నా.. పెళ్లి, పిల్లలు అనే బాధ్యత లేని స్త్రీలు దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక పురోగతిలో చెప్పుకోదగ్గ పాత్రే పోషిస్తున్నారు. మాతృత్వాన్ని మహత్తర అనుభూతిగా చూపి ఆ బంధనంతో స్త్రీలను కట్టిపడేసి.. తమకు పోటీలేకుండా చూసుకోవాలనుకున్న పురుషాధిపత్య భావజాలం అమెరికన్లలోనూ జాస్తి అని వాన్స్ ద్వారా మరోసారి రుజువైంది.

- సరస్వతి రమ

బుధవారం 31-7-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 130

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

మను.. చరిత్రను లిఖించింది

➤ పారిస్ ఒలింపిక్స్‌లో మంగళవారం భారత మహిళా షూటర్ మనూ భాకర్ కొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత సాధించింది. 'పారిస్' గేమ్స్‌లో ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలిచిన మనూ భాకర్... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సహచరుడు సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో మనూ–సరబ్‌జోత్ ద్వయం 16–10 పాయింట్ల తేడాతో జిన్ ఓయె–లీ వన్‌హో (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్–కాంస్యం; 2012 లండన్–రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో–రజతం; 2020 టోక్యో– కాంస్యం) తర్వాత రెండు ఒలింపిక్ పతకాలు గెలిచిన మూడో భారత ప్లేయర్‌గా మనూ గుర్తింపు పొందింది. మంగళవారం భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఇద్దరు భారత బాక్సర్లు అమిత్ పంఘాల్, జైస్మిన్ లంబోరియా తమ తొలి బౌట్‌లలోనే ఓడిపోయారు. బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ రెండో విజయంతో గ్రూప్ 'టాపర్'గా నిలిచింది. ఐర్లాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు 2–0తో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరువైంది. - 16లో



ముంచెత్తిన మృత్యువు

నడిరాత్రి వేళ కేరళలో జలప్రళయం.. విరిగిపడ్డ కొండచరియలు..

బురదలో కొట్టుకుపోయిన ఊళ్లు.. వందల్లో మృతులు!

123

మృతదేహాల వెలికితీత

- నిద్రలోనే బురద, మట్టిదిబ్బల కింద పలువురి కన్నుమూత
- జాడతెలియని 600 మంది వలస కూలీలు
- శవాలదిబ్బగా మారిన మెప్పడి ప్రాంతం
- ఊడ్చుకుపోయిన ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ గ్రామాలు
- హుటాహుటిన సహాయక చర్యలు
- ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



ఓ గ్రామాన్ని ముంచెత్తిన బురద, (ఇన్‌సెట్) చిన్నారితో కలిసి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న మహిళ

➔ ప్రకృతి ప్రకోపించింది. కొండచరియల రూపంలో విరిగిపడింది. వరద ప్రవాహమై విరుచుకుపడింది. ఊళ్లకు ఊళ్లనే ముంచెత్తింది. ఆదమరచి నిద్రిస్తున్న అమాయకులను అమాంతంగా బలి తీసుకుంది. కేరళలోని వయనాడ్ జిల్లా కొండ ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకున్న మాటలకందని విషాదమిది. ఈ ఘోర కలికి బలైన వారి సంఖ్య ఇప్పటికే 123 దాటింది. బురదలో కూరుకుపోయి ఇంకా వందలాది మంది మరణించి ఉంటారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్లు తదితరాలన్నీ పూర్తిగా ధ్వంసం కావడంతో కేంద్ర, రాష్ట్ర సహాయక బృందాలు, సైన్యం బాధిత ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాయి...

6లో

రెండో విడత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి, తుమ్మల, పొంగులేటి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా తదితరులు



మా జన్మ ధన్యమైంది

- రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్
- రైతు రుణమాఫీతో లక్షలాది రైతుల ఇళ్లల్లో పండుగ
- మా చిత్తశుద్ధి, పరిపాలన దక్షతతో రుణమాఫీ చేసి చూపించాం
- మా నిబద్ధతను భట్టి అన్న నిరూపించారని వెల్లడి
- రూ.6,190 కోట్ల చెక్కు రైతులకు అందజేత

సాక్షి, హైదరాబాద్: రైతులకు రుణమాఫీతో తమ జన్మ ధన్యమైందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ రైతు కుటుంబంలోనూ విషాదం ఉండకూడదని, రైతులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకుండా ఆదుకోవాలనే ఉద్దేశంతో రైతు రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. ఈ మాఫీతో లక్షలాది మంది రైతుల ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. రైతు రుణమాఫీ రెండో విడతలో భాగంగా రూ.1.50 లక్షల్లోపు రుణమున్న రైతుల రుణమాఫీ కోసం రూ.6,190 కోట్ల నిధులను మంగళవారం ఆయన విడుదల చేశారు. 5.9 లక్షల కుటుంబాలకు చెందిన 6.4 లక్షల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన చెక్కును రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

వ్యవసాయం పండుగ అని నిరూపించేందుకే

'కార్పొరేట్లకు వేలాది కోట్ల రూపాయలను బ్యాంకులు అప్పులుగా ఇస్తే, నష్టాల పాలయ్యామంటూ తప్పుడు లెక్కలు చూపెట్టి రుణాలు ఎగ్గొట్టి దేశాలు విడిచి పారిపోతున్నారు. కానీ రైతులు మాత్రం తాను అప్పులపాలైనా పదిమందికి అన్నం పెట్టాలనే ఉద్దేశంతో రుణాలు తీసుకుంటారు. అప్పుల వాళ్లు ఇంటికొస్తే ఆత్మాభిమానం దెబ్బతిని సిరులు పండించే పొలాల్లోనే పురుగుల మందు తాగి చనిపోయిన ఘటనలు జరిగాయి. అందుకే వరంగల్ డిక్లరేషన్‌లో రైతు రుణమాఫీ

మిగతా 2వ పేజీలో ▶

కేటీఆర్‌తో బండ్ల



మళ్లీ బీఆర్‌ఎస్ గూటికి..

కేటీఆర్‌ను కలిసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


బీఆర్‌ఎస్‌ఎల్పీ ఆఫీసుకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రాక

- వివరాలు 2లో

నేడు గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణ స్వీకారం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బుధవారం సాయంత్రం 5గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రతిపక్ష నేత కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్, ఆయా పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలకు రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం వెళ్లింది. జిష్ణుదేవ్ వర్మ 2018–23 మధ్యకాలంలో త్రిపుర ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర నాలుగవ గవర్నర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. తెలంగాణ గవర్నర్లుగా ఇప్పటి వరకు ఈఎస్ఎల్ నరసింహన్, తమిళిసై సౌందరరాజన్, ఇన్‌చార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ వ్యవహరించిన సంగతి తెలిసిందే.



సాగర సంబురం

శ్రీశైలం ప్రాజెక్టులోకి 4.13 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం.. 883.5 అడుగుల వద్ద 203.99 టీఎంసీలకు చేరిన నిల్వ

ప్రాజెక్టు10 గేట్లు ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీరు నాగార్జున సాగర్‌కు విడుదల - 8లో

'విద్యుత్' కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ మదన్ బి.లోకూర్

- జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి స్థానంలో నియమించిన రాష్ట్ర ప్రభుత్వం
- యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై మళ్లీ విచారణ
- ఏపీ, గౌహతి హైకోర్టుల సీజేగా, సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ లోకూర్



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో జరిగిన విద్యుత్ నిర్ణయాలపై ఏర్పాటైన విచారణ కమిషన్‌కు కొత్త చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అనూహ్య పరిణామాల నేపథ్యంలో విచారణ కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి స్థానంలో ఆయన్ను నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ నిర్వహించి నివేదిక సమర్పించడానికి ప్రభుత్వం జస్టిస్ లోకూర్‌కు 3 నెలల గడువును విధించింది. జస్టిస్ లోకూర్ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, గౌహతి హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా కూడా వ్యవహరించారు. కాగా, నామినేషన్ల ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని బీహెచ్‌ఈఎల్ సంస్థకు అప్పగించడంతోపాటు ఛత్తీస్‌గఢ్‌తో 1000 మెగావాట్ల విద్యుత్

మిగతా 7వ పేజీలో ▶

ఇదండీ సంగతి





బీఆర్‌ఎస్ వాకౌట్

- పౌర సరఫరాల శాఖలో రూ.1,100 కోట్ల స్కాం జరిగింది: కేటీఆర్
- ఇందులో మంత్రి ప్రమేయం లేకున్నా పెద్దల ప్రమేయం ఉందని ధ్వజం
- సభాసంఘానికి డిమాండ్ చేసిన బీఆర్‌ఎస్.. ప్రభుత్వ తీరుకు నిరసనగా వాకౌట్
- ఇది సభనా..? బస్టాండా?.. ఇదేం పద్ధతి: భట్టి
- ఏదీ జరగకుండానే జరిగినట్లు ఆరోపించడం తగదు: ఉత్తమ్
- సమాధానమిచ్చినా కూడా సభ నుంచి పారిపోయారు: శ్రీధర్‌బాబు
- అసెంబ్లీలో సివిల్ సప్లయ్స్ పద్దుపై చర్చ

సాక్షి, హైదరాబాద్: పౌర సరఫరాల శాఖలో సన్నబియ్యం కొనుగోళ్లలో రూ.1,100 కోట్ల స్కాం జరిగిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ధాన్యం అమ్మకాలు, సన్నబియ్యం కొనుగోళ్లలో జరిగిన కుంభకోణంపై సభాసంఘాన్ని నియమించాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించనందున, ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి తమ పార్టీ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి శాసనసభ నుంచి వాకౌట్ చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలియకుండా సివిల్ సప్లయ్స్ శాఖలో చాలా జరుగుతున్నాయని ఆరోపించారు. రేషన్ కార్డులు, రైతులకు పంటలకు సంబంధించిన బోనస్ విషయంలో తమ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బుల్డోజ్ చేస్తోందంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఏం చెప్పినా ప్రభుత్వానికి రుచించటం లేదని దుయ్యబట్టారు. దీనిలో మంత్రి హస్తం లేకపోయినా పెద్దల హస్తం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం సమాధానం ఇస్తున్న తీరుపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ కుంభకోణంపై హౌజ్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా అసెంబ్లీ నుంచి బాయ్‌కాట్ చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు సభా సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లో బైఠాయించి చప్పట్లు కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సమయంలో కల్పించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వారిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.

సన్న బియ్యం కొనలేదు: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ.. సన్నబియ్యం ఒక్క గింజకూడా కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు. తన శాఖలో ఏమి జరిగినా అందుకు తాను పూర్తి బాధ్యత

మిగతా 3వ పేజీలో ▶

కోఠిలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ముట్టడించిన ఆశ కార్యకర్తలు



కదం తొక్కిన ఆశ వర్కర్లు

- ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్
- కోఠి మహిళా కళాశాల రోడ్డును దిగ్బంధించి ధర్నా
- ఆరు గంటల పాటు ఆందోళన.. పోలీసులతో వాగ్వాదం.. స్తంభించిన రాకపోకలు

- వివరాలు 5లో

క్లుప్తంగా...

గద్వాల ఎమ్మెల్యేకి ఓపిక లేదు: యెన్నం



సాక్షి, హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఓపిక తక్కువని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. కృష్ణమోహన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యమిచ్చామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన మనుషులకు ప్రాధాన్యమివ్వాలని ఆయన కోరితే.. అందుకు కూడా అంగీకరించినట్టు పేర్కొన్నారు. కానీ జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన బీసీ మహిళను అధికారిక కార్యక్రమాలకు పిలవొద్దంటే.. సాధ్యం కాదని చెప్పామని పేర్కొన్నారు.

ప్రాజెక్టులు లేకుండా కాలువలు: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏక కాల రుణమాఫీ చేస్తామని విడతల వారీగా చేయడం ఏంటని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. 'ప్రజలు, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. తట్టెడు మట్టి కూడా తవ్వని చేవెళ్ల ప్రాజెక్టుకు తొమ్మిదిసార్లు శంకుస్థాపన చేశారు. అసలు ప్రాజెక్టులు కట్టకుండానే కాలువలు తవ్విన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారని అప్పట్లో మహారాష్ట్ర ముఖ్య మంత్రి లేఖ కూడా రాశారు. కాంగ్రెస్ పార్టీ పాత వారసత్వాన్ని కొనసాగిస్తోంది' అని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

హోంమంత్రిని నేనే: మాజీమంత్రి మల్లారెడ్డి

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ తిరిగి మూడోసారి అధికారంలోకి వస్తే హోంమంత్రి పదవి తనకే దక్కి ఉండేదని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. 'సినిమా నిర్మాతగా మారి అనేక సినిమాలు నిర్మించాలనుకున్నా. టీవీ చానల్ కూడా పెట్టాలనుకున్నా. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే నా స్థాయి మరోలా ఉండేది. ప్రభుత్వంలో మరింత స్థానం దక్కి ఉండేది' అని పేర్కొన్నారు.

'రైతు కుటుంబానికి పెళ్లికూడా కష్టంగా ఉంది'



సాక్షి, హైదరాబాద్: భూమిని నమ్ముకున్న రైతు నిర్లక్ష్యానికి గురవుతున్నారని, రైతు కుటుంబాల పిల్లలకు పెళ్లవ్వడం కూడా కష్టంగా ఉందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ ఈ పరిస్థితికి కారణమేంటో పరిశీలించాల్సిన అవసరముందన్నారు.

'పౌరసరఫరాల టెండర్లపై హౌస్ కమిటీ వేయాలి'

సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖ టెండర్లపై విచారణ కోసం హౌస్ కమిటీ వేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడారు. టెండర్లపై ప్రజలకు ఉన్న అనుమానాలను మాత్రమే తాము సభ దృష్టికి తీసుకెళ్లామని గంగుల చెప్పారు. పౌరసరఫరాల శాఖ టెండర్లపై గతంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్తగా మళ్లీ టెండర్లు పిలిచిందన్నారు. గతంలో కొనుగోలు చేసిన ధర కంటే తక్కువ ధరకు ఎందుకు కోట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టెండర్లకు సంబంధించిన విధివిధానాలు బయట పెట్టాలన్నారు. వడ్ల కొనుగోలులో రూ.1,100 కోట్లకు పైగా చేతులు మారుతున్నాయని ఆరోపించారు.

బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే!

బయటపడిన సమన్వయ లోపం
ప్రభుత్వ రైతు రుణమాఫీ కార్యక్రమానికి ముగ్గురు ఎమ్మెల్యేలు
ఎలాంటి సంకేతాలు వెళ్తాయంటున్న పార్టీ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ శాసనసభ్యుల మధ్య సమన్వయలోపం బయటపడింది. పార్టీ పక్షాన గెలుపొందిన 8 మంది ఎమ్మెల్యేలు 'ఎవరికి వారే యమునా తీరే' అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం కొంతకాలంగా ఉంది. తాజాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండోవిడత రుణమాఫీ కార్యక్రమానికి ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం చర్చనీయాంశమయ్యింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని ఒకపక్క పార్టీ డిమాండ్ చేస్తూ ఉంటే.. మంగళవారం నాటి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎలా పాల్గొంటారనే ప్రశ్నలు ఇటు పార్టీలో అటు శాసనసభాపక్షంలో వినిపిస్తున్నాయి. శాసనసభా సమావేశాల తొలిరోజునే లిబర్టీ అంబేడ్కర్ విగ్రహం నుంచి అసెంబ్లీ దాకా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు పాదయాత్రగా వచ్చిన విషయం తెలిసిందే. కాగా ఈ వైఖరికి భిన్నంగా ప్రభుత్వం నిర్వహించిన రుణమాఫీ కార్యక్రమంలో ముగ్గురు ఎమ్మెల్యేలు పాల్గొంటే ఎలాంటి సంకేతాలు వెలువడతాయనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

రాష్ట్ర పార్టీ నాయకత్వం స్పష్టతనివ్వకపోవడం వల్లే..!

అసెంబ్లీలో బీజేఎల్పీ వివిధ ముఖ్యమైన అంశాలపై ఎలాంటి వైఖరి అనుసరించాలనే దానిపై రాష్ట్రపార్టీ నాయకత్వం స్పష్టతనివ్వకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. అసెంబ్లీలో కేటాయించిన గదికి సభలోంచి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వచ్చేటప్పటికే ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ రుణమాఫీ కార్యక్రమానికి వెళ్లిపోయారు. దీంతో ఆశ్చర్యపోవడం ఆయన వంతైంది. ఇలా చేస్తే పార్టీ కేడర్‌కు ఎలాంటి సంకేతాలు వెళతాయంటూ ఆ కార్యక్రమానికి హాజరుకాని ఓ బీజేపీ ఎమ్మెల్యే అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించడం గమనార్హం. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఎవరికి తోచినట్టుగా వారు పెద్దసంఖ్యలో వాయిదా తీర్మానాలను ప్రతిపాదిస్తున్నారనే అంశంపై కూడా పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. సీనియర్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అప్పుడప్పుడు మాత్రమే సమావేశాలకు హాజరవుతున్నారు. రాష్ట్ర పార్టీ నాయకత్వంతోనూ ఆయన అంత సఖ్యతగా లేరనే అభిప్రాయం ఇప్పటికే పార్టీవర్గాల్లో ఉంది. మొత్తంగా 8 మంది ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా తమ సొంత ఇమేజీని పెంచుకునే ప్రయత్నాల్లో మునిగినందునే సమన్వయలేమి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

మళ్లీ బీఆర్‌ఎస్ గూటికి..

- కేటీఆర్‌ను కలిసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- అసెంబ్లీలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ



బీఆర్‌ఎస్‌ఎల్పీ ఆఫీస్‌లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. చిత్రంలో వేముల, గంగుల

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌లో చేరి కనీసం నెల రోజులు తిరగకముందే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి సొంత పార్టీ బీఆర్‌ఎస్ గూటికి చేరుకున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం కృష్ణమోహన్‌రెడ్డి లాబీలోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం కార్యాలయానికి వచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయిన కృష్ణమోహన్‌రెడ్డి తాను పార్టీలో కొనసాగాలనుకుంటున్న విషయాన్ని వెల్లడించారు. ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు కృష్ణమోహన్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించారు. తాను త్వరలో పార్టీ అధినేత కేసీఆర్‌ను కలుస్తానని ఆయన వెల్లడించారు. జూలై 6న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇదిలాఉంటే ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో కాంగ్రెస్‌లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు కూడా మంగళవారం బీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. అయితే బీఆర్‌ఎస్‌లో తిరిగి చేరే అంశంపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం గమనార్హం. 'బీఆర్‌ఎస్‌లో కొందరు అల్ప సంతోషులు ఉన్నారు. నా ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టి పార్టీ మారతారని ప్రచారం చేస్తున్నారు. అనేక మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మంత్రుల చాంబర్లలోకి వెళ్లి కలుస్తున్నారు. వారంతా పార్టీ మారేవారేనా?' అని వెంకటరావు మీడియాతో అన్నారు. తాను టీ తాగేందుకు బీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయానికి వచ్చినట్లు స్పష్టం చేశారు. అయితే, బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకే రోజు పార్టీ శాసనసభాపక్షం కార్యాలయానికి రావడంతో ఒక్కసారిగా రాజకీయ ఊహాగానాలు జోరందుకున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా కృష్ణమోహన్‌రెడ్డి బాటలో తిరిగి సొంత గూటికి చేరుకుంటారని సమాచారం. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు వేర్వేరు సందర్భాల్లో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), కాలే యాదయ్య (చేవెళ్ల) తిరిగి అదే పార్టీలో చేరతారని సమాచారం. అయితే తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కాలే యాదయ్య ఒక ప్రకటన విడుదల చేశారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో పరిస్థితి

పార్టీ వీడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఓ వైపు బీఆర్‌ఎస్ హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తోంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు అనర్హత వేటు కోసం దాఖలైన కేసులో మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. తదుపరి విచారణ ఆగస్టు 1కి వాయిదా పడగా, సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పు మేరకు తమపై అనర్హత వేటు పడుతుందనే ఆందోళనలో బీఆర్‌ఎస్ నుంచి ఫిరాయించిన పలువురు ఎమ్మెల్యేలున్నారు. మొత్తం 38 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు గాను కనీసం 26 మంది కాంగ్రెస్‌లో చేరితేనే ఆ పార్టీ శాసనసభాపక్షం అధికార పక్షంలో విలీనమవుతుంది. అయితే ఇప్పటి వరకు 10 మంది ఎమ్మెల్యేలు మాత్రమే కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం విలీనానికి అవసరమైన మేజిక్ ఫిగర్ ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించకపోవడం ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో కలవరం రేపుతోంది. తమపై అనర్హత వేటు పడితే జరిగే ఉప ఎన్నికలో తమ పరిస్థితి ఏంటనే ఆందోళనలో వారున్నారు. ఇదిలాఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ స్థానిక శ్రేణుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పార్టీలో చేరిక సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, పార్టీలో ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తి కూడా ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో మరికొందరు ఫిరాయింపు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్‌ఎస్ గూటికి చేరుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీఆర్‌ఎస్‌కు నేను చాలు..

- కృష్ణమోహన్‌రెడ్డి ఎక్కడికీ వెళ్లడు
- కేటీఆర్ కూడా నా వద్దకు వచ్చి మాట్లాడారు.. ఆయన కాంగ్రెస్‌లో చేరినట్టా?
- కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదంటే రాజకీయాలు వదులుకున్నట్లే...
- ఇష్టాగోష్టిలో మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి విదేశాలకు వెళ్తే చూసుకోవడానికి తానున్నానని, బీఆర్‌ఎస్‌కు తాను చాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ముగ్గురూ కలిసి రేవంత్‌రెడ్డిని ఓడించలేకపోయారని, ఆయనకు వాళ్లు ఎలా సరిపోతారని ప్రశ్నించారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఎక్కడకూ వెళ్లడని, చాంబర్‌కు వెళ్లినంత మాత్రాన పార్టీలో చేరినట్టా అని అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో కోమటిరెడ్డి విలేకరులతో చిట్‌చాట్ మాట్లాడారు. కేటీఆర్ కూడా తన చైర్ దగ్గరకు వచ్చి మాట్లాడారని, అంతమాత్రాన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు అవుతుందా అని చెప్పారు. 'కేసీఆర్ సభకు ఎందుకు రావడంలేదు. సభలో ముఖ్యమంత్రి ఎలాగో ప్రతిపక్షనేత కూడా అలాగే.. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదంటే రాజకీయాలు వదులుకున్నట్లే. ఆయన వైఖరి చూస్తోంటే త్వరలోనే బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేలా కనిపిస్తోంది' అని కోమటిరెడ్డి అన్నారు. అసెంబ్లీలో తాను చెప్పిన మాటలను జగదీశ్‌రెడ్డి అంగీకరించారన్నారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి రాష్ట్ర రహదారుల కోసం నిధులు అడుగుతానని చెప్పిన కోమటిరెడ్డి.. బీఆర్‌ఎస్ ఎత్తేసిన అన్ని వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ ఇస్తామని చెప్పారు. ఉప్పల్–నారపల్లి ఫ్లైఓవర్‌కు త్వరలోనే రీటెండర్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

ఎవరూ ఎక్కడికీ వెళ్లరు: పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: తమ రాజకీయం ప్రేమతో ఉంటుందని, ఎవరూ ఎక్కడికీ వెళ్లరని, అయినా వెళ్లడానికి అక్కడేముందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులు కలిసిన సందర్భంగా.. గద్వాల ఎమ్మెల్యే మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి వెళ్తున్నారు కదా అని ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు. అన్నదమ్ముల మధ్య చిన్న చిన్న ఇబ్బందులుంటాయని, అయినా వచ్చిన వాళ్లు వెళ్తారా అని ప్రశ్నించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎక్కడికీ వెళ్లరని, పాత పరిచయంతోనే బీఆర్‌ఎస్ నేతలను కలిసి ఉంటారని వ్యాఖ్యానించారు.

ఏ ప్రాతిపదికన రుణమాఫీ రైతులను గుర్తించారు?

అసెంబ్లీలో బీజేపీఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి నిలదీత



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో చెప్పాలని బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో మాట్లాడుతూ... రుణమాఫీకి ముందు రూ.40వేల కోట్లు అవుతుందని చెప్పి, తర్వాత దాన్ని రూ.31 వేల కోట్లు ఉంటుందని చెప్పారని... బడ్జెట్లో రూ.26 వేల కోట్లకే పరిమితం చేశారని ప్రస్తావించారు. అంతేకాదు 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ అన్నారని, తర్వాత 44 లక్షల రైతులకు తగ్గించారని చెప్పారు. ఆ తర్వాత అదింకా ఎందుకో తగ్గిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారని ఇది ప్రభుత్వ కార్యక్రమం కాబట్టే ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు.

అప్పుడు తన స్కూళ్లను మూసివేస్తా: ప్రభుత్వ స్కూళ్లను మంచిగా తయారు చేస్తే, తాను నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లను మూసేస్తానని బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే పోడు భూముల రైతులకు పట్టాలిచ్చారని కానీ కేసీఆర్ మాత్రం తన పార్టీ కార్యకర్తలకే ఇచ్చుకున్నారని విమర్శించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ...పోడు భూములు వందల ఎకరాలు ఎవరివద్ద ఉన్నా, వాటిని పంచాల్సిందేనన్నారు.

19 పద్దులకు సభ ఆమోదం

నేడు ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మూడో శాసనసభ మూడో విడత సమావేశాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం ఒక ప్రభుత్వ బిల్లుతో పాటు 2024–25 వార్షిక బడ్జెట్‌లోని వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 19 పద్దులపై చర్చ జరిగింది. మంత్రుల సమాధానాల అనంతరం సభ వాటికి ఆమోదం తెలిపింది. పద్దులపై సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన చర్చ మంగళవారం తెల్లవారుజామున 3.10 గంటల వరకు కొనసాగింది. తిరిగి మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన అసెంబ్లీ వరుసగా రెండోరోజు కూడా పద్దులపైనే చర్చించింది. పశు మత్స్య పరిశ్రమ, క్రీడలు యువజన సేవలు, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం, నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి, పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకారం, పర్యాటక, కళలు.. సాంస్కృతిక, ధర్మాదాయ, అడవులు, శాస్త్ర సాంకేతికత, మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, ప్రజాసంబంధాల శాఖల పద్దులపై జరిగిన చర్చలో సభ్యులు పాల్గొన్నారు. పద్దులను ఆమోదించిన అనంతరం శాసనసభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అలాగే యువ భారత నైపుణ్యాల విశ్వవిద్యాలయం (స్కిల్స్ యూనివర్సిటీ), ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య బిల్లు–2024ను సభలో ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరుతూ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. అసెంబ్లీ ఉభయ సభల్లో బుధవారం ద్రవ్య వినిమయ బిల్లు చర్చకు రానుంది. దీంతో ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్ వేర్వేరుగా బులెటిన్లు జారీ చేశారు.

అసెంబ్లీ 'రికార్డు'

- తెల్లవారుజామున మూడు గంటల వరకు సాగిన సెషన్
- అర్ధరాత్రి 12:40 గంటల తర్వాత పద్దులపై భట్టి సమాధానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సరికొత్త రికార్డును నమోదు చేశాయి. సోమవారం బడ్జెట్ పద్దులపై ఏకధాటిగా 17గంటల 17 నిమిషాలపాటు చర్చ సాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సభ తెల్లవారుజామున 3:17 గంటల వరకు జరిగింది. ద్రవ్యవినిమయ బిల్లును బుధవారం సభ ఆమోదించాల్సి ఉండటంతో సోమ, మంగళవారాల్లో 19 పద్దుల చొప్పున ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టింది. రాజకీయ పక్షాల నడుమ సాగిన ఆరోపణలు, ప్రత్యారోపణలకు తోడు అన్ని పార్టీలకు చెందిన సభ్యులు ఎక్కువ సంఖ్యలో చాలాసేపు మాట్లాడటం, మాట్లాడిన అందరికీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తగినంత సమయం ఇవ్వడంతో సభ చాలా సేపు నడిచింది. అర్ధరాత్రి 12:40 గంటలకు బడ్జెట్ పద్దులపై ఉపముఖ్యమంత్రి భట్టి సమాధానమిచ్చారు. ఆ తర్వాత పలువురి సభ్యుల సందేహాల నివృత్తి చేసి పద్దులను సభ ఆమోదించే సరికి తెల్లవారుజామున 3:17 గంటలు అయింది. అప్పటివరకు సభలోనే ఉన్న గడ్డం ప్రసాద్‌కుమార్ ఓపికతో సభను నడిపించారు. మళ్లీ మంగళవారం ఉదయం 10గంటలకు అసెంబ్లీ మళ్లీ యథాతథంగా సమావేశమైంది.

రుణమాఫీలో అన్నీ లొసుగులే: పల్లా



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీలో అన్నీ లొసుగులే ఉన్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం బడ్జెట్ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ కింద రూ.16,644 కోట్లు చెల్లిస్తే, ఇప్పుడు రూ.లక్షన్నర మాఫీకి కూడా రూ.12 వేల కోట్లు రాలేదన్నారు. రాష్ట్రంలో రైతుల రుణాలు రూ.40 వేల కోట్లు ఉంటే, ప్రభుత్వం రూ.31 వేలు కోట్లు మాఫీ చేస్తానని ప్రకటించి, బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు పెట్టి, రూ.12 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని పల్లా ఎద్దేవా చేశారు. రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనలు, కుటుంబంలో ఒక ఉద్యోగి ఉన్నా రుణ మాఫీ జరగలేదన్నారు. దీనికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందిస్తూ.. రేషన్‌కార్డు కుటుంబ నిర్ధారణ కోసమేనని స్పష్టం చేశారు. ఐదేళ్లలో పంట రుణాలు తీసుకున్న వారందరికీ మాఫీ జరుగుతుందని చెప్పారు. రైతు ఆత్మహత్యలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా తగ్గాయని పేర్కొన్నారు.

కేసీఆర్ సొంత పుస్తకం చదువకే ఓడిపోయారు: సామేల్

తాను 80 వేల పుస్తకాలు చదివానని చెప్పే కేసీఆర్, తన పుస్తకాన్ని చదవనందునే ఎన్నికల్లో ఓడిపోయారని కాంగ్రెస్ సభ్యుడు సామేల్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎం అయినప్పుడు రాష్ట్రానికి న్యాయం జరుగుతుందనుకున్నామని, కానీ, ఏ గోల్కొండ కింద గోరీ కడతామని పాడుకున్నామో అక్కడే పంద్రాగస్టు వేడుకలు నిర్వహించినప్పుడే ఆయన తీరు మారిందని తేలిపోయిందన్నారు.

మా జన్మ ధన్యమైంది

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించాం. సోనియా, రాహుల్‌గాంధీలిచ్చిన మాట మేరకు వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించేందుకు రుణమాఫీ చేస్తున్నాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

తొలి విడత తర్వాత రెండు వారాలు కాకుండానే

'రైతులకు రుణమాఫీ చేస్తామంటే ఎలా చేస్తారని కొందరు శాపనార్థాలు పెట్టారు. కానీ మా చిత్తశుద్ధి, పరిపాలన దక్షతతో చేసి చూపించాం. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని శంకించలేరు.. ప్రణాళికలను ప్రశ్నించలేరు. తొలి విడత రైతు రుణమాఫీ చేసిన తర్వాత రెండు వారాలు కూడా కాకముందే రెండో విడత రుణమాఫీ చేస్తున్నాం. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖింపదగినవి. గత ప్రభుత్వం రూ.7 వేల కోట్లు మాఫీ చేయకుండా చేతులెత్తేసింది. వారు పాలించిన 120 నెలల కాలంలో రుణమాఫీ కోసం రూ.25 వేల కోట్లు కూడా చెల్లించలేకపోయింది. మేం మాత్రం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలోనే ఏకకాలంలో రుణ మాఫీ చేసి, 12 రోజుల వ్యవధిలోనే రెండుసార్లు నిధులు విడుదల చేశాం.

రైతుల కోసమే ఈ రికార్డు

75 ఏళ్ల భారత స్వాతంత్య్ర చరిత్రలో ఏ రాష్ట్రం కూడా రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయలేదు. ఇలా చేయడం ఓ రికార్డు. ఈ రికార్డు తెలంగాణ ప్రజల కోసమే. సాధారణంగా ఎన్నికలున్నప్పుడు ఓట్లడిగే సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు ఇలాంటివి చేస్తుంటాయి. మేము మాత్రం రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ఓట్లు లేనప్పుడు కూడా రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలబడతామనే విశ్వాసాన్ని కలిగించాం..' అని రేవంత్ చెప్పారు.



మంగళవారం అసెంబ్లీ ఆవరణలో జరిగిన రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, స్పీకర్ ప్రసాద్‌కుమార్

మా నిబద్ధతను భట్టి అన్న నిరూపించారు

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి వెళ్లిపోతే.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 8 నెలల్లోనే రూ.43 వేల కోట్లు పాత అప్పులు, వడ్డీలకు కట్టారు. సామాజిక పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లకు అనుమతి, అంగన్‌వాడీల నుంచి ఆశా వర్కర్ల వరకు వేతనాలు.. ఇలా ఏ కార్యక్రమం ఆగకుండానే రైతు రుణమాఫీకి భట్టి అన్న నిధులు సమకూర్చారు. మా నిబద్ధతను నిరూపించారు. ఇందుకు ఆర్థిక శాఖ అధికారులు సహకరించారు..' అంటూ సీఎం అభినందించారు.

సంకల్ప బలమే కారణం: డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు రుణమాఫీ కోసం రాష్ట్రంలోని 16.29 లక్షల రైతు కుటుంబాలకు చెందిన 17.91 లక్షల ఖాతాల్లో రూ.12,208 కోట్లు జమ చేశామని తెలిపారు. 'రుణ మాఫీ ఎప్పుడో చేస్తారులే అన్న ఊహలు పటాపంచలు చేశాం. ఇందుకు సంకల్ప బలమే కారణం. ప్రతి క్షణం ప్రజలకు మేలు చేసేందుకే మేం తపిస్తున్నాం. అందుకే ఒక్కరోజు కూడా అలస్యం కాకూడదనే ఉద్దేశంతోనే ఈనెల 15న రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల చేసి, 18న మొదటి విడత నిధులిచ్చాం. మళ్లీ రెండు వారాలు పూర్తి కాకుండానే ఇప్పుడు రెండోవిడత నిధులు విడుదల చేశాం. రూ.2 లక్షల లోపు రుణమాఫీ ఆగస్టు నెలలో పూర్తి చేస్తాం. రైతులకిది పండుగ రోజు. బ్యాంకుల్లో ఉన్న అప్పుల భారం దిగిపోతుంటే వారు సంతోషంగా ఉన్నారు..' అని చెప్పారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

మంత్రి తుమ్మల

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సరిదిద్దుతూనే రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. రుణమాఫీకి నిధులు విడుదల చేసినందుకు గాను రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి రైతు సమాచార పత్రం తీసుకుని తమ సమస్యలు తెలియజేయాలని, నెలరోజుల్లో అర్హులైన అందరు రైతుల ఖాతాల్లోకి రుణమాఫీ నిధులు జమ చేయించే బాధ్యత వ్యవసాయ శాఖదని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులు, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

రెండు విడతల రుణమాఫీ వివరాలు జిల్లాల వారీగా నిధులు కోట్లలో..

జిల్లా	మొదటి దశ		రెండో దశ		మొత్తం	
	ఖాతాలు	నిధులు	ఖాతాలు	నిధులు	ఖాతాలు	నిధులు
నల్లగొండ	85,915	470.08	51,515	514.26	1,37,430	984.34
నాగర్‌కర్నూల్	47,989	271.44	32,406	312.43	80,395	583.87
సంగారెడ్డి	50,702	277.23	27,249	286.76	77,951	563.99
సిద్దిపేట	51,846	281.40	27,875	277.21	79,721	558.61
సూర్యాపేట	56,076	281.95	26,437	250.96	82,513	532.91
ఖమ్మం	57,695	257.35	33,942	262.51	91,637	519.85
రంగారెడ్డి	51,588	267.72	24,007	229.72	75,595	497.44
మెదక్	51,492	257.63	22,850	216.15	74,342	473.78
వికారాబాద్	42,725	232.04	23,912	240.07	66,637	472.12
మహబూబ్‌నగర్	43,881	240.31	22,253	219.18	66,134	459.49
నిజామాబాద్	47,222	237.47	23,769	219.53	70,991	457.01
కరీంనగర్	43,916	230.06	21,785	207.82	85,701	437.90
కామారెడ్డి	47,002	220.09	24,816	211.72	71,818	431.81
నిర్మల్	29,431	167.73	18,728	196.86	48,159	364.60
యాదాద్రి	33,151	181.29	18,127	177.48	51,278	358.78
జగిత్యాల	35,541	188.37	17,903	169.11	53,444	357.48
వరంగల్ (రూ)	30,148	165.07	21,166	190.58	51,314	355.65
నారాయణపేట	28,103	161.76	17,880	186.42	45,983	348.18
మహబూబాబాద్	26,621	150.22	19,443	193.47	46,064	343.69
ఆదిలాబాద్	19,949	127.54	18,390	209.25	38,339	336.78
గద్వాల	23,642	138.98	16,489	166.21	40,131	305.19
జనగామ	23,749	133.27	15,401	159.80	39,150	293.07
మంచిర్యాల	28,589	150.29	14,396	138.88	43,985	289.17
భద్రాద్రి	28,801	136.65	17,309	147.34	46,110	283.99
వనపర్తి	26,223	140.21	15,085	140.86	41,308	281.06
పెద్దపల్లి	30,055	151.37	13,401	124.41	43,456	275.78
ఆసిఫాబాద్	21,776	123.87	14,410	151.06	36,186	274.93
సిరిసిల్ల	23,906	136.04	12,202	117.77	36,106	253.81
వరంగల్ (అ)	19,013	102.67	11,818	108.24	30,831	210.91
భూపాలపల్లి	14,079	79.74	8,851	92.50	22,930	172.24
ములుగు	11,573	65.69	6,215	65.25	17,788	130.94
మేడ్చల్	2,010	9.40	789	6.15	2,799	15.56
హైదరాబాద్	3	0.01	4	0.05	7	0.06
మొత్తం	11,34,412	6,034.96	6,40,823	6,190.01	17,75,235	12,224.97

ఆ బాధ్యత ఫిలిం చాంబర్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ తీసుకోవాలి: చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డులు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రతిపాదనను ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకువెళ్లేలా తెలుగు పరిశ్రమ తరపున ఫిలిం చాంబర్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఆ బాధ్యత తీసుకోవాలి'' అని ప్రముఖ నటుడు చిరంజీవి కోరారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరిట అవార్డులు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా సినీ పరిశ్రమ నుంచి ఎటువంటి స్పందన లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం వ్యాఖ్యానించిన నేపథ్యంలో దీనిపై 'ఎక్స్' వేదికగా చిరంజీవి మంగళవారం స్పందించారు. మరోవైపు దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందిస్తూ ''గద్దర్ పేరుతో అవార్డులు తీసుకోవడానికి ఇండస్ట్రీలో ఎవరికీ అభ్యంతరం లేదు. ఇదే విషయంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం రెండు మూడుసార్లు ప్రయత్నించాం. కానీ సీఎంవో నుంచి పిలుపు రాలేదు. ఇక్కడ కమ్యూనికేషన్ గ్యాప్ ఉంది. సీఎం ఎప్పుడు కలవమంటే అప్పుడు కలిసేందుకు సిద్ధంగా ఉన్నాం'' అన్నారు.

ఏడాదిలో ఆరు నకిలీ డ్రగ్ రాకెట్ల గుట్టురట్టు



సాక్షి, హైదరాబాద్: నకిలీ మందుల తయారీ ముఠాలు, నకిలీ డాక్టర్లు, డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయించే, తప్పుడు ప్రకటనలతో మందులు విక్రయించే మందుల దుకాణదారులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) బృందాలు కొరఢా ఝుళిపిస్తున్నాయి. 2023 నుంచి 2024 జూలై 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా డీసీఏ బృందాలు చేపట్టిన సోదాలు, నమోదు చేసిన కేసుల వివరాల నివేదికను డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయించే మందుల దుకాణాలపై, నకిలీ క్లినిక్‌లపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. ఏడాదిలో ఆరు నకిలీ డ్రగ్ రాకెట్ల గుట్టురట్టుచేశామని, లైసెన్స్ లేని 34 మెడికల్ షాపులను మూసేశామని తెలిపారు. తనిఖీల్లో 59 మంది నకిలీ డాక్టర్లను గుర్తించామన్నారు.

మానవ అక్రమ రవాణాపై పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: మానవ అక్రమ రవాణాపై పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో సీఎం రేవంత్.. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ప్రజ్వల ఫౌండేషన్ నిర్వాహకురాలు సునీతా కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ స్కామ్‌ను సీబీఐకి అప్పగించాలి

కేంద్ర హోంమంత్రికి రాజాసింగ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జీఎస్టీ లావాదేవీలకు సంబంధించి చోటుచేసుకున్న రూ.వెయ్యి కోట్ల కుంభకోణం కేసు విచారణను రాష్ట్ర సీఐడీ నుంచి సీబీఐకి బదిలీ చేయించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం లేఖ రాశారు. రెవెన్యూశాఖకు స్పెషల్ సీఎస్‌గా ఉన్న సందర్భంగా, ఆ తర్వాత సీఎస్ అయ్యాక కూడా రెవెన్యూ రాబడి శాఖలకు సోమేశ్‌కుమార్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారని పేర్కొన్నారు. అందుకే సీబీఐతో విచారణ జరిపిస్తేనే ఉన్నతస్థాయి అధికారుల ప్రమేయంపై వాస్తవాలు బయటపడతాయని ఆయన తెలిపారు.

నేడు రెండో విడత ఇంజనీరింగ్ సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: రెండో దశ ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు బుధవారం చేపడుతున్నారు. సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన ఈ విషయాన్ని వెల్లడించారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లు, కొత్తగా పెరిగిన 7,029 సీట్లు కలుపుకొని ఈ విడతలో మొత్తం 29,777 సీట్లు భర్తీ చేయనున్నారు. తొలి దశలో 78,694 సీట్లు అందుబాటులో ఉంటే, 75,200 సీట్లు కేటాయించారు. ఇందులో 55,941 సీట్లలో విద్యార్థులు ప్రవేశానికి రిపోర్ట్ చేశారు. 22,753 సీట్లు మిగిలిపోయాయి. ఈసారి 58 వేల మంది విద్యార్థులు 61 లక్షల ఆప్షన్లు ఇచ్చారు. గతంలో సీట్లు వచ్చిన వాళ్లు కూడా కాలేజీలు, బ్రాంచీల మార్పునకు ప్రయత్నిస్తున్నారు.

సీడీపీవో, ఈవో పరీక్ష తేదీలివే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో సీడీపీవో కేటగిరీలో 23 ఖాళీలు, ఈవో కేటగిరీలో 181 ఉద్యోగాలకు అర్హత పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. సీబీఆర్‌టీ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహిస్తామని, నార్మలైజేషన్ విధానంలో మార్కులు లెక్కించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. సీడీపీవో ఉద్యోగాలకు సంబంధించి పేపర్-1, పేపర్-2 పరీక్షలు 2025 జనవరి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ట్లు తెలిపింది. ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగాలకు సంబంధించి పేపర్-1, పేపర్-2 పరీక్షలు 2025 జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించనుంది.

నల్లమల 'మన్ కీ బాత్'.. చెంచులే చేయూత!



నల్లమలలోని మేడిమల్కల చెంచుపెంటలో చెంచుల ఆవాసాలు

- అడవిలో పులులు, వన్యప్రాణుల సంరక్షణలో వారి భాగస్వామ్యం
- అటవీ అధికారులతోపాటు వాచర్లుగా చెంచుల సేవలు
- మన్ కీ బాత్‌లో నల్లమల చెంచుల సేవలను కొనియాడిన ప్రధాని మోదీ

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమలలోని పులులు, వన్యప్రాణుల సంరక్షణలో స్థానిక చెంచులు రక్షణగా ఉంటున్నారు. అడవినే నమ్ముకొని బతుకుతున్న వారు ఇక్కడి చెట్లు, వన్యప్రాణులు, సహజ సిద్ధమైన జలధారల పట్ల ఎంతో మమకారంగా ఉంటారు. వన్యప్రాణుల రక్షణకు అటవీశాఖ సిబ్బందిలోనూ చెంచులు క్షేత్రస్థాయిలో పాలు పంచుకుంటూ అడవికి పహారాగా నిలుస్తున్నారు. నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని దట్టమైన కోర్ ఏరియాలో 20 వరకు చెంచుపెంటలు, చెంచుల ఆవాసాలు ఉండగా, వీరి సంపూర్ణ తోడ్పాటుతో పులుల సంతతి క్రమంగా పెరుగుతోంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో 2018లో 12 పులులు ఉండగా, ప్రస్తుతం పులుల సంఖ్య 32కు చేరినట్టు అంచనా వేస్తున్నారు. వీటికి తోడు 187 వరకు చిరుతలు, వందల సంఖ్యలో వన్యప్రాణులు, మిశ్రమ జంతుజాతులకు నల్లమల నిలయమైంది. ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ నల్లమలలోని చెంచుల కృషిని ప్రస్తావించారు. ప్రకృతితో మమేకమవుతూ జీవిస్తున్న చెంచులు నల్లమలలో టైగర్ ట్రాకర్లుగా గొప్ప సేవలందిస్తున్నారని కొనియాడారు.

ఇక్కడ సంఘర్షణకు తావులేదు..

దేశంలో చాలాచోట్ల పులుల అభయారణ్యాల్లో మనుషులు, జంతువులకు మధ్య సంఘర్షణ తలెత్తుతోంది. మనుషులపై పులుల దాడులు చేస్తున్న సంఘటనలు పెరుగుతున్నాయి. అయితే నల్లమలలోని అమ్రాబాద్ కోర్ ఏరియాలోని దట్టమైన అరణ్యంలో చెంచులు నివసిస్తుండగా.. చెంచులు, పులులకు మధ్య ఇప్పటివరకు ఎలాంటి సంఘర్షణ తలెత్తలేదు. అడవిలో పులులు, వన్యప్రాణులకు ఆటంకం కలగకుండా జీవనం సాగిస్తున్నారు. అడవిలో ఎప్పుడైనా పులితోపాటు ఇతర వన్యప్రాణులు ఎదురైన సందర్భంలో దూరం నుంచే గమనించి వాటి స్వేచ్ఛా విహారానికి భంగం కలిగించకుండా మసులుకుంటారు.

క్షేత్రస్థాయిలో వాచర్లుగా చెంచులు..

అటవీ, వన్యప్రాణుల సంరక్షణతోపాటు పులుల అడుగుజాడలను గుర్తించడం, క్షేత్రస్థాయి విధుల్లో అటవీశాఖ ఇక్కడి స్థానిక చెంచులనే భాగస్వాములను చేస్తోంది. పులుల జాడ తెలుసుకునేందుకు, పాదముద్రలు, విసర్జితాల సేకరణ, పులులు తిరగాడిన ప్రాంతాలకు వెళ్లేందుకు సుమారు 130 మంది చెంచు సిబ్బందిని అటవీశాఖ నియమించుకుంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో మొత్తం 27 బేస్‌క్యాంపులకు గానూ 24 క్యాంపుల్లో చెంచులే పనిచేస్తున్నారు. టైగర్ ట్రాకర్లు, ఎనిమల్ ట్రాకర్లు, ఫారెస్ట్ వాచర్లుగా చెంచులే క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. నల్లమలలో చెంచులు, సమీప ఆవాసాల ప్రజల సహకారంతోనే పులుల సంతతి పెరిగిందని నాగర్‌కర్నూల్ డీఎఫ్‌ఓ రోహిత్ తెలిపారు. అడవిలో క్షేత్రస్థాయి విధుల్లో ఎక్కువగా చెంచులే సేవలందిస్తున్నారని, భవిష్యత్‌లోనూ వీరి సంఖ్యను మరింత పెంచనున్నట్టు వివరించారు.

పులి కనిపిస్తే ఆగిపోతాం..



అడవిలో పోతున్నప్పుడు పులి ఎదురైతే దూరం నుంచే చూసి అక్కడే ఆగిపోతాం. చప్పుడు చేయకుండా ఉండి పులి అక్కడి నుంచి వెళ్లే దాకా వేచిచూస్తాం. వాటి జోలికి వెళ్లకుండా ఉంటే మమ్మల్ని ఏమీ చేయవు. పులులు, వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా పనులు చేసుకుంటాం.

– గురువయ్య, మేడిమల్కల చెంచుపెంట, నాగర్‌కర్నూల్ జిల్లా

నా తండ్రి ఇప్పటికీ అడవికెళ్తాడు

అసెంబ్లీలో మంత్రి సీతక్క ఉద్వేగం



సాక్షి, హైదరాబాద్: 'నేను మంత్రిని అయినా.. నా తండ్రి ఇప్పటికీ గుట్టకు వెళ్తాడు. రెక్కలు ముక్కలు చేసుకుని పదెకరాలు సాగులోకి తెచ్చాడు. ఇది ఎవరో దయాదాక్షిణ్యంగా ఇచ్చింది కాదు... ఇది మా హక్కు' అంటూ మంత్రి సీతక్క శాసనసభలో ఉద్వేగంగా మాట్లాడారు. సభలో బడ్జెట్ పద్దులపై మంగళవారం చర్చ జరిగింది. బీఆర్‌ఎస్ సభ్యుడు అనిల్‌జాదవ్ మాట్లాడుతూ, మంత్రి తల్లిదండ్రులకు పోడు పట్టాలిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే నన్నారు. దీనిపై మంత్రి సీతక్క స్పందించారు. 'నా తల్లిదండ్రులు అటవీ హక్కు చట్టానికి అర్హులు. ఎక్కడా దానం తీసుకోలేదు. పోడు చేసుకుంటూ పదెకరాలు సాగులోకి తెచ్చారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన చట్టం ప్రకారం హక్కులొచ్చాయి. నా తండ్రి అడవి కొట్టుకుని బతికేవాడు. నేను మంత్రిని అయినా ఇప్పటికీ రోజూ ఆయన గుట్టకే వెళ్తాడు. కావాలంటే వెళ్లి విచారించుకోండి. రైతుబంధు తీసుకునేవాళ్లలో ఎమ్మెల్యేలు, మంత్రులున్నారు. ఆదివాసీ బిడ్డను కాబట్టే పదేపదే మా తల్లిదండ్రులకు ఇచ్చినమని చెబుతారు. ఇంకోసారి ఇలా అనొద్దు' అంటూ ఆవేశంగా అన్నారు.

ఆదివాసీలకు బీఆర్‌ఎస్ చేసిందేంటి?

పదేళ్ల బీఆర్‌ఎస్ ఆదివాసీలకు చేసిన సంక్షేమం ఏమిటో చెప్పాలని మంత్రి కోరారు. ఎస్సీ, ఎస్టీలకు హోదా కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ఏజెన్సీ ప్రాంతాల్లో వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని చెప్పారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన 10% రిజర్వేషన్ కూడా ఇంకా కోర్టులో ఉందన్నారు.

బీఆర్‌ఎస్ వాకౌట్

▶ మొదటి పేజీ తరువాయి

వహిస్తానని, ఏదీ జరగకుండానే జరిగినట్లు ఆరోపించడం తగదని చెప్పారు. మీ హయాంలో రబీలో సేకరించిన ధాన్యం మిల్లుల్లో లేదన్నారు. అప్పట్లో ప్రభుత్వం ధాన్యం విక్రయానికి టెండర్లు పిలిస్తే క్వింటాల్‌కు రూ. 1700 మాత్రమేనని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక దొడ్డు బియ్యానికి రూ.2007, సన్నధాన్యానికి రూ.2400 ఇచ్చినట్లు గుర్తు చేశారు.

పారిపోయారు: శ్రీధర్‌బాబు

పౌరసరఫరాల పద్దుపై విపక్ష సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పూర్తిగా సమాధానం ఇచ్చినా కూడా వారు సభ నుంచి పారిపోయారని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. వారి హయాంలో అన్ని అవకతవకలేనని దుయ్యబట్టారు. పదేళ్లలో ఒక్క రైతుకైనా పంట నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు.

సభనా..? బస్టాండా..?: భట్టి విక్రమార్క

'ఇది సభనా? బస్టాండా? సభలో వెల్‌లోకి వచ్చి చప్పట్లు కొట్టడం ఏంటి..? వారు మంత్రులుగా పనిచేశారు.. ఇదేం పద్ధతి? పదేళ్లు మేము ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడైనా ఇలా సభామర్యాదలను అగౌరవపరిచామా? వెల్‌లోకి వచ్చి చప్పట్లు కొట్టడం, ప్లకార్డులు ప్రదర్శించడం సబబు కాదు. సభాసంప్రదాయాలను మంట కలిపేలా వ్యవహరించడం సరి కాదు. ప్రజలు ఇప్పటికే వారికి బుద్ధి చెప్పారు. బుద్ధి తెచ్చుకొని వారిని సీట్లలోకి వెళ్లి కూర్చోమనండి అధ్యక్షా..! సభాసంప్రదాయాలు పాటించే వారే ఈ సభలో ఉండాలి' అంటూ భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కనీసం 20 రోజులు జరపాలి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: వచ్చే బడ్జెట్ సమావేశాలను కనీసం 20 రోజుల పాటు నిర్వహించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం శాసనసభలో మాట్లాడుతూ..19 పద్దులను ఒకేరోజు పెట్టారని, తెల్లవారుజామున 3 గంటల వరకు సభను నిర్వహించారని తెలిపారు. ఈసారి సమగ్రంగా చర్చించేలా పద్దులు పెట్టా లని సూచించారు. కొత్తగా 57 మంది ఎమ్మెల్యేలుగా సభలో అడుగుపెట్టారని, వారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనపై మంత్రి డి.శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు.



సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ దంపతుల కుమార్తెలు నీలోత్పల, విపంచి, విరాజిని చిత్రకళా నైపుణ్యం భళా.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే కుమార్తెలు ముగ్గురు కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను గీశారు. వీటిని హైదరాబాద్‌లో మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రి పొంగులేటి వారిని అభినందించారు. – సత్తుపల్లి

'ధాన్యం విక్రయ టెండర్లలో రూ.750 కోట్ల గోల్‌మాల్'



సాక్షి, హైదరాబాద్: గోడౌన్‌లు, రైస్‌మిల్లులలో ధాన్యాన్ని ఖాళీ చేసేందుకు, విక్రయించేందుకు పిలిచిన టెండర్ల కేటాయింపులో రూ.750 కోట్ల మేర గోల్‌మాల్ జరిగిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. మంగళవారం రాత్రి అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేస్తే, నాలుగు సంస్థలే అర్హత సాధించాయని, ఆ సంస్థలేవో ఇప్పటివరకు బహిర్గతం చేయలేదన్నారు. టెండర్లు దక్కించుకున్న ఆ నాలుగు సంస్థలు ఇప్పటివరకూ 35 కిలోల ధాన్యాన్ని కూడా సేకరించలేదని, 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి బదులుగా మిల్లర్ల నుంచి ఒక్కో క్వింటాలుకు రూ. 2,223 వసూలు చేశారని గంగుల ధ్వజమెత్తారు. ధాన్యానికి బదులు డబ్బులు వసూలు చేస్తే మిల్లుల్లో, గోడౌన్‌లలో ఉన్న ధాన్యం ఎలా ఖాళీ అవుతుందని ప్రశ్నించారు. అలాగే గురుకులాలు, మధ్యాహ్న భోజనం కోసం పాఠశాలల్లో ఇచ్చే సన్న బియ్యంకు అవసరమైన 1.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి, అవే సంస్థల నుంచి కిలో బియ్యాన్ని రూ.57కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో కూడా కుంభకోణం ఉందని, ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు.

ఆగస్టు 3న మంత్రివర్గ ఉపసంఘం భేటీ

జీవో 317 వినతులపై నిర్ణయం తీసుకునే చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన జోనల్ విధానానికి అనుగుణంగా, జీవో 317 ప్రకారం చేపట్టిన ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించి వచ్చిన వినతుల పరిష్కారం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆగస్టు 3న సచివాలయంలో భేటీ కానుంది. ఇప్పటికే పలుమార్లు సమావేశమైన ఈ కమిటీ.. వచ్చేనెల 3న జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యోగ కేటాయింపుల్లో అధికారుల నిర్ణయంతో అన్యాయం జరిగిందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు 55 వేల మంది ఉద్యోగులు వినతులు సమర్పించారు. వీటిని ప్రభుత్వ శాఖల వారీగా వేరు చేసి ఆయా శాఖలకు పంపించారు. వినతులు సమర్పించిన ఉద్యోగుల వారీగా పురోగతిని మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని సాధారణ పరిపాలన విభాగం రాష్ట్ర ప్రభుత్వ శాఖలను ఆదేశించింది. ఈమేరకు ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించిన జీఏడీ... అన్ని ప్రభుత్వ శాఖలకు ఆ ఫార్మాట్‌ను పంపింది. నిర్ణీత ఫార్మాట్‌లో సదరు సమాచారాన్ని ఆగస్టు 2వ తేదీ నాటికి జీఏడీకి సమర్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా మంగళవారం ప్రభుత్వ శాఖలకు నోట్ జారీ చేశారు.

23 సంఘాలతో కొత్త టీచర్స్ జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న టీచర్ల జేఏసీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం దిశగా 23 సంఘాలతో కలిపి టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్) మంగళవారం ఏర్పడింది. గౌరవ చైర్మన్‌గా గాలి హర్షవర్ధన్‌రెడ్డి, చైర్మన్‌గా మునగాల మణిపాల్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా పర్వతి సత్యనారాయణ, డిప్యూటీ చైర్మన్‌గా చింతకుంట జగదీశ్ ఎన్నికైనట్లు జాక్ ఒక ప్రకటనలో తెలిపింది. టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించడం, అన్ని రకాల పదోన్నతులు కల్పించడం సీపీఎస్ రద్దు సహా పలు అంశాల సాధనకు కృషి చేయాలని జాక్ నిర్ణయించింది. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించడం, బదిలీలు చేపట్టడంపై జాక్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

మార్క్‌ఫెడ్‌లో రూ.60 లక్షలు మాయం

- కరీంనగర్ జిల్లాలో ఎరువుల కమీషన్ నొక్కేసిన ఓ ఉద్యోగి
- ఇతర జిల్లాల్లోనూ ఇలా రూ. కోట్లలో అక్రమాలకు పాల్పడినట్టు అనుమానాలు
- వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ తదితర ఉమ్మడి జిల్లాలపై నిఘా

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్‌లో ఎరువులు అమ్మగా వచ్చిన కోట్లాది రూపాయల సొమ్మును కొందరు ఉద్యోగులు కాజేస్తున్నారు. ఇది మంగళవారం వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఒక ఎరువుల యూనిట్‌కు చెందిన డబ్బును అందులో పనిచేసే ఒక ఉద్యోగి ఏకంగా రూ. 60 లక్షలు కాజేయడం వ్యవసాయ శాఖను కుదిపేసింది. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఎరువుల యూనిట్‌ను నడుపుకునేందుకు మార్క్‌ఫెడ్‌లో పనిచేసే ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి అవకాశం కల్పించారు. అంటే అందులో పనిచేసే ఉద్యోగే తాను ఒక లైసెన్స్‌డ్ షాపు నిర్వహిస్తున్నాడన్నమాట. దానికి ఎరువులను మార్క్‌ఫెడ్ నుంచి తెప్పించుకున్నాడు. ఆ షాపులో తాను అమ్మగా వచ్చిన ఆదాయంలో మార్క్‌ఫెడ్‌కు 50 శాతం కమీషన్ చెల్లించాలి. కానీ ఆ సొమ్మును మార్క్‌ఫెడ్ రికార్డుల్లోని కాగితాల్లో మాత్రమే రాసి పెట్టి, డబ్బులు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇలా రూ.60 లక్షలు కాజేసినట్టు తేలింది. అయినా అక్కడి అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించారు. గతంలోనూ అక్కడ ఇంకా ఏమైనా ఇలాంటి సంఘటనలు జరిగాయా లేదా అన్నదానిపై ఆరా తీస్తున్నారు. అంతేకాదు ప్రస్తుతం హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న ఒక అధికారి అక్కడి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలోనూ ఇలాంటి సంఘటన జరిగినట్టుగా అనుమానిస్తున్నారు. అతనిపైనా నిఘా పెట్టారు. ఆయన్ను వివరణ కోసం ప్రయత్నించగా, తనకు సంబంధం లేదని పేర్కొనడం గమనార్హం. మరోవైపు ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇలాంటి సంఘటనలు జరిగాయా లేదా అన్నదానిపై నిఘా పెట్టినట్టు తెలిసింది. జిల్లాలో మార్క్‌ఫెడ్ అధికారుల ప్రమేయం లేకుండా ఈ ఘటనలు జరగవని అంటున్నారు. రాష్ట్రస్థాయిలో ఎక్కడెక్కడ ఇలాంటి కమీషన్లు కాజేసిన ఘటనలు జరిగాయోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'టెండర్ దక్కకుంటే నీ అంతుచూస్తా'

ఇదిలాఉండగా, మార్క్‌ఫెడ్‌లో ఎరువుల రవాణాకు సంబంధించి హైదరాబాద్‌లో టెండర్‌ప్రక్రియ జరుగుతోంది. అందులో పలు ఏజెన్సీలు టెండర్లు వేశాయి. కొన్ని ఏజెన్సీలు టెండర్లలో సాంకేతికంగా అర్హత పొందాయి. అయితే అందులో ఒక ఏజెన్సీ నిర్వాహకుడు మార్క్‌ఫెడ్‌లోని ఒక అధికారికి ఫోన్ చేసి తనకు ఈ టెండర్ దక్కకుంటే 'నీ అంతు చూస్తాన'ని ఫోన్‌లో బెదిరించినట్టు సమాచారం. దానికి మార్క్‌ఫెడ్‌లోనే పనిచేసే సహ అధికారే వెనుక నుంచి కథ నడిపిస్తున్నట్టు సమాచారం. ఆ అధికారే ఆ ఏజెన్సీ నిర్వాహకుడికి టెండర్ దక్కేలా పావులు కదుపుతున్నాడు. అతని ప్రోద్బలంతోనే ఇలా జరిగి ఉంటుందని చర్చ జరుగుతోంది. దీంతో బెదిరింపులకు గురైన అధికారికి ఏం చేయాలో పాలు పోవడంలేదు.

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ మేధావుల ఫోరంలో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో చెరుకు సుధాకర్, ఆకుల లలిత, పూల రవీందర్, చిరంజీవులు తదితరులు

బంజారాహిల్స్(హైదరాబాద్): రాష్ట్రంలో బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. మంగళవారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వక్తలు మాట్లాడారు. జనాభాలో 60 శాతం కలిగి ఉన్న బీసీలకు దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీల మేరకు బీసీ కులగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు న్యాయం చేయడం కోసం ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. కనీసం అడ్వొకేట్ జనరల్, అదనపు అడ్వొకేట్ జనరల్ తదితర పోస్టులు బీసీలకు కేటాయించాలని తాను నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చానని, అయితే 'మనకు ఇచ్చే ఇంట్రెస్ట్ లేదంటూ..' దాటవేయడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జనాభాలో రెండుశాతం ఉన్న కమ్మలు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవులు అనుభవించారని, గతంలో మేడ్చల్‌లో రెడ్ల సమావేశం ఏర్పాటు చేసుకొని రెడ్లందరూ ఏకమై రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని తీర్మానించుకున్నారని గుర్తు చేశారు. అయితే జనాభాలో 60 శాతం దాకా ఉన్న 136 బీసీ కులాలకు మాత్రం ఎలాంటి పదవులు దక్కకపోవడం వెనక మర్మం ఏంటని ప్రశ్నించారు. త్వరలోనే బీసీ సంఘాలన్నీ కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. బీసీ మార్చ్, కలెక్టరేట్ల ముట్టడి,అసెంబ్లీ ముట్టడి చేపడతామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీల నుంచి కొందరి మినహాయింపు

- ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ ఫిర్యాదు
- ఆయుష్‌లో విడో సర్టిఫికెట్ చింపేసి బదిలీ నిలిపేసిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: సాధారణ బదిలీల నుంచి కొంతమంది డాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా మినహాయింపు పొందారని ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూరావు మంగళవారం ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ లాలూప్రసాద్ తదితరులు తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీజీజీడీఏ) ఆఫీస్ బేరర్లమని చెప్పుకుని బదిలీల నుంచి మినహాయింపు పొందారని, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం వీరు మినహాయింపులకు అర్హులు కారని బాబూరావు తెలిపారు. పల్లం ప్రవీణ్ 19 ఏళ్లుగా, లాలూప్రసాద్ 12 ఏళ్లుగా హైదరాబాద్‌లోనే పనిచేస్తున్నారని, నిబంధనల ప్రకారం ఆరేళ్లకు పైబడి ఒకే జిల్లాలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాల్సి ఉన్నా.. అధికారులు వీరిని హైదరాబాద్ నుంచి కదపడం లేదని ఫిర్యాదు కాపీలో పేర్కొన్నారు. ఈ అంశంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఆయన కోరారు. కాగా, ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో బదిలీలు చాలా అన్యాయంగా జరిగాయని పలువురు డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా కాకుండా ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు తీసుకొని ఇష్టారాజ్యంగా బదిలీలు చేశారని పలువురు అభ్యర్థులు మండిపడుతున్నారు. ఒక డాక్టర్ తన భర్త చనిపోయినట్లు విడో ఆప్షన్ కింద దరఖాస్తు చేస్తే, విడో సర్టిఫికెట్ చింపేసి ఆమెను బదిలీ చేయకుండా నిలిపివేశారు. దీంతో ఆమె ఆయుష్ అధికారులను నిలదీయగా అసలు ఆ సర్టిఫికెట్ పెట్టలేదని బుకాయిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. లక్షలాది రూపాయలు లంచంగా తీసుకొని ఇష్టమైన వారికి నచ్చిన చోట బదిలీ చేపట్టారని చెబుతున్నారు. అలాగే రీజనల్ డైరెక్టర్ పోస్టును అర్హులకు కాకుండా ఇతరులకు ఇచ్చినట్లు ఒక డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

నారాయణపేట్-కొడంగల్ లిఫ్టును అడ్డుకోండి

కృష్ణా బోర్డుకు ఏపీ లేఖ... ప్రాజెక్టుకు అనుమతుల్లేవని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించకుండా నిలువరించాలని కృష్ణా నదీయాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఇటీవల లేఖ రాశారు. ఏడు టీఎంసీల కృష్ణా జలాలను తరలించి లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. రూ.1,894 కోట్ల వ్యయం ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లను తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించిందని, వెంటనే నిలుపుదల చేయించాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్-1, 2ల ద్వారా ఈ ప్రాజెక్టుకు ఎలాంటి నీటి కేటాయింపులు లేవని, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు సైతం లేవని గుర్తుచేశారు. సీడబ్ల్యూసీ, కృష్ణాబోర్డు, అపెక్స్ కౌన్సిల్ నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

హెచ్‌సీఏ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

ఉప్పల్ (హైదరాబాద్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే హెచ్‌సీఏ కార్యాలయం నుంచి ఏసీబీ అధికారులు కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సోదాలు గత కొన్ని రోజులుగా దశలవారీగా జరుగుతున్నట్లు సమాచారం.



ప్రాపంచిక బంధాల నుండి,
ప్రత్యేకించి మనం ఆరాటపడే వస్తువుల నుండి
స్వేచ్ఛ పొందే లక్షణాన్నే బుద్ధుడు విముక్తి అని అన్నాడు.
– బుద్ధదాన భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 31 జూలై 2024

కోచింగ్ కోళ్ళఫారాలు

వ్యవస్థల్ని నడిపే వ్యక్తులు చేయాల్సిన పని చేయకపోతే... విషాదం ఎలా ఉంటుందో చెప్పడానికి శనివారం సాయంత్రం ఢిల్లీలోని ఓ ప్రసిద్ధ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఘటనే ఉదాహరణ. నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది అడుగుల లోతు బేస్‌మెంట్‌లో నడుపుతున్న స్టడీ సెంటర్‌లోకి పైపులు పగిలి నీళ్ళు వెల్లువెత్తినప్పుడు, జలదిగ్బంధంలో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకున్న తీరు కన్నీరు తెప్పిస్తుంది. పూర్తిస్థాయి ఈ మానవ తప్పిదానికి ముగ్గురు చనిపోయారని అధికారికంగా చెబుతున్నా, సంఖ్య అంతకన్నా ఎక్కువే ఉంటుందట. పది పన్నెండు మంది కనిపించట్లేదట. కొద్దిరోజుల క్రితం పొంగిపొర్లిన వర్షపునీటి వీధిలో విద్యుదాఘాతంతో ఒక ఐఏఎస్ కోచింగ్ విద్యార్థి మరణించినప్పుడే వ్యవస్థ మేల్కొని ఉండాల్సింది. దురదృష్టవశాత్తూ అది జరగలేదు. ఇప్పుడీ తాజా ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. గమనిస్తే, క్రిక్కిరిసిన అభ్యర్థులతో కోళ్ళఫారాలుగా మారిన కోచింగ్ సెంటర్లు, కిందికి వేలాడుతున్న కరెంట్ తీగలు, వర్షం పడితే చాలు వీధుల్లో కాలువలు కట్టే నీళ్ళు, అధ్వాన్నమైన డ్రైనేజ్ వ్యవస్థ, అవినీతికి పాల్పడి అన్నిటినీ వదిలేసిన అధికార యంత్రాంగం... అలా ఇది సామూహిక వైఫల్యం. సమష్టిగా అందరూ చేసిన పాపం.

ఒకరిద్దరు అధికారుల సస్పెన్షన్, యజమానుల లాంటి పెద్ద చేపల్ని వదిలేసి చిరుద్యోగుల అరెస్ట్, ఘటనకు దారి తీసిన కారణాలు – నివారణ చర్యలపై నివేదికకు కేంద్ర హోమ్‌శాఖ ప్రత్యేక ప్యానెల్ ఏర్పాటు లాంటివి చకచకా జరిగాయి. కానీ, పోయిన ఆ ప్రతిభావంతుల ప్రాణాలు తిరిగొస్తాయా? వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లితండ్రుల గర్భశోకం తీరుస్తాయా? శనివారం నుంచి విద్యార్థులు బైఠాయించి, శాంతియుత నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వాలు వారికి తగిన హామీనిచ్చి సాంత్వన పరచలేకపోవడం మరో వైఫల్యం. ఢిల్లీలో వేర్వేరు ప్రాంతాలకు విస్తరిస్తున్న ఈ విద్యార్థి నిరసనల వద్ద ప్రచారం కోసం కాసేపు కనిపించిపోతున్న టీచర్లు, పరస్పర నేరారోపణలు చేసుకుంటున్న రాజకీయ నేతలను చూస్తుంటే వెగటు పుట్టక మానదు. ప్రజలెన్నుకున్న ఢిల్లీ 'ఆప్' సర్కార్‌పై కేంద్రం పనుపున లెఫ్టినెంట్ గవర్నర్, ఆయన తైనాతీ అధికారుల పెత్తనం ఒక తప్పయితే... క్షేత్రస్థాయిలో లేకున్నా జైలు నుంచే రోజువారీ పాలన సాగిస్తానంటున్న ఢిల్లీ సీఎం మొండి వైఖరి మరో తప్పు. శిక్ష, నష్టం మాత్రం ఢిల్లీలో ప్రజలకు, పరిపాలనకు పడుతోంది.

ఢిల్లీలో పుట్టగొడుగుల్లా వెలిసిన కోచింగ్ కేంద్రాల్లో ప్రమాదాలు జరగడం ఇదేమీ తొలిసారి కాదు. ఏడాది క్రితం కూడా ఢిల్లీ ఉత్తర ప్రాంతంలోని ఓ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. 61 మంది విద్యార్థులు గాయపడ్డారు. అప్పుడూ ఇలాగే జనాగ్రహం పెల్లుబికింది. సదరు కేంద్రం పర్మిట్ లేకుండా అక్రమంగా నడుస్తున్నట్టు అప్పట్లో అగ్నిమాపక శాఖ ప్రకటించింది. ఢిల్లీలో 600 దాకా కోచింగ్ సెంటర్లుంటే, వాటిలో 67కే అనుమతులున్నాయట. కఠిన చర్యలు తీసుకుంటామంటూ పాలకులు అప్పుడూ చెప్పారు, ఇప్పుడూ చెబుతున్నారు. కానీ, చేసింది శూన్యం. నిజానికి, 2021 నాటి ఢిల్లీ మాస్టర్ ప్లాన్, అలాగే 2016 నాటి యూనిఫైడ్ బిల్డింగ్ బైలాస్ భవనాల సెల్లార్ల వినియోగంపై స్పష్టమైన నిబంధనలు విధించాయి. అయినా సరే బేస్‌మెంట్లలో కోచింగ్ కేంద్రాలు, వాటి లైబ్రరీలు, జిమ్‌లు, షాపులు నడుస్తూనే ఉన్నాయి. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా అనేక ప్రధాన నగరాల్లో, పట్టణాల్లో ఇలాంటి పొంచివున్న ప్రమాదాలు అనేకం. ఏ క్షణమైనా ఏదైనా జరగవచ్చని తెలిసినా, ఈ ఉల్లంఘనలపై అన్నిచోట్లా పాలకులది ఓ గుడ్డిదర్బారే!

వాహనాల పార్కింగ్, స్టోర్ రూమ్ కోసం ఉద్దేశించిన సెల్లార్లను ఇలా చట్టవ్యతిరేకంగా స్టడీ సెంటర్లుగా వాడుతూ, వందల విద్యార్థుల్ని కూర్చోబెడుతున్న వైనం పట్ల చాలాకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. నెల క్రితం కూడా సాక్షాత్తూ ఓ విద్యార్థే ఈ సెల్లార్ల నియమోల్లంఘనపై ఢిల్లీ నగరపాలక సంస్థకు ఫిర్యాదు చేశారు. "పెను ప్రమాదం సంభవించవచ్చు" అని భవిష్యద్వాణిలా హెచ్చరించారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. తక్కువ వసతులు, కనీస ఖర్చుతో ఎక్కువ సంపాదించాలన్న కోచింగ్ సెంటర్ల అత్యాశ తెలియనిది కాదు. సక్సెస్ రేటు, సెలక్టయిన వారి సంఖ్య లాంటి వివరాలు ప్రకటనల్లో ఇవ్వరాదని నిబంధనలున్నా, వాటినవి గాలికొదిలేస్తున్న వైనమూ నిత్యం చూస్తున్నదే. తప్పుడు గొప్పలు చెప్పుకొని ఆకర్షించే జిమ్మిక్కులూ తెలిసినవే. వందలాది విద్యార్థుల్ని ఒకే గదిలో కుక్కుతున్న వీటికి అడ్డూ ఆపూ లేదు. నియంత్రిత ఆర్థిక వ్యవస్థకు భిన్నమైన ఈ విద్యావ్యాపారపు మార్కెట్ ఎకానమీని అడ్డుకోలేకున్నా అమాయకుల ధన, ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా నిబంధనలతో అదుపు చేయడం పాలకులు తలుచుకుంటే కష్టం కాదు.

ఆ చిత్తశుద్ధి లేకనే సమస్య! తాజా ఘటన పార్లమెంట్‌లో చర్చ దాకా వెళ్ళడంతో నగరపాలక సంస్థ హడావిడిగా డజనుకు పైగా చట్టవిరుద్ధ కోచింగ్ సెంటర్లకు సీలు వేసింది. మరో అరడజను పేరున్న సంస్థల బేస్‌మెంట్లకు తాళాలు బిగించింది. స్థలాలను ఆక్రమించి, వరద నీటి కాల్వలపై అక్రమంగా కట్టిన నిర్మాణాలపై బుల్‌డోజర్ల ప్రయోగం మొదలుపెట్టింది. నిజానికిది నిరంతరం సాగాల్సిన ప్రక్రియ. మూడు విలువైన ప్రాణాలు పోయాక నడుం కట్టడమే విషాదం. కోచింగ్, దాని అనుబంధ వ్యాపారం కోట్లలో సాగుతూ, వేలాది విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉన్నా, కనీస రక్షణ, వసతులు ప్రభుత్వపరంగా కల్పించలేకపోవడం పాలకుల హ్రస్వదృష్టికి తార్కాణం. పైగా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణ మంత్రాన్ని నిత్యం పఠిస్తూ, వికసిత భారత గాథను లిఖించాలని చూస్తున్న పాలకులకిది శోభనివ్వదు. సరైన పట్టణ ప్రణాళిక లేకుండా కాంక్రీట్ కీకారణ్యాల్ని ప్రోత్సహిస్తే ప్రయోజనమూ లేదు. ఢిల్లీ ఘటనలు పునరావృతం కాకముందే కేంద్రం, రాష్ట్రాలు నిద్ర లేవాలి.

దీర్ఘకాలిక వృద్ధిని పెంచగలదా?

విశ్లేషణ



సుబీర్ రాయ్

2023–24 ఆర్థిక సంవత్సరంలో, ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధి చెందింది. తద్వారా పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారత్ అత్యంత వేగంగా ముందుకు సాగుతున్న దేశంగా నిలబడింది. దీన్నిబట్టి, గత పదేళ్లలో సాధించినదాని పట్ల కేంద్ర ప్రభుత్వం సంతృప్తిగా ఉన్నట్టుంది! కానీ అధిక వృద్ధి ఫలాలను పెద్ద సంఖ్యలో ప్రజలు పొందుతున్నారా? బడ్జెట్ రూపకల్పన వారికి అనుగుణంగా జరిగిందా? వృద్ధి ఊపందుకున్నప్పటికీ, పేదరికం కారణంగా వినియోగ డిమాండ్ తక్కువగానే ఉంది. ఈ వృద్ధి నిలకడగా ఉండాలంటే, కార్మికులు మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. హ్రస్వ దృష్టితో చూస్తే బడ్జెట్ వాస్తవికంగానే కనబడుతుంది. కానీ దీర్ఘకాలిక వృద్ధిని నిర్ధారించే అంశాలను అది పరిష్కరించకుండా వదిలేసింది.

ప్రతి సంవత్సరం, ఆర్థిక సర్వే, బడ్జెట్‌లను ప్రభుత్వం ఒకదాని తర్వాత ఒకటి సమర్పిస్తుంది. ఈ సర్వే ద్వారా ఆర్థిక వ్యవస్థ ఎలా దూసుకుపోతోందో వివరించేందుకు ప్రయత్నిస్తుంది. బడ్జెట్ ద్వారా, తన మనస్సులో ఏ కార్యాచరణ ప్రణాళిక ఉందో వివరించడానికి ప్రయత్నిస్తుంది. రెండు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ రెండు ఉండాలి: ప్రస్తుత పరిస్థితిలో ఏమి చేయాలి? విషయాలు సరైన దిశలో వెళ్ళే అవకాశం ఉందా?

చూస్తుంటే గత పదేళ్లలో సాధించినదానిపట్ల ప్రభుత్వం సంతృప్తిగా ఉన్నట్టుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో, ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధి చెందింది. తద్వారా అన్ని పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారతదేశాన్ని అత్యంత వేగంగా ముందుకు కదలిపోయే దేశంగా నిలబెట్టింది. 2023లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.2 శాతమే పెరిగింది. 2024–25లో ప్రధాన ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతానికి కట్టడి చేయగలమనే విశ్వాసంతో ప్రభుత్వం ఉంది. కానీ ఈ కథ పూర్తిగా ఆశాజనకంగా లేదు. 2023–24లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం 7.5 శాతం వరకు ఉంటూ, మరింత ఆందోళనకరంగా మారింది.

మొత్తంమీద, ఈ విషయంలో బాగా పనిచేసినందున, కింది వృద్ధి వ్యూహాన్ని ఆర్థిక సర్వే సూచించింది; తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పింది: స్థిరంగా వృద్ధి చెందడానికి ప్రైవేట్ రంగం దాని సొంత మూలధనాన్ని ఏర్పాటుచేసుకోవాల్సి ఉంది. దేశంలో హరిత పరివర్తన జరగడానికి ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ వృద్ధిని కొనసాగించేలా ప్రభుత్వం ఖాళీలను పూడ్చాలి. దేశం అభివృద్ధి చెందడానికి వీలుగా నైపుణ్యాల అంతరాన్ని పూరించడానికి ఒక విధానం అవసరం. ఈ విధానాన్ని రూపొందించాలంటే, రాష్ట్ర యంత్రాంగ సమర్థత, వ్యవస్థ ఒకేలా ఉండాలి.

ఇది పావు శతాబ్దానికి దీర్ఘకాలిక లక్ష్యం అయితే, మనం ఇప్పుడు ఎక్కడ నుండి ప్రారంభించాలి? ముందుగా, పన్ను చెల్లింపుదారులకు శుభవార్త. నిర్ణీత తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) రూ.50,000 నుంచి రూ.75,000కు పెంచుతున్నారు. రూ.17,000 వరకు ఉద్యోగులకు ఆదా అయ్యేలా శ్లాబుల్ని మెలితిప్పారు. ఉద్యోగాల్లో చేరేందుకు ప్రొఫెషనల్స్ ప్రోత్సాహకాలు పొందబోతున్నారు. దీని వల్ల రెండు లక్షల మంది యువకులు ప్రయోజనం పొందనున్నారు. కేవలం జీతం ఆదాయం మాత్రమే కాదు, పెట్టుబడిపై లాభాలు ఆర్జించే వారికి మూలధన లాభాలకు మినహాయింపు కూడా పెరుగుతోంది.

ఈ లెక్కన తక్కువ పన్నులు చెల్లించాల్సిన మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్ తోడ్పడుతుంది. తమాషా ఏమిటంటే, ఆదాయపు



పన్ను చెల్లించే అవసరం లేని పేదలు, వారు తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన వస్తువులు అన్నింటికీ వాస్తవ చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. ఇది జీఎస్టీ పరిధిలోకి వస్తుంది. ఏకాభిప్రాయం సాధించడం ఎల్లప్పుడూ కష్టమైనప్పటికీ, మరిన్ని జీఎస్టీ–అనుబంధ సంస్కరణలను కేంద్రం, రాష్ట్రాలు చేపట్టవచ్చు. అంతేకాకుండా, రాష్ట్రాలతో పంచుకోవాల్సిన అవసరం లేని సెస్ నుండి కేంద్రం ప్రయోజనం పొందడం అన్యాయం. పేద పిల్లలు చదువుకునేలా చేయడం వంటి అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే ప్రాజెక్టుల కోసం సేకరించగలిగే మొత్తం ఆదాయం రాష్ట్రాలకు అవసరం.

నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూనీ, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీనీ సంతోషపెట్టడానికి అనేక భారీ ప్రాజెక్టులకు కూడా బడ్జెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన ప్రాజెక్టులలో పట్నా–పూర్నియా, బక్సర్–భాగల్పూర్ ఎక్స్‌ప్రెస్‌వేలు ఉన్నాయి. అంతేకాకుండా, బిహార్‌లోని బక్సర్ జిల్లాలో గంగా నదిపై రెండు లేన్ల వంతెనను నిర్మించనున్నారు. అదనంగా, భాగల్‌పూర్‌లోని పీర్‌పైంతిలో 2,400–మెగావాట్ల పవర్ ప్లాంట్ రానుంది. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే, రోడ్డు మార్గాల ప్రాజెక్టులను ప్రకటించారు. కొత్త రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15,000 కోట్లు ప్రకటించారు.

బడ్జెట్ అనేది రాజకీయ చర్య. దానికి స్పష్టమైన లక్ష్యం ఉంది. బీజేపీ సంకీర్ణ భాగస్వాములు, మధ్యతరగతి సంతృప్తి చెందేలా చూసుకోవడమే దాని లక్ష్యం. ప్రధాన పార్టీపై ఆధిపత్యం చలాయించే రాజకీయ వ్యాపారుల వెరపులేని ధీమా కారణంగానే సంకీర్ణ భాగస్వాములను సంతోషపెట్టాలనే లక్ష్యం నడుస్తుంటుంది. పూర్తిగా సంఖ్యల పరంగానే, చిన్న మధ్యతరగతి ఎన్నికల ఫలితాలను నిర్ణయించలేదు. పాలకవర్గం అంతిమ ఉద్దేశ్యం జనబాహుళ్యాన్ని సంతోషపెట్టడమే.

అయితే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి మంచి జరగనుంది. ప్రపంచ వ్యాఖ్యాతలు కూడా భారత్ అధిక వృద్ధి రేటును ప్రశంసించారు. కానీ వృద్ధి నిలకడగా ఉండాలంటే, కార్మికులు మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి, మంచిగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఈ కీలక సమస్యలను పరిష్కరించడానికి బడ్జెట్ సంకేత పథకాలను మాత్రమే ప్రవేశపెట్టింది. అందుకే, అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లను బాగా అర్థం చేసుకున్నా, దూరదృష్టితో వ్యవహరించడం లేదనేది మొత్తం భావన.

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోందనే దానితో సంబంధం లేకుండా, బడ్జెట్ అంచనాలు కూడా పరిష్కరించాల్సిన మూడు సమస్యలను ఎత్తిపట్టాయి. వృద్ధి ఊపందుకున్నప్పటికీ, వినియోగ డిమాండ్ తక్కువగానే ఉంది. పైగా ఉపాధి చాలా వెనుకబడి ఉంది. అధిక ఆర్థిక వృద్ధి ఫలాలను పెద్ద సంఖ్యలో ప్రజలు పొంద లేకపోతున్నారా? ఇది కొంచెం ఎక్కువగా సాంకేతికమైనది. తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం అనేది ఛేదించగలిగేటంత దృఢంగా ఉందా?

నోట్ల రద్దు, కోవిడ్–19 మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో, వృద్ధి రేటు అనుకున్నంత ఎక్కువగా లేదని చాలా మంది వాదించారు. కాబట్టి, ఒక విధంగా, ఆర్థిక వ్యవస్థ కేవలం తేరుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలు ఎక్కువ పొదుపు చేయడం వల్ల కాదు కానీ, రెండు ఎదురుదెబ్బల ఫలితంగా ఆదాయ వనరును కోల్పోయినప్పుడు వారు తీసుకున్న భారీ అప్పును తిరిగి చెల్లించడానికి ప్రయత్నిస్తున్నందున వినియోగం కుంచించుకుపోయింది. రిటైల్ ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నది సమృద్ధిగా ఉన్న సరఫరాల వల్ల కాదు. ప్రజలు తాము కోరుకున్న వాటిని వినియోగించుకోలేకపోవడం వల్ల.

ఇక్కడ శక్తిమంతమైన వైరుధ్యం కూడా ఉంది. ఆర్థిక వ్యవస్థ, వ్యాపారాలు బాగా కొనసాగాలంటే, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తక్కువగా ఉంచాలి. అయితే, ఎక్కువ డిపాజిట్లను సంపాదించడానికి బ్యాంకులు అధిక వడ్డీ రేటును ఎలా చెల్లించగలవు? అందువల్ల, బ్యాంకులు రుణాలు, పొదుపు మధ్య అసమతుల్యతను చూస్తున్నాయి.

మొత్తంమీద, హ్రస్వ దృష్టితో చూస్తే బడ్జెట్ వాస్తవికంగానే కనబడుతుంది. కానీ ఇది మధ్యతరగతి ద్వారా, మధ్యతరగతి కోసం చేసే ఒక కసరత్తు. అది దీర్ఘకాలిక వృద్ధిని నిర్ధారించే అంశాలను పరిష్కరించకుండా వదిలివేసింది.

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పరిణతి తెలియట్లేదా?



రాహుల్ గాంధీని ఇంకా పప్పు అని అంటే, అది బెడిసికొట్టేంతగా పరిస్థితులు మారిపోయాయి. అట్లాంటి సంబోధనకు ఏ ప్రాసంగికతా లేదు. దీన్ని అంగీకరించలేనివారు తమ దృష్టికోణాన్ని మార్చుకునే నైతిక స్థైర్యం లేనివారే!

– మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

నరమేధానికి మద్దతా?



పారా చినార్ (పాకిస్తాన్)లో కొనసాగుతున్న షియాల నరమేధంలో తీవ్రవాదులకు పాకిస్తాన్ సైన్యం సహకరిస్తున్నట్టు వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఈ క్రూరత్వాన్ని మనం ఖండించాలి. న్యాయం కోసం డిమాండ్ చేయాలి.

– మజా మెహదీ, షియా ముస్లిం విద్యార్థి

ఎందుకు మాట్లాడరు?



గాజాలోని హమాస్ తీవ్రవాదులకు మీడియాలో వచ్చిన కవరేజీలో ఒక్క శాతం వెనిజులాకు వచ్చినా... ఐదు నిమిషాల్లో అది స్వేచ్ఛ పొందుతుంది. ప్రశ్నించిన వాళ్లను అక్కడ కాలుస్తున్నారు. లక్షలాది ప్రజల హక్కులు లాక్కున్నారు. ఆకలి, వేదనలతో దేశం అల్లాడుతోంది. అయినా లండన్, న్యూయార్క్‌లో ఏ నిరసనలూ జరగవు. అదే వెనిజులా గనక ఇజ్రాయిల్ అయివుంటే? ఇప్పటికే ఎన్ని వ్యాఖ్యానాలు వినబడేవో?

– అమ్జద్ తాహా, వ్యాఖ్యాత

ప్రేరణ మూలాలు



మేరీ కోమ్ 2012 ఒలింపిక్ కాంస్యం గెలవడం చూసిన మనూ భాకర్ బాక్సర్ అవ్వాలనుకుందట. కరణం మల్లీశ్వరి సిడ్నీ ఒలింపిక్ పతకం తనకు ఎలా స్ఫూర్తినిచ్చిందో దీపా కర్మాకర్ తన ఆత్మకథలో రాసింది. అవే క్రీడల్లోకి ఈ అథ్లెట్లు ప్రవేశించలేదు కానీ, ఒకటి చూడటం అనేది ఎలా ప్రేరణ కలిగిస్తుందో గమనించండి.

– ఋత్వికా ధర్, చిత్రకారిణి

నరకపు నొప్పి



నాకు చికున్ గున్యా వచ్చిందని ఇప్పుడే తెలిసింది. మొత్తం శరీరం ఎంత నొప్పెడుతోందంటే... నరకం!

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

ఇన్ బాక్స్

కొత్త యుద్ధం మొదలయిందా?

పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఒక పక్క ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య యుద్ధం నడుస్తూ ఉండగా ఇప్పుడు ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య ప్రత్యక్ష యుద్ధానికి తెర లేవబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై లెబనాన్ గత తొమ్మిది నెలలుగా దాడులు చేస్తోందనీ, తాజాగా గోలన్‌హైట్స్‌లో ఫుట్ బాల్ ఆడుతున్న చిన్నారులపై చేసిన దాడి దీనికి కొనసాగింపేననీ, ప్రతీకారం తీర్చుకుంటామనీ ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఆ దాడితో మాకు సంబధం లేదని లెబనాన్ ప్రకటించినా ఇజ్రాయెల్ వినలేదు. ఇది లెబనాన్‌లోని హెజ్‌బొల్లా తీవ్రవాదుల పనే అనీ, దానికి తగిన మూల్యం లెబనాన్ చెల్లించుకోవాలనీ ఇజ్రాయెల్ ఊగిపోతూ లెబనాన్‌లోని బక్కా వ్యాలీ, కఫార్ కిలాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలను ధ్వంసం చేసింది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ ఈ సందర్భంగా హెచ్చరించింది. గోలన్ హైట్స్ రాకెట్ దాడిలో లెబనాన్ ప్రమేయం లేదనేది ఇరాన్ వాదన. ఈ వివాదం ముదిరితే విశ్వంలో అభద్రత, అస్థిరత్వం, అభివృద్ధి వంటివి కుంటు పడతాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి నాసర్ కనానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కనాని మాట్లాడుతూ... ఇజ్రాయెల్ నిజానిజాలు తెలుసుకోవాలనీ, పిచ్చి పనులు చేయకుండా సఖ్యత కోసం కృషి చేయాలనీ ఉద్బోధించారు. కానీ ఇజ్రాయెల్ వాసులు మాత్రం చిన్నారుల మరణం జీర్ణించుకోలేక పోతున్నారు. చనిపోయిన పిల్లల కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చిన మంత్రులను అక్కడి వారు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో లెబనాన్‌తో పూర్తి స్థాయిలో యుద్ధం చేస్తామని ప్రకటించింది ఇజ్రాయెల్.

ఇజ్రాయెల్ కనుక లెబనాన్‌పై పూర్తి స్థాయిలో దాడి చేస్తే, ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగే ప్రమాదం ఉంది. అది ప్రపంచ ప్రజలు మరో భీకర యుద్ధ ఫలితాలను చవిచూసేందుకు దారి తీయవచ్చు. అందుకే ఇజ్రాయెల్, లెబనాన్, ఇరాన్‌లు సంయమనం పాటించి, చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటాయని ఆశిద్దాం.

– కనుమ ఎల్లారెడ్డి, తాడిపత్రి

కొలువుల బడ్జెట్ మాత్రం కాదు!

అభిప్రాయం



టి. మురళీధరన్

"కేంద్ర బడ్జెట్‌లో ఘనమైన లక్ష్యంతో కేటాయించిన రూ. 2 లక్షల కోట్ల ప్యాకేజీ వచ్చే ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు లబ్ధి చేకూర్చనుంది. అంతేకాకుండా ఈ బడ్జెట్ ప్రత్యేకంగా విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాల వృద్ధి కోసం రూ. 1.48 లక్షల కోట్లు వ్యయం చేయనుంది" అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధితోపాటు ఎమ్ఎస్ఎంఈ రంగం గురించి కూడా బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. కేంద్ర బడ్జెట్–2024 అనేక విధాలుగా ప్రత్యేకమైందే. కాని అది కీలకమైన ఉద్యోగాల కల్పనలో విఫలమవడం ఖాయం. ఇది ఉద్యోగాలు సృష్టించే బడ్జెట్ కాదు.

ఉద్యోగ కల్పన దిశగా 2.1 కోట్ల మంది ఫ్రెషర్స్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఒక నెల జీతం లేదా మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో రూ. 15,000 ఇవ్వనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనివల్ల వచ్చే ఐదేళ్లలో నెలకు రూ. 15 వేల వేతనంతో 2.1 కోట్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని ఆమె అంచనా వేశారు. ఇది ఊహాజనిత అంచనా మాత్రమే. ఇది ఉద్యోగాలు లభించే ప్రాంతాలకు యువత వలస పోయేట్లు మాత్రమే చేస్తుంది. కానీ వాస్తవంలో ఎలాంటి కొత్త ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం కచ్చితంగా లేదు.

మరో స్కీమ్ ఏమంటే.. తయారీ రంగం, అదేవిధంగా వ్యవస్థీకృత రంగంలో కొత్తగా ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు మేలు చేసేలా ఆ యా ఉద్యోగుల పీఎఫ్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. వ్యవస్థీకృత రంగ ఉద్యోగాల వేతనంలో పీఎఫ్ అనేది చాలా తక్కువ మొత్తం. దీని వల్ల వేతన వ్యయం కొంత తగ్గుతుంది. యజమాని మంచి వ్యక్తి అయితే ఆ మొత్తాన్ని ఉద్యోగికి ఇచ్చి వేతనం పెంచే ప్రయత్నం చేస్తాడు. అంతే కాని పీఎఫ్ ఇచ్చే స్కీమ్ ఏ రకంగానూ కొత్త ఉద్యోగాల కల్పనకు ప్రోత్సాహం ఇచ్చేది కాదు.

ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయడం వల్ల నైపుణ్యాలు పెరుగుతాయి. ఎందుకంటే.. వాస్తవ నైపుణ్యాలు ఐటీఐల్లో లభించడం లేదు. ఉద్యోగంలో చేరిన తర్వాతే అవసరమైన స్కిల్స్ నేర్చుకుంటున్నారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన తర్వాత సదరు అభ్యర్థికి సరైన ఉద్యోగం లభించకుంటే.. ఆ ఐటీఐ చదువు వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.



అదే విధంగా అప్రెంటిస్ స్కీమ్, ఇంటర్న్‌షిప్ స్కీమ్స్ కూడా సప్లయ్ వైపు తీసుకున్న చర్యలే తప్ప కొత్త ఉద్యోగాలు సృష్టించేవి కాదు. వాస్తవానికి వ్యాపారం విస్తరించినప్పుడే కొత్త ఉద్యోగాల కల్పన అనేది సాధ్యమవుతుంది. కొత్త మార్కెట్లు లేదా కొత్తగా డిమాండ్ పెరగడం వల్ల వ్యాపారాల విస్తరణ జరుగుతుంది. ఆర్థిక మంత్రి ఊహించినట్లు సప్లయ్ సైడ్ చర్యల వల్ల కొలువుల సృష్టి జరగదు. ఉద్యోగాల కల్పన అనేది డిమాండ్‌ను పెంచే ప్రోత్సాహకాల వల్లనే సాధ్యమవుతుంది.

అసలు మొత్తంగా ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమే సరిగా లేదు. ఎందుకంటే... స్కిల్స్ పెంచడం, అప్రెంటిస్, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడం వల్ల నైపుణ్యాలున్న యువత సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఇలా స్కిల్స్ పెంచుకున్న యువతకు తక్షణమే ఉద్యోగాలు చూపించలేకపోతే అది మరింత వైఫల్యంగా మారుతుంది. కాబట్టి ప్రభుత్వం వ్యవస్థలో డిమాండ్ పెంచే చర్యలు తీసుకోవాలి.

కొత్త ఉద్యోగాలు భారీగా సృష్టించేది ఎవరు? ఐటీ రంగం కాని, పెద్ద పెద్ద కంపెనీలు కాని కాదు. వీరంతా ఇప్పుడు ఆటోమేషన్‌ను వినియోగిస్తున్నారు. వీరు భారీ సంఖ్యలో కొలువులు ఆఫర్ చేసే పరిస్థితి లేదు. ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది ఎమ్ఎస్ఎంఈ రంగమే! బడ్జెట్‌లో ముద్రా లోన్ మొత్తాన్ని పది లక్షల రూపాయలకు పెంచారు. కానీ బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు వెనకంజ వేస్తుండటంతో అవి అవసరమున్న వారికి చేరడంలేదు. ఎంఎస్ ఎంఈలలో పెట్టుబడులు పెంచేలా రుణ గ్యారెంటీ స్కీమ్ మరొకటి కూడా ఉంది. కానీ దురదృష్టవశాత్తు ప్రభుత్వం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు భారీగా పన్ను రాయితీలు ఇస్తోంది. ఎంఎస్ఎంఈలకు మాత్రం తిరిగి చెల్లించే రుణాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఎంఎస్ఎంఈ రంగంలో వృద్ధితోపాటు లాభాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ఈ రంగానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా అవసరం. వ్యాపార విస్తరణకు, వృద్ధికి, మనుగడకు సబ్సిడీ అందించాలి. జీఎస్టీ ఒకరకంగా ఎంఎస్ఎమ్ఈ రంగాన్ని దారుణంగా దెబ్బ తీసింది. కాని ఆర్థిక మంత్రి ఈ రంగం మనుగడ కోసం ఏమీ చేయడంలేదు. వడ్డీ రాయితీ తప్పితే ఎంఎస్ఎంఈ రంగానికి ఎలాంటి సబ్సిడీ అందుబాటులో లేదు. అంతిమంగా చెప్పేదేమంటే... ఎక్కువ మందికి ఉపాధి కల్పించే, అధిక సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించే ఎంఎస్ఎమ్ఈ రంగ వృద్ధి, విస్తరణకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడంలో బడ్జెట్ 2024–25 విఫలమైంది!!

వ్యాసకర్త టీఎమ్ఐ గ్రూపు ఫౌండర్ చైర్మన్

తెలుగు లోగిళ్లకు వెలుగు

ఆడపిల్లలు చదివితే ఇంటికి అరిష్టమనే రోజుల్లో పట్టుబట్టి బాలికలకు విద్య నేర్పించి తెలుగు లోగిళ్లలో వెలుగు నింపిన విద్యాదాత జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ (1793–1873). జర్మనీలోని హెల్మెస్టడ్ ప్రాంతంలో 1793 జూలై 10న జన్మించారు. అమెరికా వెళ్లి ఫిలడెల్ఫియాలో వేదాంత శాస్త్రం, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌లో స్కూల్ ఆఫ్ మెడిసిన్ నుండి వైద్య విద్యలో ఎండీ పట్టా పొందారు. మెడిసిన్ చదివే రోజుల్లో సంస్కృతం నేర్చుకున్నారు. 1813–15 ప్రాంతంలో సౌత్‌వార్క్‌లోని జియోస్ స్కూల్‌లో అధ్యాపకుడిగా పనిచేశారు.

అనంతరం మిషనరీగా అభిషేకం పొంది దాదాపు 300కు పైగా సండే స్కూల్స్ నెలకొల్పారు. ఆయన చురుకుదనాన్ని గమనించిన ది సెంట్రల్ మిషనరీ సొసైటీ, మెకానిక్స్ బర్గ్ వారు భారతదేశానికి మిషనరీగా ఎంపిక చేశారు. ఆ విధంగా హయ్యర్ 1842 జూలై 31న గుంటూరు వచ్చారు. ఆనాటి గుంటూరు కలెక్టర్ హెచ్ స్టోక్స్, హయ్యర్‌కు ఆశ్రయమిచ్చారు. వచ్చిన వెంటనే తెలుగు నేర్చుకుని తొలి పాఠశాలను 1842 నవంబరులో ప్రారంభించారు. అదీ కేవలం బాలికలకు మాత్రమే. నెల గడిచేసరికి ఎనిమిదిమంది ముస్లిం బాలికలకు పాఠశాల ప్రవేశం కల్పించారు. తీవ్ర వ్యతిరేకతల మధ్య ముస్లిం బాలికల చదువు కొనసాగింది. అనంతరం అన్ని వర్గాలవారికీ ఏడు పాఠశాలలు నెలకొల్పారు. 1844 నాటికి మరో ఎనిమిది పాఠశాలలు ప్రారంభించి, 180 మందికి ప్రవేశం కల్పించారు. ఆనాటికి అందులో సగంమంది బాలికలే. కొన్ని కుటుంబాల ఆడపిల్లలు చదువుతున్నారని వెలివేశారు. వారి రక్షణ కోసం వసతి కల్పించి, తొలి ఉచిత హాస్టల్‌ను ఏర్పాటుచేశారు.



జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్

ఆ కాలంలో ప్రసూతి సమయంలో సరైన వైద్యం లభించక తల్లీపిల్లలు మరణించేవాళ్లే ఎక్కువ. అందుకే గుంటూరు కొత్తపేటలో 1843లో ఉచిత వైద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఆ పైన హయ్యర్ అభ్యర్థన మేరకు అన్నా శారా కుగ్లర్‌తో గుంటూరులో ఒక వైద్యశిబిరాన్ని మహిళల కోసం నిర్వహించారు.

1845 నాటికి రాజమండ్రి, భీమవరంలో పాఠశాలలను నెలకొల్పారు. ఆ పరిసర ప్రాంతాల్లోనే వైద్యశాలలు ప్రారంభించారు. హయ్యర్ పరిచర్యకు తోడుగా వాల్టర్‌గన్, లూయిస్ మెనోవాలెట్, విలియం గ్రోయినింగ్, ఆగస్టస్ హైసీ వంటివారు వచ్చారు. మహిళా విద్యకు ఆగ్నెస్ పాండే, ఎమిలీ స్కాటన్ లాంటి వాళ్లు కృషిచేశారు. తెనాలి ప్రాంతంలో మెకాలె దంపతులు, డుంకుల్ బర్గర్; రేపల్లెలో హోప్‌లాంటి వాళ్లు అనంతర కాలంలో విద్యావ్యాప్తికి దోహదపడ్డారు. అలా ఆయన విద్య, వైద్య పరిచర్య ఆంధ్ర దేశమంతటా కొనసాగింది.

ఆయన అనంతరం ఆంధ్ర ఎవాంజలికల్ లూథరన్ చర్చిగా రూపుదిద్దుకున్న సంస్థలో నేటికి 35 లక్షలమంది సభ్యులు ఉన్నారు. అయిదు వేల దేవాలయాలున్నాయి. హయ్యర్ అనారోగ్య కారణాలతో తిరిగి అమెరికా వెళ్లారు. 1873లో 80 ఏళ్ల వయసులో పెన్సిల్వేనియాలో మరణించారు. ఆయన స్మృత్యర్థం ప్రతి ఏటా జూలై 31వ తేదీన లూథరన్ సంస్థలో సువార్త దినంగా ఆచరిస్తారు.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, క్రైస్తవ సాహిత్య పరిశోధకులు, తెనాలి
(జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ స్మృత్యర్థం లూథరన్ సంస్థలో నేడు సువార్త దినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.ఏకాదశి సా.5.23 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** రోహిణి ప.12.37 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.6.07 నుండి 7.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.40 నుండి 12.32 వరకు, **అమృత ఘడియలు:** రా.3.32 నుండి 5.04 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.31.

పింఛన్ పొందడం ఉద్యోగుల నైతిక హక్కు

పెన్షనర్ల మహాధర్నాలో ప్రొఫెసర్ హరగోపాల్



ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో జరిగిన మౌనదీక్షలో పాల్గొన్న పెన్షనర్లు

కవాడిగూడ (హైదరాబాద్): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేసి పెన్షనర్లను ఆదుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ పొందడం ప్రతి ఉద్యోగి నైతిక హక్కు అని, హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై పెన్షనర్లంతా ఐక్యంగా ఉద్యమించి ఒత్తిడి తీసుకు రావాలని ఆయన పింఛన్‌దారులకు సూచించారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్ల నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఇతర అపరిష్కృత సమస్యల సాధనకోసం తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మౌనదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటి పరిష్కారానికి సానుకూలంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ, పెన్షనర్ల నాలుగు డీఏల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలలో కనీసం రెండు బకాయిలను వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టి.శుభకర్‌రావు, జేఏసీ నాయకులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిన వారానికే పిటిషన్లు

ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లలో ప్రతివాదుల వాదనలు

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారానికే రిట్ పిటిషన్లు దాఖలు చేశారని హైకోర్టులో అనధికారిక ప్రతివాదుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ముగ్గురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి మూడు నెలలు కావొస్తున్నా స్పీకర్ ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి తదుపరి విచారణను వచ్చే నెల 1వ తేదీకి వాయిదా వేశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్‌రావు, దానం నాగేందర్‌ను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డితోపాటు బీజేపీఎల్పీ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. కడియం శ్రీహరి తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫిర్యాదు చేసిన వారానికే పిటిషన్లు వేసి.. ఇప్పుడు మూడు నెలలు అయ్యిందని.. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోలేదని చెప్పడం సరికాదన్నారు. స్పీకర్‌కు గడువు నిర్దేశిస్తూ కోర్టులు ఆదేశాలు ఇవ్వలేవని నివేదించారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్న తర్వాత ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, అయితే దానిపై కూడా జోక్యం స్వల్పమేనని చెప్పారు.

అంతుచిక్కని జ్వరం.. ఊరంతా కలవరం!

హనుమకొండ జిల్లా భీంపల్లిలో విచిత్ర పరిస్థితి

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లివాసులు అంతుచిక్కని వ్యాధితో సుమారు నెల రోజులుగా సతమతమవుతున్నారు. ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాల బారినపడటంతోపాటు జ్వరం తగ్గాక ఒళ్లంతా దురదలు, ముక్కు, ముఖాలపై నల్లమచ్చలు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపుతో నరకయాతన అనుభవిస్తున్నారు. సుమారు 3 వేల మంది ఉన్న ఈ గ్రామంలో వెయ్యి మందికిపైగా ప్రజలు ఇవే బాధలు పడుతున్నారు.

ఎన్ని టెస్టులు చేయించినా కానరాని ఫలితం..

భీంపల్లికి చెందిన పలువురు జ్వరపీడితులు కరీంనగర్ జిల్లా జమ్మికుంట, హనుమకొండ తదితర ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నా రిపోర్టులన్నీ సాధారణంగానే వస్తుండటంతో తమకు సోకిన వ్యాధి ఏమిటో అంతుబట్టక కలవరపడుతున్నారు. దీనికి కారణం వాతావరణంలో వచ్చిన మార్పులా లేక తాగు నీరా లేక ఇతరత్రా ఇంకేమైనా ఉన్నాయో తెలియడం లేదని వాపోతున్నారు. భీంపల్లిలో ఇంత జరుగుతున్నా వైద్యులు, సిబ్బంది తమను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



జ్వరంతో మంచానపడ్డ ఓ కుటుంబం

కారణాలేంటో తెలియడం లేదు

భీంపల్లిలో ఇంటికి ఒకరిద్దరికి జ్వరాలు వస్తున్నది వాస్తవమే. మేము ఇప్పటివరకు 3–4 వైద్యశిబిరాలు నిర్వహించాం. ఎన్ని టెస్టులు చేసినా రిపోర్టులు నార్మల్‌గానే వస్తున్నాయి. కారణాలు ఏమిటో తెలియడం లేదు. పారిశుద్ధ్య సమస్యతో గ్రామంలో దోమలవ్యాప్తి పెరిగిపోయింది. ప్రస్తుతానికైతే వైరల్ ఫీవర్లుగానే భావించి చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ పద్మశ్రీ, వైద్యాధికారి

పురపాలక శాఖ కమిషనర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 24 మంది మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బదిలీలపై నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో అధికారులకు స్థానచలనం కల్పించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు.

బదిలీ అయిన అధికారులు వీరే..


అధికారి	ప్రస్తుత విధులు	బదిలీ స్థానం
సి.ఎన్.రఘుప్రసాద్	గవర్నర్ సంయుక్త కార్యదర్శి	అదనపు కమిషనర్, జీహెచ్‌ఎంసీ
జె.సువార్త	జీహెచ్‌ఎంసీ స్పెషల్ గ్రేడ్ కమిషనర్	అదనపు కమిషనర్, కరీంనగర్
సీహెచ్ రాజేందర్‌రెడ్డి	డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	అదనపు కమిషనర్, జీడబ్ల్యూఎంసీ
ఎన్.సామ్రాట్ అశోక్	జాయింట్ డైరెక్టర్, సీడీఎంఏ	జీహెచ్‌ఎంసీ
పి.శ్రీధర్	జాయింట్ డైరెక్టర్, సీడీఎంఏ	జీహెచ్‌ఎంసీ
బి.సంధ్య	స్పెషల్ గ్రేడ్ కమిషనర్,	జీహెచ్‌ఎంసీ కమిషనర్, సిద్దిపేట
వి.ప్రశాంతి	డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	జాయింట్ డైరెక్టర్, సీడీఎంఏ
అరుణ కుమారి చరణ్	స్పెషల్ గ్రేడ్ కమిషనర్ (వెయిటింగ్)	జీహెచ్‌ఎంసీ
ఎ.స్వామి	కమిషనర్, పాల్వంచ	కమిషనర్, గుండ్ల పోచంపల్లి
డి.ధాకు నాయక్	స్పెషల్ గ్రేడ్ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్, పాల్వంచ
ఎ.నాగమణి	జాయింట్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	కమిషనర్, దమ్మాయిగూడ
టి.దశరథ్	సెక్రటరీ, జీహెచ్‌ఎంసీ	కమిషనర్, గద్వాల
బి.రాజేశ్‌కుమార్	డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	కమిషనర్, భైంసా
కె.ప్రసన్నరాణి	కమిషనర్, సిద్దిపేట	డిప్యూటీ కమిషనర్, జీడబ్ల్యూఎంసీ
కె.శ్రీనివాసరావు	మిషన్ డైరెక్టర్, మెప్మా	కమిషనర్, బెల్లంపల్లి
ఎం.శోభాశంకర్	మిషన్ డైరెక్టర్, మెప్మా	కమిషనర్, కొత్తపల్లి
ఎ.విజయలక్ష్మి	డీపీఓ, యూసీడీ, జీహెచ్‌ఎంసీ	ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా, వరంగల్
సీహెచ్ జ్యోత్స్న	ఏఎంసీ, జీహెచ్‌ఎంసీ	సీడీఎంఏ
ఎస్.నాగేందర్	ఏఎంసీ, జీహెచ్‌ఎంసీ	కమిషనర్, చేర్యాల
ఆర్.పుష్పలత	ఏఎంసీ, జీహెచ్‌ఎంసీ	ఏఎంసీ, నల్లగొండ
బి.శ్రీనివాస్	కమిషనర్, నర్సంపేట	టాక్సేషన్ ఆఫీసర్, జీడబ్ల్యూఎంసీ
డి.శంకర్ సింగ్	కమిషనర్, గద్వాల	జీహెచ్‌ఎంసీ
కె.వేణుమాధవ్	కమిషనర్, సుల్తానాబాద్	ఏఎంసీ, కరీంనగర్
కె.నర్సింహారెడ్డి	గ్రేడ్–3 కమిషనర్, వెయిటింగ్	కమిషనర్, నర్సంపేట

వైఎస్ జగన్ పిటిషన్‌పై స్పందించిన ఏపీ హైకోర్టు

- శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు
- ప్రతిపక్ష నేత హోదాపై పూర్తి వివరాలు కోర్టు ముందుంచాలని ఆదేశం

సాక్షి, అమరావతి: శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శాసనసభ పక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై ఏపీ హైకోర్టు స్పందించింది. శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. జగన్‌కు ప్రతిపక్ష నేత హోదానిచ్చే విషయంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలంది. చట్ట ప్రకారం శాసనసభలో తనకు ప్రతి పక్ష నేత హోదా ఇచ్చేలా శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసన వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు. విచారణ మొదలు కాగానే, జగన్ తరఫు సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ వైఎస్సార్‌సీపీ శాసనసభ పక్ష నేత అని తెలిపారు. చట్ట ప్రకారం ఆయనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంలో చట్ట నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని వివరించారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ, మధ్యంతర ఉత్తర్వుల కోసం అభ్యర్థించని నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉందన్నారు. ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, కౌంటర్ల దాఖలుకు ఆదేశాలిస్తామని తెలిపారు.

విజయసాయిరెడ్డికి 'ఐసీఏఐ' నోటీసులు సరికాదు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిపరమైన ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై విచారణకు హాజరుకావాలంటూ గతేడాది అక్టోబర్ 23న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ తీరు సరికాదని తప్పుబట్టింది. ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది. చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిపరమైన ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై విచారణకు హాజరుకావాలంటూ గతేడాది అక్టోబర్ 23న ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ విజయసాయిరెడ్డికి నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. చార్టర్డ్ అకౌంటెంట్‌గా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొంది. ఈ నోటీసులను తెలంగాణ హైకోర్టులో విజయసాయిరెడ్డి సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. పిటిషనర్‌కు ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.వెంకటేశ్ వాదనలు వినిపించారు. కమిటీ, డైరెక్టరేట్ ఆరోపిస్తున్న కేసుల్లో ఏ కేసులోనూ పిటిషనర్ దోషిగా నిరూపణ కాలేదని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. రాజకీయ ప్రోద్బలంతో ఆ కేసులు పెట్టారని.. విచారణ సాగుతోందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబడుతూ తీర్పునిచ్చారు. జయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించారు.

కదం తొక్కిన ఆశ వర్కర్లు

- వేతనాలు రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్
- కోఠి మహిళా కళాశాల రోడ్డును దిగ్బంధించి ధర్నా



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): వైద్య ఆరోగ్యశాఖలో ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఆశ వర్కర్లు చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేలాది మంది ఒక్కసారిగా కోఠి మహిళా కళాశాల చౌరస్తాలో బైఠాయించడంతో రోడ్లన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. దాదాపు ఆరు గంటలపాటు జరిగిన ఈ ఆందోళనలో పోలీసులకు, ఆశ వర్కర్లకు తీవ్ర వాగ్వివాదం, తోపులాటలు జరిగాయి. ఆశ వర్కర్లు గేట్లు ఎక్కి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్‌లోకి దూసుకుపోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. క్యాంపస్‌లోకి దూసుకుపోయిన వారు కార్యాలయాన్ని ముట్టడించి బైఠాయించారు. అక్కడ కూడా నినాదాల హోరు కొనసాగింది. దీంతో కమిషనర్ బయటకు వచ్చి ఆశ వర్కర్ల నాయకురాలితో చర్చలు జరిపారు. వారి సమస్యలన్నీ తమ దృష్టిలో ఉన్నాయని, అన్ని సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆశాలు తమ ఆందోళన విరమించుకున్నారు. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి మాట్లాడుతూ, ఆశ వర్కర్లకు 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు, ఫిబ్రవరి 9న ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడా సాధారణ సెలవులు ఇవ్వాలన్నారు. డిమాండ్లపై కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు జయలక్ష్మి తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న వరుస అత్యాచార ఘటనలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం ఒక్కరోజే రాష్ట్రంలో నాలుగు అత్యాచారాలు జరగడం బాధాకరమని, సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఉందని మండిపడ్డారు. మహిళలకు భద్రత కరువైందని, పెరిగిన అత్యాచారాల గురించి అసెంబ్లీలో మాట్లాడిన 48 గంటలు గడవకముందే ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయని హరీశ్ తెలిపారు. చట్టాలు చేసే అసెంబ్లీలో మనం ఉండి ఎందుకు? అనే స్వీయ ప్రశ్న ఎమ్మెల్యేలందరూ వేసుకోవాల్సిన సమయం ఇదని పేర్కొన్నారు. మహిళా భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా జరగటం ఆందోళనకరమన్నారు. అత్యాచార బాధితులకు భరోసా కల్పించాలని, నిందితులను గుర్తించి కఠిన శిక్ష పడేలా చేయాలని హరీశ్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

అసెంబ్లీని ముట్టడించిన కాంట్రాక్టు ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు బేసిక్ పే ఇవ్వాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.యాదగిరి, ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి రూ.10 లక్షల విలువైన జీవిత బీమా, రూ.5 లక్షల విలువైన ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కదులుతున్న బస్సులో వివాహితపై అత్యాచారం!

- అరవకుండా నోటికి దుప్పటి అదిమిపెట్టిన వైనం
- ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ కీచకపర్వం
- బాధితురాలి ఆర్తనాదాలతో 100కు ఫిర్యాదు చేసిన ప్రయాణికులు
- అప్పటికే బస్సులోంచి పరారైన నిందితుడు



వివరాలను వెల్లడిస్తున్న ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్



ఓయూ పీఎస్ వద్ద నిలిపి ఉంచిన ట్రావెల్స్ బస్సు

సికింద్రాబాద్/లాలాపేట: హైదరాబాద్ మీదుగా అర్ధరాత్రి వేళ వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో నిద్రిస్తున్న ఓ వివాహిత (25)పై బస్సు డ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఆర్తనాదాలతో తోటి ప్రయాణికులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చేలోపే నిందితుడు పరారయ్యాడు. ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి హైదరాబాద్ మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లేందుకు సోమవారం రాత్రి 8 గంటలకు హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు (ఏఆర్ 01పీ7053) బయలుదేరింది. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ సీటు వెనకాలే 1వ నంబర్ సీటులో ఓ వివాహిత (25) తన తొమ్మిదేళ్ల కుమార్తెతో కూర్చుంది. ప్రకాశం జిల్లా పొదిలి వెళ్లేందుకు ఆమె సీటు రిజర్వు చేసుకుంది. అయితే ఆమెతో బస్సు డ్రైవర్ కృష్ణ (35) మాట కలిపాడు. రాత్రి 10:30 గంటలకు బస్సు మెదక్ జిల్లా చేగుంటకు చేరుకోగా ప్రయాణికుల డిన్నర్ కోసం డ్రైవర్ బస్సును ఆపాడు. ఈ క్రమంలో వివాహితపై అఘాయిత్యానికి పాల్పడాలన్న దుర్బుద్ధితో ఆమెను ఖాళీగా ఉన్న చివరి పుట్ సీటులోకి వెళ్లమన్నాడు. డ్రైవర్ మాటలు నమ్మిన వివాహిత వెనకాల సీటుకు వెళ్లి నిద్రకు ఉపక్రమించింది. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ కృష్ణ.. బస్సు నడిపే బాధ్యతను తన సహాయకుడైన మరో డ్రైవర్ సిద్ధయ్యకు అప్పగించాడు. అర్ధరాత్రి 12 గంటలు దాటాక ప్రయాణికులంతా నిద్రలోకి జారుకోవడంతో వివాహిత పడుకున్న చివరి సీటు వద్దకు వెళ్లిన డ్రైవర్.. ఆమె నోటికి దుప్పటిని గట్టిగా అదిమిపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటికి బస్సు సికింద్రాబాద్ రైల్‌నిలయం మీదుగా వెళ్తోంది. బాధితురాలి ఆక్రందనను గ్రహించిన తోటి ప్రయాణికులు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా కంట్రోల్ రూం సమాచారం మేరకు ఓయూ పోలీసులు బస్సును తార్నాక ప్రాంతంలో ఆపారు. అయితే ఈలోగానే నిందితుడు బస్సులోంచి దూకి పరారయ్యాడు. దీంతో సహాయక డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు బాధిత మహిళను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రధాన నిందితుడు కృష్ణకోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సెక్షన్ 64 (1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు.


రాళ్ల దిబ్బగా మారిన ఓ ప్రాంతంలో చిక్కుబడ్డ వారి కోసం గాలింపు


మేటవేసిన బురదలో కూరుకుపోయిన ఓ ఫ్యామిలీ ఫొటో


సహాయక చర్యల్లో నిమగ్నమైన సిబ్బంది


ఆస్పత్రిలో తమవారి మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

బురద వరద ముంచేసింది

కేరళలో మృత్యువిలయం • 123 మంది బలి


వయనాడ్ జిల్లాలోని చూరల్మలలో బురద విలయం విశ్వరూపం

వయనాడ్ (కేరళ): ఘోర కలి. మాటలకందని విషాదం. కేరళ చరిత్రలో కనీ వినీ ఎరగని ప్రకృతి విలయం. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కొండ ప్రాంతమైన వయనాడ్ జిల్లాలో మహోత్పాతానికి కారణమయ్యాయి. అక్కడి మెప్పడి ప్రాంతంపైకి మృత్యువు కొండచరియల రూపంలో ముంచుకొచ్చింది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఆ ప్రాంతమంతటా భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో వెల్లువెత్తిన బురద, ప్రవాహం ఊళ్లకు ఊళ్లనే ముంచెత్తాయి. గ్రామాలతో పాటు సహాయ శిబిరాలు కూడా బురద ప్రవాహంలో గల్లంతయ్యాయి. ఎటు చూసినా అంతులేని బురదే కప్పేసింది. దాంతో గాఢ నిద్రలో ఉన్న వందలాది మంది తప్పించుకునే అవకాశం కూడా లేక నిస్సహాయంగా శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. బురద, మట్టి దిబ్బల కింద సమాధైపోయారు. కళ్లు తిప్పుకోనివ్వనంత అందంగా ఉండే మెప్పడి ప్రాంతమంతా క్షణాల వ్యవధిలో శవాల దిబ్బగా మారిపోయింది. ఇప్పటిదాకా 123 మృతదేహాలను వెలికితీశారు. వాటిలో చాలావరకు సమీపంలోని నదుల్లోకి కొట్టుకొచ్చినవే. ఏ శవాన్ని చూసినా కాళ్లు చేతులు తెగిపోయి కన్పించడం బీభత్స తీవ్రతను కళ్లకు కడుతోంది. ప్రమాద స్థలం పొడవునా నిండిపోయిన బురద ప్రవాహాన్ని, మట్టి దిబ్బలను తొలగిస్తే వందల్లో శవాలు బయటపడతాయని చెబుతున్నారు. మృతుల్లో స్థానికులతో పాటు ఉత్తరాది నుంచి పొట్ట చేత పట్టుకుని వచ్చిన వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారని భావిస్తున్నారు. సమీపంలోని టీ ఎస్టేట్లో పని చేస్తున్న 600 మంది వలస కూలీల జాడ తెలియడం లేదు. వారంతా విలయానికి బలై ఉంటారంటున్నారు.


ఓ మహిళను కాపాడుతున్న సిబ్బంది

నడి రాత్రి ఘోర కలి...

మెప్పడి ప్రాంతంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కొండ ప్రాంతమంతా తడిసీ తడిసీ వదులుగా మారిపోయింది. అర్ధరాత్రి వేళ కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో వరద, బురద వెల్లువెత్తాయి. వాటి ప్రవాహ మార్గంలో ఉన్న ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ తదితర కుగ్రామాలు సమాధయ్యాయి. తొలుత సోమవారం అర్ధరాత్రి రెండు గంటల వేళ ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో సహాయక సిబ్బంది హుటాహుటిన స్పందించారు. బాధితులను సమీపంలోని చూరల్మల స్కూలు వద్ద సహాయక శిబిరాలకు తరలించారు. అనంతరం తెల్లవారుజామున నాలుగింటికి ఆ ప్రాంతమంతటా మళ్లీ భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో శిబిరాలతో పాటు పరిసర గ్రామాల్లోని ఇళ్లు, దుకాణాలన్నీ బురదలో కొట్టుకుపోయాయి. రోడ్లు, బ్రిడ్జిల వంటివన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. దాంతో ఆ ప్రాంతాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో సహాయక బృందాలు అక్కడ కాలు పెట్టలేకపోతున్నాయి. అయితే బురదలో చిక్కుబడి ప్రాణాలతో ఉన్న పలువురిని సైన్యం, నేవీ సంయుక్త ఆపరేషన్ చేపట్టి హెలికాప్టర్ల ద్వారా కాపాడాయి. మెప్పడి ఆరోగ్య కేంద్రంలో స్థలాభావం కారణంగా మృతదేహాలను నేలపైనే వరుసగా పేరుస్తున్నారు. ఉత్పాతం నుంచి ప్రాణాలతో బయటపడ్డ వారంతా తలలు బాదుకుంటూ, హృదయ విదారకంగా రోదిస్తూ తమవారి శవాల కోసం వెదుక్కుంటున్నారు! నిర్వాసితులుగా మారిన వేలాదిమందిని సహాయక శిబిరాలకు తరలిస్తున్నారు.

రంగంలోకి సైన్యం

కేరళ ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సైన్యం, జాతీయ విపత్తు దళం హుటాహుటిన రంగంలోకి దిగాయి. బురద, మట్టి దిబ్బల కింద ప్రాణాలతో ఉన్నవారిని కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. వారి ఆనవాలు పట్టేందుకు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు.

మోదీ దిగ్భ్రాంతి

ఈ ఘోర విపత్తుపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. సీఎం పినరయి విజయన్‌తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సహాయక చర్యలు తదితరాల్లో కేరళకు అన్నివిధాలా దన్నుగా నిలుస్తామని ప్రకటించారు. ఆయన బుధవారం కేరళ వెళ్లనున్నారు. మరోవైపు, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50 వేల చొప్పున కేంద్రం పరిహారం ప్రకటించింది.

ఫోన్లలో ఆర్తనాదాలు

బురద ప్రవాహంలో చిక్కుబడ్డ చాలామంది కాపాడాలంటూ అధికారులకు ఫోన్లు చేశారు. ప్రాణ భయంతో ఫోన్లోనే ఏడ్చేసిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. చానళ్లలో ప్రసారమవుతున్న ఆ సంభాషణలు, గ్రామాలన్నీ బురద కింద కప్పబడిపోయిన్న దృశ్యాలు అందరినీ కలచివేస్తున్నాయి. ఇది మాటలకందని విషాదమని సీఎం విజయన్ అన్నారు. ''భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో మొత్తం ప్రాంతమంతా పెను విధ్వంసానికి లోనైంది. మృతుల్లో మహిళలు, చిన్నారులున్నారు. పలు శవాలు చెలియార్ నదిలో పారుగున మలప్పురం జిల్లాలోకి కొట్టుకొచ్చాయి.

నదే రెండుగా చీలింది

విరిగిపడ్డ కొండచరియల ధాటికి స్థానిక ఇరువలింజిపుజ నది ఏకంగా రెండుగా చీలిపోయింది! అక్కడి వెల్లరిమల ప్రభుత్వ పాఠశాల పూర్తిగా సమాధైపోయిందని సీఎం విజయన్ చెప్పారు.

ప్రాణం దక్కించుకున్న వృద్ధుడు

వయనాడ్ విలయంలో వెల్లువెత్తిన బురద ప్రవాహంలో చిక్కిన ఓ వృద్ధుడు గంటల కొద్దీ ఒక పెద్ద బండరాయిని ఆధారంగా పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకున్నాడు. స్థానికులు అతని ఆర్తనాదాలు విని కూడా వరద ప్రవాహ తీవ్రత కారణంగా ఏమీ చేయలేకపోయారు. దాంతో వృద్ధుడు జోరు వానలో, వరద ప్రవాహం నడుమ గంటల పాటు బండరాయి చాటునే బిక్కుబిక్కుమంటూ గడిపాడు. చివరికి సహాయక బృందాలు చాలాసేపు శ్రమించి ఆయన్ను కాపాడాయి. ఆ వీడియో వైరల్‌గా మారింది.

త్రుటిలో బయటపడ్డాం...

కళ్లముందే సర్వస్వాన్నీ ముంచెత్తిన వరద, బురద బీభత్సం నుంచి పలువురు త్రుటిలో తప్పించుకున్నారు. ఆ భయానక అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ వణికిపోయారు. ఓ వృద్ధ జంట తమ ఇంటి చుట్టూ బురద నీటి ప్రవాహం నెమ్మదిగా పెరుగుతుండటంతో వణికించే చలిని, జోరు వానను కూడా లెక్కచేయకుండా రాత్రి 11 గంటల వేళ కొండపై భాగానికి వెళ్లిపోయింది. కాసేపటికే వాళ్ల ఇల్లు నామరూపాల్లేకుండా పోయింది. ''పొరుగింటాయనను రమ్మని బతిమాలాం. రాకుండా ప్రాణాలు పోగొట్టుకున్నాడు'' అంటూ వాళ్లు వాపోయారు. ''మా బంధువులైన దంపతులు పసిపాపను చంకనేసుకుని ప్రాణాల కోసం పరుగులు తీస్తూ నాతో ఫోన్లో మాట్లాడారు. వరద ప్రవాహం, బురద తమను ముంచెత్తుతున్నాయని చెప్పారు. కాసేపటికే ఫోన్ మూగబోయింది. వాళ్ల జాడా తెలియడం లేదు'' అంటూ ఒక మహిళ రోదించింది.

వయనాడ్‌కు రెడ్ అలర్ట్: న వయనాడ్‌తో పాటు కేరళలోని ఉత్తరాది జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రెండు రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

లోక్‌సభలో కులకలం

- 'తాము ఏ కులమో తెలియని వాళ్లు...'
- రాహుల్‌పై ఠాకూర్ వ్యాఖ్యలు
- తీవ్రంగా ఆక్షేపించిన విపక్షాలు
- రికార్డుల్లోంచి తొలగించిన స్పీకర్
- నాకిది ఘోరమైన అవమానం: రాహుల్
- కులగణన చేయించి తీరతానని శపథం



న్యూఢిల్లీ: మోదీ సర్కారుపై విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన 'చక్రవ్యూహం' వ్యాఖ్యల తాలూకు వేడి లోక్‌సభలో మంగళవారం కూడా కొనసాగింది. ప్రభుత్వం తరఫున మాట్లాడిన బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ వాటిని తీవ్రంగా ఖండించారు. రాహుల్ తన ప్రసంగం పొడవునా ఆరితేరిన వక్తనని నిరూపించుకునేందుకు పాకులాడారని ఎద్దేవా చేశారు. ''అందుకోసం అంకుల్ శామ్ (కాంగ్రెస్ నేత శామ్ పిత్రోడా) నుంచి తెచ్చుకున్న అరువు జ్ఞానాన్ని ప్రదర్శించారు. రాహుల్ రియల్ పొలిటీషియన్ కాదు. కేవలం వీడియోల కోసమే ప్రసంగాలిచ్చే రీల్ పొలిటీషియన్. బహుశా విపక్ష నేత (ఎల్‌ఓపీ) అంటే దుష్ప్రచార సారథి (లీడర్ ఆఫ్ ప్రాపగాండా) అని అపార్థం చేసుకున్నట్టున్నారు'' అంటూ దుయ్యబట్టారు. ''కొందరు పేరుకు మాత్రమే హిందువులు. మహాభారతంపై వారికున్నది కూడా మిడిమిడి జ్ఞానమే'' అంటూ రాహుల్‌ను ఠాకూర్ ఎద్దేవా చేశారు. ఆ క్రమంలో 'తమది ఏ కులమో కూడా తెలియని వారు కులగణన కోరుతున్నారు' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై సభలో తీవ్ర దుమారం రేగింది. అవి రాహుల్‌ను ఉద్దేశించినవేనంటూ విపక్ష సభ్యులంతా మండిపడ్డారు. ఒక వ్యక్తి కులం గురించి ఎలా మాట్లాడతారంటూ సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఠాకూర్ వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులంతా వెల్‌లోకి దూసుకెళ్లారు. దాంతో ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తర్వాత రాహుల్ మాట్లాడుతూ ఠాకూర్ వ్యాఖ్యలు తనకు ఘోర అవమానమన్నారు. ''దళితులు, వెనకబడ్డ వర్గాల హక్కుల కోసం ఎవరు పోరాడినా ఇలాంటి అవమానాలు భరించాల్సిందే. అందుకే నన్నెంత తిట్టినా, అవమానించినా పట్టించుకోను. క్షమాపణలూ కోరబోను. అర్జునుడు పక్షి కన్నుపైనే దృష్టి పెట్టినట్టు నా దృష్టినంతా కులగణనపైనే కేంద్రీకరించాను. పోరు ఆపబోను. విపక్ష ఇండియా కూటమి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశవ్యాప్తంగా కులగణన చేయించి తీరుతుంది'' అని ప్రకటించారు.

మీకో వైఖరే లేదు

దళితులు, ఓబీసీల వెనకబాటుకు 1947 నుంచి దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెసే కారణమని ఠాకూర్ ఆరోపించారు. ఎన్ (నెహ్రూ), ఐజీ (ఇందిరాగాంధీ), ఆర్‌జీ1 (రాజీవ్‌గాంధీ) అంటూ గాంధీ కుటుంబానికి చెందిన మాజీ ప్రధానులందరిపైనా విమర్శలు చేశారు. కాంగ్రెస్ దృష్టిలో ఓబీసీలు అంటే ఓన్లీ బ్రదర్–ఇన్–లా కమీషన్ అంటూ రాహుల్ బావ రాబర్ట్ వద్రాను ఉద్దేశించి ఆరోపణలు గుప్పించారు. ''కులగణనపై కాంగ్రెస్‌కు ఓ వైఖరంటూ ఉందా? రాహుల్ కులగణన కావాలంటున్నారు. ఆయన తండ్రి రాజీవ్ గాంధీ మాత్రం ఓబీసీలకు రిజర్వేషన్లను వ్యతిరేకించారు. బోఫోర్స్ మొదలుకుని కామన్వెల్త్ క్రీడలు, 2జీ, గడ్డి, యూరి యా, బొగ్గు, నేషనల్ హెరాల్డ్... ఇలా కాంగ్రెస్ హయాంలో జరిగిన కుంభకోణాలకు అంతే లేదు'' అంటూ దుయ్యబట్టారు.



పట్టాలు తప్పిన హౌరా-ముంబై రైలు

జంషెడ్‌పూర్/రాంచీ/చాయ్‌బసా/కోల్‌కతా: జార్ఖండ్‌లోని సెరాయ్‌కెలా-ఖర్సావాన్ జిల్లాలో హౌరా-ముంబై మెయిల్ రైలు పట్టాలు తప్పింది. 18 బోగీలు పట్టాలు తప్పిన ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. 22 మంది గాయపడ్డారు. జంషెడ్‌పూర్ నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని బారాబంబూ స్టేషన్ దగ్గర్లోని పోటోబెబా గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలికి సమీపంలోనే గూడ్సు రైలు ఒకటి పట్టాలు తప్పిందని, రెండు ఘటనలు ఒకేసారి జరిగాయా అనేది తేల్చాల్సి ఉందని సౌత్‌ఈస్ట్‌రైల్వే అధికార ప్రతినిధి ఓం ప్రకాశ్ చరణ్ చెప్పారు. అయితే ఆగిఉన్న గూడ్సు రైలును హౌరా-ముంబై రైలు ఢీకొట్టిందని వెస్ట్ సింఘ్‌భమ్ డెప్యూటీ కమిషనర్ కుల్‌దీప్ చౌదరి చెప్పారు. ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తలో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను రైల్వే శాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి తలో రూ.1 లక్ష ఇవ్వనున్నారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల ఎక్స్‌గ్రేషియాను జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఘటన జరిగిన రైల్వే మార్గం గుండా వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దుచేశారు. కొన్నింటిని దారి మళ్లించారు.

విపక్షాల గొంతు నొక్కుతోంది

కేంద్రంపై ఇండియా కూటమి ధ్వజం • జంతర్‌మంతర్ వద్ద ధర్నా

న్యూఢిల్లీ: బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేస్తోందని 'ఇండియా' కూటమి నేతలు హస్తిన వేదికగా ధ్వజమెత్తారు. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌ను అన్యాయంగా జైల్లో పడేసి ఆరోగ్యపరిస్థితిని దారుణంగా దిగజార్చారని మండిపడ్డారు. కేజ్రీవాల్‌ను విడుదలచేయాలంటూ కూటమి నేతలు మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టారు. భారత్ మాతాకీ జై, నియంతృత్వం నశించాలి నినాదాలతో ధర్నాస్థలి హోరెత్తింది. ఆప్ పిలుపుమేరకు చేపట్టిన ఈ ధర్నాకు ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నేత దీపాంకర్ భట్టాచార్య, లోక్‌సభలో కాంగ్రెస్ డెప్యూటీ లీడర్ గౌరవగొగోయ్, శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, కాంగ్రెస్, ఆప్ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, భారీ సంఖ్యలో ఆప్ కార్యకర్తలు హాజరయ్యారు.

ఢిల్లీ సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో రావూస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో సివిల్స్ అభ్యర్థుల జలసమాధి ఉదంతంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) స్పందించింది. మరణాలపై మీడియా వార్తలతో కేసును సూమోటోగా స్వీకరించింది. ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వంతోపాటు ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసుల జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఢిల్లీలో నడుస్తున్న కోచింగ్ సెంటర్లు, సంస్థల వివరాలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, సంబంధిత శాఖ అధికారులు వాటిపై తీసుకున్న చర్యల గురించి కూడా నివేదికలో పొందుపర్చాలని ఎన్‌హెచ్‌ఆర్సీ కోరింది. అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మీడియాలో కథనాలు వెలువడ్డాయని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడింది. పటేల్ నగర్ ప్రాంతంలో పూడిక తీయకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచి అక్కడ విద్యుదాఘాతానికి గురై సివిల్స్ అభ్యర్థి మరణించిన ఉదంతాన్నీ కేసుగా ఎన్‌హెచ్‌ఆర్సీ సూమోటోగా స్వీకరించింది.

ఆగస్టు 2-3 తేదీల్లో గవర్నర్ల సదస్సు

న్యూఢిల్లీ: వచ్చే నెల రెండు, మూడో తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన గవర్నర్ల సదస్సు జరగనుంది. నూతన నేర చట్టాల అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, గిరిజన ప్రాంతాల పురోభివృద్ధి, విశ్వవిద్యాలయాల పనితీరు, వెనుకబడిన జిల్లాలు, సరిహద్దు ప్రాంతాల సమస్యలు వంటి అంశాలు ఈ సదస్సులో ప్రధానంగా చర్చకొచ్చే అవకాశముంది. రాష్ట్రపతి ముర్ము ఆధ్వర్యంలో జరగబోతున్న తొలి గవర్నర్ల సమావేశం ఇదేనని రాష్ట్రపతిభవన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సదస్సులో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ప్రధాని కార్యాలయంలోని సీనియర్ ఉన్నతాధికారులు పాల్గొంటారు. మై భారత్, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, అమ్మ కోసం ఒక చెట్టు, ప్రకృతి వ్యవసాయం, కేంద్రప్రభుత్వ సంస్థలతో రాష్ట్రాలు సమన్వయంగా పనిచేయడం వంటి అంశాలూ చర్చకురానున్నాయి.

భారత్ ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: భారత్ ప్రతిష్టను దెబ్బతీసి.. మనదేశం పెట్టుబడులకు సురక్షితం కాదనే సందేశాన్ని విదేశీ ఇన్వెస్టర్లకు పంపే కుట్ర జరిగిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 2024–25 బడ్జెట్‌పై చర్చకు లోక్‌సభలో ఆమె సమాధానమిస్తూ విపక్షాలపై మండిపడ్డారు. 'భారత సామాజిక విలువలపై, పార్లమెంటరీ సాంప్రదాయాలపై, సాయుధ బలగాలపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్రదాడి జరిగింది. దేశంలో అస్థిరత, అరాచకత్వం ఉంటే.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమవుతుంది. ఇదో పెద్ద సవాల్' అని నిర్మల అన్నారు. భిన్నత్వం కలిగిన సమాజాన్ని తరతరాల కృషితో భారత్ ఏకతాటి పైకి తెచ్చిందని, కానీ ఈ రోజు కుట్రపూరితంగా ఒకరికిపై మరొకరికి అపనమ్మకాన్ని కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్ధాలు, కుయుక్తులతో ప్రజల మధ్యన విభజన తెస్తున్నారని ఆరోపించారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులను కల్పించే ప్రయత్నం జరుగుతోందని, చిన్నపాటి నిప్పురవ్వ (గొడవ) కూడా తీవ్ర సంఘర్షణలకు దారితీయాలని కోరుకుంటున్నారని అన్నారు. ఏదో ఒక వంకతో సాయుధ బలగాలపై దాడులను ముమ్మరం చేస్తున్నారని ఆక్షేపించారు. అగ్నివీర్‌లపై వివాదం ఈ కుట్రలో భాగమన్నారు. సమాజమే కాకుండా ఆర్థిక వ్యవస్థ, పార్లమెంటు, సైన్యంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను విలన్లుగా చూపుతున్నారని, ఇది సిగ్గుచేటని పేర్కొన్నారు. 'పారిశ్రామిక సంస్కృతిని ముగించాలనే కుట్ర జరుగుతోంది. భారత్ వెన్నుముకపై దాడి జరుగుతోంది. వ్యాపారులపై ప్రతికూలతను వ్యాప్తి చేస్తున్నారు. సంపదను సృష్టించే వారిపై, వ్యాపారాలపై ద్వేషం ప్రబలుతోంది. పెట్టుబడులకు భారత్ సురక్షితం కాదనే సందేశాన్ని ప్రపంచానికి పంపే కుట్ర జరుగుతోంది. ఇది మంచిది కాదు' అని నిర్మల అన్నారు.

2009 బడ్జెట్‌లో ఏకంగా 26 రాష్ట్రాల ప్రస్తావన లేదు

బడ్జెట్‌లో ఏదేని రాష్ట్రం ప్రస్తావన రాకపోతే సదరు రాష్ట్రానికి అసలే నిధుల కేటాయింపు జరగనట్లు కాదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీలను సంతృప్తిపర్చడానికే బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారనే విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చారు. యూపీఏ హయాంలో 2009–10 బడ్జెట్‌లో ఏకంగా 26 రాష్ట్రాల ఊసు లేదని, 2004–05 బడ్జెట్‌లో 17 రాష్ట్రాల ప్రస్తావనే లేదని.. అంటే ఆ రాష్ట్రాలకు నిధులు వెళ్లలేదా? అప్పుడు ప్రస్తావన లేని రాష్ట్రాలకు నిధులు ఆపి ఉంటే.. ఇప్పుడిలా కనీస ప్రస్తావన లేదనే అంశాన్ని లేవనెత్తవచ్చు' అని నిర్మల అన్నారు. తమ ప్రభుత్వం ఏ ఒక్క రాష్ట్రానికి నిధులను నిరాకరించలేదన్నారు.

'కమల' వికాసం సాధ్యమే: లిచ్‌మాన్

వాషింగ్టన్: గత నాలుగు దశాబ్దాలుగా అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను దాదాపు ఖచ్చితంగా ఊహించి చెప్పిన అలాన్ లిచ్‌మాన్ మరోమారు తన విశ్లేషణను వెల్లడించారు. తాజా ఎన్నికల ప్రచార సరళి, అమెరికా ఓటర్ల మనోభావాలను లెక్కలోకి తీసుకుంటే డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ నెగ్గే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఆయన చెప్పారు. అయితే వచ్చే నెలలో డెమొక్రటిక్ కన్వెన్షన్ తర్వాతే తన తుది అంచనాలను వెల్లడిస్తానని ఆయన స్పష్టంచేశారు. 1984 ఏడాది నుంచి అమెరికాలో 10 సార్లు అధ్యక్ష ఎన్నికలు జరిగితే తొమ్మిది సార్లు ఈయన చెప్పింది నిజమైంది. దీంతో ఆయన్ను అమెరికా అధ్యక్ష ఎన్నికల నోస్ట్రడామస్‌గా అందరూ పిలుస్తారు. అమెరికన్ విశ్వవిద్యాలయంలో గత యాభై సంవత్సరాలుగా అధ్యాపకుడిగా పనిచేస్తున్న లిచ్‌మాన్ 1981 ఏడాదిలో 'గెలుపునకు 13 సూత్రాలు' అనే విధానాన్ని ప్రతిపాదించారు. ఈ 13 అంశాల ప్రాతిపదికన ఏ పార్టీ, అభ్యర్థి గెలుస్తారని అంచనా వేస్తానని ఆయన చెప్పారు. 2016లో ట్రంప్, 2020లో బైడెన్ గెలుస్తారన్న జోస్యాలు నిజమవడంతో 2024లో గెలుపుపై ఏం చెప్పబోతున్నారోనని ఆసక్తి నెలకొంది.

లాయర్లుగా ఎన్‌రోల్‌కు అంత ఫీజా?

వేలల్లో ఫీజుల వసూలుపై సుప్రీంకోర్టు విస్మయం



న్యూఢిల్లీ: న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టేందుకు లాయర్లుగా ఎన్‌రోల్‌చేసుంటున్న న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి రాష్ట్రాల బార్ కౌన్సిళ్లు(ఎస్‌బీసీ) భారీ స్థాయిలో ఫీజులు వసూలుచేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. నిబంధనల ప్రకారం ఎస్సీ–ఎస్టీ కేటగిరీ లా పట్టభద్రుల నుంచి రూ.125 ఫీజు, జనరల్ కేటగిరీ నుంచి రూ.750 మించి వసూలుచేయకూడదని ధర్మాసనం ఆదేశించింది. ఎస్‌బీసీలు వసూలుచేస్తున్న విపరీతమైన ఫీజుల కారణంగా అణగారిన, ఆర్థికంగా వెనకబడిన వర్గాల పేద, మధ్యతరగతి లా పట్టభద్రులు న్యాయవృత్తిలోకి రాలేని పరిస్థితి నెలకొంటోందని, వారు ఈ వృత్తిలో భాగస్వాములయ్యే అవకాశాలు తగ్గిపోతాయని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆవేదన వ్యక్తంచేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

క్యాట్ సభ్యురాలిగా రైల్వే బోర్డు చైర్‌పర్సన్



న్యూఢిల్లీ: రైల్వే బోర్డు చైర్‌పర్సన్, సీఈవో జయ వర్మ సిన్హా కేంద్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్ (క్యాట్) సభ్యురాలిగా నియమితులయ్యారు. ఆగస్టు 31న రైల్వే బోర్డు నుంచి పదవీ విరమణ పొందాక క్యాట్ సభ్యురాలిగా బాధ్యతలు చేపడతారు. జయతో పాటు మరో 11 మందిని క్యాట్ సభ్యులుగా నియమిస్తూ కేబినెట్ నియామకాల కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హర్‌నరేశ్ సింగ్ గిల్, జస్టిస్ పద్మరాజ్ నేమచంద్ర దేశాయ్, వీణా కొతవాలే, రాజ్‌వీర్ సింగ్ వర్మలు క్యాట్‌లో జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులయ్యారు.

రేగడిమైలారం ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎం



సీఎం సారూ... ఇక్కడ ఐదు తరగతులకు ఒక్కరే సారు!

సీఎం సొంత నియోజకవర్గంలో ఉన్న రేగడిమైలారంలోని జెడ్పీహెచ్ఎస్ దుస్థితి

18 ఏళ్లుగా ఒకే స్కూల్ అసిస్టెంట్‌తో నడుస్తున్న ఉన్నత పాఠశాల

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఆరు నుంచి పదో తరగతి వరకు 146 మంది విద్యార్థులు ఉండగా ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. అక్కడ పనిచేసేందుకు చాలా మంది స్కూల్ అసిస్టెంట్లు సుముఖంగా ఉన్నప్పటికీ పాఠశాలకు అధికారిక పోస్టులు మంజూరు కాకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొంది.

అప్‌గ్రేడ్ చేసి.. వదిలేశారు!

రేగడిమైలారం ప్రాథమిక పాఠశాలను 2005–06లో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పట్లో స్కూల్‌కు ఫిజికల్ సైన్స్ టీచర్‌ను మాత్రమే నియమించారు. 2007లో ఎనిమిదో తరగతిని సైతం అందుబాటులోకి తెచ్చినా కొత్త పోస్టులు ఇవ్వలేదు. 2016 వరకు ప్రైమరీ సిబ్బందితోనే 8వ తరగతి వరకూ నెట్టుకొచ్చారు. 2017–18లో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసినా కొత్త పోస్టులు మంజూరు చేయలేదు. దీంతో 2006లో వచ్చిన ఒకే ఒక్క ఫిజికల్ సైన్స్ టీచర్‌తోనే 18 ఏళ్లుగా హైస్కూల్‌ను నడిపిస్తున్నారు. గతేడాది ఆరు నుంచి పదో తరగతి వరకు 154 మంది విద్యార్థులు చదివారు. వారిలో 28 మంది టెన్త్ విద్యార్థులు ఉండగా 9 మందే ఉత్తీర్ణులయ్యారు. ఈసారి పాఠశాలలో మొత్తం 146 మంది ఉండగా వారిలో 19 మంది టెన్త్ చదువుతున్నారు. ఒకే ఆవరణలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కొనసాగుతుండగా ప్రైమరీ స్కూల్‌లో ఏడుగురు ఎస్జీటీలు, హైస్కూల్‌లో ఒకే ఒక్క స్కూల్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో హైస్కూల్ విద్యార్థులకూ ప్రైమరీ టీచర్లే పాఠాలు బోధిస్తున్నారు. సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఈ స్కూల్ హైదరాబాద్- బీజాపూర్ హైవేను ఆనుకొని ఉండటంతోపాటు సీఎం సొంత నియోజకవర్గం కావడం గమనార్హం.



కలుపు తీసేందుకు వెళ్తున్నా..

బడికి వెళ్లి చదువుకోవాలని ఉన్నా పాఠాలు చెప్పేవారు లేరు. ఎలాగూ క్లాసులు జరగడం లేదు. కనీసం అమ్మానాన్నలకు ఆసరాగా ఉందామని సమయం దొరికినప్పుడల్లా పత్తిలో కలుపు తీసేందుకు వెళ్తున్నా.

- భూమిక, ఎనిమిదో తరగతి, రేగడిమైలారం



ఎవరికీ న్యాయం చేయలేకున్నాం

పీఎస్, జెడ్పీహెచ్ఎస్‌లు ఒకే ఆవరణలో ఉన్నందున హైస్కూల్ విద్యార్థులకు డిప్యుటేషన్‌పై మేమే పాఠాలు చెబుతున్నాం. దీంతో అటు ప్రైమరీ, ఇటు హైస్కూల్ విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నాం. అధికారులు, సీఎం స్పందించి పోస్టులు ఇవ్వాలి.

- మల్లేశ్, పీఎస్ హెచ్ఎం, రేగడిమైలారం

'విద్యుత్' కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ మదన్ బి.లోకూర్

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోళ్లకు ఒప్పందం కుదుర్చుకోవడంపై పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అధ్యక్షతన విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత మార్చి 14న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మూడు నిర్ణయాల్లో చోటుచేసుకున్న అవకతవకతలపై విచారణ జరిపి రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని నిర్ధారించాలని, అందుకు బాధ్యులైన వారిని గుర్తించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. ఇప్పుడు ఇదే మార్గదర్శకాలు జస్టిస్ లోకూర్ కమిషన్‌కు కూడా వర్తిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాల్లో పాత్ర ఉన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్ రావు, ఇంధన శాఖ కార్యదర్శులు, ఇతర అధికారులకు జస్టిస్ నరసింహా రెడ్డి గతంలో నోటీసులు జారీ చేసి వారి నుంచి రాతపూర్వకంగా వాంగ్మూలాన్ని స్వీకరించారు. విచారణ ప్రక్రియను దాదాపుగా పూర్తి చేసి నివేదికను సైతం రూపొందించారు. ఈ క్రమంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓ సందర్భంలో జస్టిస్ నరసింహా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలను కారణంగా చూపుతూ విచారణ కమిషన్‌ను రద్దు చేయాలని కేసీఆర్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా, జూలై 1న కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును కేసీఆర్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, జస్టిస్ నరసింహారెడ్డిని మార్చి విచారణను యథావిధిగా కొనసాగించవచ్చని ఈ నెల 16న మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ మదన్ బి.లోకూర్‌ను నియమించడంతో విద్యుత్ నిర్ణయాలపై విచారణ ప్రక్రియ పునఃప్రారంభం కానుంది.

కలెక్టర్, పీవో అడవిబాట

దట్టమైన అటవీ ప్రాంతంలో 10 కి.మీ. నడిచిన భద్రాద్రి కలెక్టర్, ఐటీడీఏ పీవో

పోడు చేసుకోనివ్వడం లేదని హైకోర్టులో గిరిజనుల పిటిషన్ కోర్టు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఐఏఎస్‌లు



వాగు దాటి నడిచివెళ్తున్న కలెక్టర్, పీవో

దుమ్ముగూడెం: ఇద్దరు ఐఏఎస్‌లు.. వారిలో ఒకరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకలెక్టర్ జితేష్ వి.పాటిల్, మరొకరు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్. పోడు సాగు అంశంపై హైకోర్టులో రైతులు పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు సూచనలతో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అడవిబాట పట్టారు. వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో రానుపోను 10కి.మీ. నడిచారు.

సమస్య ఏంటంటే...

భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం గౌరారం అటవీ రేంజ్ పరిధిలో పలువురు రైతులకు కొన్నాళ్ల క్రితం పోడు పట్టాలు అందాయి. అయితే, ఈ భూమిలో అటవీ అధికారులు తమను సాగు చేసుకోనివ్వడం లేదని, పంటలను ధ్వంసం చేస్తున్నారంటూ 23మంది గిరిజన రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్న కోర్టు సూచనలతో కలెక్టర్ పాటిల్, పీవో రాహుల్ మంగళవారం అక్కడకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దుమ్ముగూడెం మండలంలోని ములకనాపల్లి ప్రధానరహదారి వరకు మాత్రమే రహదారి ఉండడంతో వాహనాల్లో వెళ్లారు. అక్కడినుంచి దట్టమైన అడవిలో రెవెన్యూ, అటవీ అధికారులతో కలిసి కాలిబాటన వాగులు, వంకలు దాటుతూ గౌరారం వరకు 5 కి.మీ. వెళ్లి సమస్యపై రైతులు, అటవీ అధికారులతో మాట్లాడారు. అడవిని నరికారని అధికారులు వివరించారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించగా, ఫారెస్ట్ భూమిని కొందరు ఆక్రమించినట్టు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కు పత్రాల్లో ఉన్నంత మేరకు భూమి సాగు చేసుకోవాలని సూచించారు. మావోయిస్టుల వారోత్సవాలు జరుగుతున్న సమయాన అటవీ ప్రాంతంలో ఇద్దరు ఐఏఎస్‌లు పర్యటించడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రసాయనిక ఆహారం వల్లే రోగాలు

చర్చాగోష్టిలో డాక్టర్ సుభాష్ పాలేకర్

ఎస్.పి.కె. సాగు పద్ధతి ద్వారానే ఆహార స్వావలంబన సాధ్యమని వెల్లడి



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న సుభాశ్ పాలేకర్

సాక్షి, హైదరాబాద్: రైతుల్ని ఆర్థికంగా దెబ్బతీయడంతోపాటు ప్రజలను రోగాలబారిన పడేస్తున్న రసాయనిక వ్యవసాయాన్ని నిషేధించాలని పద్మశ్రీ పురస్కారగ్రహీత డాక్టర్ సుభాశ్ పాలేకర్ పిలుపునిచ్చారు. సంపూర్ణ ఆహార స్వావలంబన సాధించేందుకు తాను రూపొందించిన సుభాశ్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిని అనుసరించటం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ క్లబ్‌లో మంగళవారం పలువురు సినీ ప్రముఖులు, సామాజికవేత్తలతో జరిగిన చర్చాగోష్టిలో పాలేకర్ ప్రసంగించారు. రసాయనిక వ్యవసాయ ఉత్పత్తులు దేశ ప్రజలను మధుమేహం, కేన్సర్ వంటి జబ్బులపాలు చేస్తున్న విషయాన్ని పాలకులు, సమాజం ఇప్పటికైనా గుర్తించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంలోనూ టన్నులకొద్దీ పశువుల ఎరువులు వేయడం వల్ల రసాయనిక వ్యవసాయంలో మాదిరిగానే కర్బన ఉద్గారాలు పెద్ద ఎత్తున వెలువడి భూతాపాన్ని పెంచుతున్నాయని ఆయన చెప్పారు. ఎస్.పి.కె. పద్ధతిలో నేలలో సూక్ష్మజీవులను పెంపొందించే జీవామృతం, ఘన జీవామృతం వంటి మైక్రోబియల్ కల్చర్‌ను కొద్ది మొత్తంలో వేస్తే సరిపోతుందని, టన్నుల కొద్దీ పశువుల ఎరువులు వేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయాలను ఆకళింపు చేసుకొని 5 లేయర్ పద్ధతిలో సాగు చేస్తే ఎకరానికి తొలి ఏడాదిలోనే రూ. లక్షన్నర ఆదాయం వస్తుందని, ఆరేళ్ల తర్వాత నుంచి ఏటా ఎకరానికి రూ. 6 లక్షల ఆదాయం వస్తుందని వివరించారు.

7 వేల మందితో మెగా శిక్షణా శిబిరం

2015 ఫిబ్రవరి 15 నుంచి 23 వరకు రంగారెడ్డి జిల్లాలోని కన్హ శాంతివనంలో 7 నుంచి 10 వేల మంది రైతు కుటుంబీకులతో మెగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు శిబిరం నిర్వాహకులు, సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పద్మవిభూషణ్ పురస్కారగ్రహీత, శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు కె.ఎస్. వరప్రసాద్‌రెడ్డి, ప్రముఖ సినీనిర్మాత దగ్గుబాటి సురేశ్, టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, నాఫ్‌స్కాబ్ మాజీ అధ్యక్షుడు కొండ్రు రవీంద్రరావు, ఆధ్యాత్మికవేత్త సత్యవాణి, సినీ రచయిత భారవి, నాబార్డ్ పూర్వ సీజీఎం మోహనయ్య, సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్, ప్రకృతి వ్యవసాయ ప్రేమికులు పాల్గొన్నారు.


నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు

సాగర సంబురం

శ్రీశైలం ప్రాజెక్టులోకి 4.13 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం

- 883.5 అడుగుల వద్ద 203.99 టీఎంసీలకు చేరిన నిల్వ
- ప్రాజెక్టు10 గేట్లు ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 60,999 క్యూసెక్కుల నీరు కూడా దిగువకే..
- నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి గంటగంటకూ పెరుగుతున్న వరద
- 517.2 అడుగుల వద్ద 144.22 టీఎంసీలకు చేరిన నిల్వ

సాక్షి,హైదరాబాద్/దోమలపెంట: శ్రీశైలం జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతుండగా,నాగార్జునసాగర్ ప్రాజెక్టు సైతం జలకళను సంతరించుకుంటోంది. బిరబిరా కృష్ణమ్మ తరలివస్తుండడంతో నాగార్జునసాగర్‌లో గంట గంటకూ నీటినిల్వ పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి మంగళవారం రాత్రి 7 గంటలకు 4,13,178 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో నీటినిల్వ 883.5 అడుగుల వద్ద 207.41 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటం.. నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది, దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు 10 అడుగుల మేర పైకి ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ మరో 60,840 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 25 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. శ్రీశైలం స్పిల్‌వే గేట్లు, విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు విడుదల చేస్తున్న ప్రవాహం నాగార్జునసాగర్ వైపు పరుగులు తీస్తోంది. నాగార్జునసాగర్‌లోకి మంగళవారం సాయంత్రం 6 గంటలకు 1,55,716 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో నీటినిల్వ 517.2 అడుగుల వద్ద 144.22 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు.. పూర్తి నిల్వసామర్థ్యం 312.05 టీఎంసీలు. సాగర్ నిండాలంటే ఇంకా 170 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి వరద ప్రవాహం ఇదే రీతిలో కొనసాగితే మరో వారంరోజుల్లో నాగార్జునసాగర్ నిండే అవకాశముంది. మహారాష్ట్ర, కర్ణాటకలలో పశ్చిమ కనుమల్లో వర్షాలు తెరిపి ఇవ్వడంతో ఎగువన కృష్ణా, దాని ఉపనదుల్లో వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 3 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 2.85 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 2.77 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 2.95 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 2.85 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 70 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 32వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు.

మళ్లీ గోదావరికి పెరిగిన వరద

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

సాక్షి, హైదరాబాద్: గోదావరినది పరీవాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో సోమవారం రాత్రి, మంగళవారం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగింది. దీంతో గోదావరిలో మళ్లీ వరద ప్రవాహం పెరుగుతోంది. భద్రాచలం నుంచి ధవళేశ్వరం వరకూ బుధవారం గోదావరి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుందని కేంద్ర జలసంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధికారులను హెచ్చరించింది. ప్రాణహితలో వరద పెరగడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లోకి వరద ప్రవాహం 7.71 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దానికి ఇంద్రావతి వరద తోడవుతుండటంతో తుపాకులగూడెం(సమ్మక్క సాగర్) బరాజ్‌లోకి 9.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా, అంతేస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్(దుమ్ముగూడెం బరాజ్)లోకి చేరుతున్న 9.64 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. భద్రాచలం వద్దకు మంగళవారం సాయంత్రం 8.45 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. నీటి మట్టం 43.7 అడుగులుగా నమోదైంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి 10.08 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా, అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బరాజ్‌లోకి 11,26,625 క్యూసెక్కులు చేరుతుండగా.. 11,19,425 క్యూసెక్కులను 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. బరాజ్ వద్ద నీటిమట్టం 12.6 అడుగులుగా నమోదవుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఇక కూనవరం వద్ద శబరి ఉధృతితో నీటిమట్టం 39.25(సముద్రమట్టానికి) మీటర్ల వద్ద కొనసాగుతుండటంతో రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.

మంగళవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
జూరాల	1,045	9.66	1043.01	8.43	2,95,000	2,85,434
తుంగభద్ర	1,633	105.79	1631.97	101.66	70,296	32,387
శ్రీశైలం	885	215.81	883.50	207.41	4,13,178	2,75,700
నాగార్జునసాగర్	590	312.05	517.2	144.22	155716	6,744

కుంగిన వంతెన.. తెగిన రోడ్లు

భద్రాద్రి జిల్లాలో వర్షం తెచ్చిన పాట్లు


పాలవాగును కర్ర సాయంతో దాటుతున్న మహిళ

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో చెరువులు, వాగులు ఉప్పొంగాయి. దీంతో స్థానికులకు రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. ములకలపల్లి–తాళ్లపాయ మధ్య పాములేరు వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకుగాను తొలుత డైవర్షన్ రోడ్డు వేశారు. కొద్ది రోజుల క్రితం వర్షానికి రోడ్డు తెగిపోవడంతో రూ.13లక్షల వ్యయంతో ఐరన్ బ్రిడ్జి నిర్మించారు. అయితే, దీనిని ప్రారంభించి పది రోజులు కాకముందే కుంగిపోయింది. దీంతో ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేసి పాదచారులను మాత్రమే అనుమతిస్తున్నారు. మంగళవారం తాళ్లపాయకు చెందిన సడియం రమ్య–వెంకటేశ్ నాలుగేళ్ల కొడుకు రిహాన్స్‌కు ఫిట్స్ రావడంతో ములకలపల్లి పీహెచ్‌సీకి తరలించేందుకు తంటాలు పడ్డారు. అంబులెన్స్ వచ్చే వీలు లేక బ్రిడ్జి వరకు బైక్‌పై తీసుకొచ్చి ఆపై భుజాన ఎత్తుకుని వంతెన దాటాల్సి వచ్చింది. ఓ వృద్ధురాలైన రోగిని వీల్‌చైర్‌పై దాటించారు. ఇదే ములకలపల్లి మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు 42.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో ములకలపల్లి, ముత్యాలంపాడు శివారు వాగులపై నిర్మించిన డైవర్షన్ రోడ్లు కొట్టుకుపోయాయి. ఇందులో ముత్యాంపాడు శివారు పాలవాగు డైవర్షన్ రోడ్డు కూడా తెగిపోగా అత్యవసర పనులు ఉన్నవారు మోకాలి లోతు నీళ్లను తాళ్లు, కర్రల సాయంతో దాటారు.



ఐదేళ్లలో 4,813 మంది పిల్లలు మిస్సింగ్

4,192 మంది పిల్లల ఆచూకీ దొరికింది
లోక్‌సభలో హోంశాఖ సహాయమంత్రి బండి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 2018 నుంచి 2022 మధ్య మొత్తం 4,813 మంది చిన్నారులు తప్పిపోయారని... వీరిలో 4,192 మంది పిల్లల ఆచూకీ దొరికిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అధికారి దీపక్‌దేవ్, సీపీఐ(ఎం) ఎంపీ ఎస్.వెంకటేశన్‌లు అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో కేంద్రమంత్రి ఎన్సీఆర్‌బీ గణాంకాలను మరోసారి సభ దృష్టికి తీసుకొచ్చారు. దేశవ్యాప్తంగా 1.27 లక్షల మంది చిన్నారులు తప్పిపోగా, ఈ ఐదేళ్ల కాలంలో 80,561 మంది ఆచూకీ తెలిసిందని బండి సంజయ్ పేర్కొన్నారు. అంతేగాక దేశంలో 4.03 లక్షల మంది మహిళలు అదృశ్యంకాగా.. అందులో 2.05 లక్షల మంది ఆచూకీ దొరికిందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణలో 13,317 మంది మహిళలు మిస్సింగ్ నమోదు కాగా.. వీరిలో 11,952 మంది మహిళల ఆచూకీ దొరికిందని వెల్లడించారు. నిర్భయ ఫండ్ కింద 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం రూ. 7,212.85 కోట్లు కేటాయించగా, అందులో 2015–2016 నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం మధ్య రూ. 5,212.85 కోట్లు కేటాయించినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రాలపై కేంద్రానికి ఎలాంటి వివక్ష లేదు: నిర్మలా సీతారామన్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో సమాఖ్యవాదానికి మరింత బలం చేకూర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కేంద్రానికి రాష్ట్రాలపై ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న నిర్మలా



సీతారామన్ పలు అంశాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. బడ్జెట్ ప్రసంగంలో కేవలం బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రస్తావన మాత్రమే వచ్చిందని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఆమె ఘాటుగా తిప్పికొట్టారు. యూపీఏ హయాంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతీ ఏడాది ఎన్ని రాష్ట్రాల పేర్లను ప్రస్తావించారన్న అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులను మంజూరు చేసిన విషయాన్ని సభలో వెల్లడించారు. వీటిలో గ్రీన్‌ఫీల్డ్ పార్క్‌లకు రూ.500 కోట్లు, బ్రౌన్‌ఫీల్డ్ పార్క్‌లకు రూ.200 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని మరిచిపోయారా? అని నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. వీటితో పాటు తెలంగాణలో మూడు రైల్వే ప్రాజెక్టుల డబ్లింగ్ పనులకు రూ.7,052 కోట్లు కేటాయించామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ–మహారాష్ట్ర, తెలంగాణ–ఏపీల మధ్య ఇటీవల మంజూరైన రైల్వే లైన్ల పనుల గురించి వివరించారు. ముద్ఖేడ్–మేడ్చల్–మహబూబ్‌నగర్–డోన్ రైల్వే లేన్ డబ్లింగ్ పనులకు రూ.4,686 కోట్లు, పోటుమర్రి–విష్ణుపురం రైల్వే లేన్ డబ్లింగ్ పనులకు రూ.1,596 కోట్లు, భద్రాచలం–డోర్నకల్ సెక్షన్ డబ్లింగ్ పనులకు రూ.770 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని సభలో వెల్లడించారు.



స్నేహం ముసుగులో లైంగిక దాడి

చిన్ననాటి స్నేహితురాలికి ఓ యువకుడు మద్యం తాగించి.. స్నేహితుడితో కలిసి లైంగిక దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. -10లో



నార్సింగి డ్రగ్స్ కేసులో వీఐపీలు!

నార్సింగి డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నైజీరియా డ్రగ్ పెడ్లర్ల నుంచి మరో 30 మంది ప్రముఖులు డ్రగ్స్ తీసుకొని విని యోగించినట్లు పోలీసులు గుర్తించారు. -10లో

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది.

‘దొంగలు’ దొరికారు

సెల్‌ఫోన్లు దేశం దాటించి బంగ్లాదేశ్‌లో అమ్మకం

- అంతర్రాష్ట్ర ముఠాకు చెక్
- పరారీలో ప్రధాన నిందితులు
- సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు, హోంగార్డు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

పంజగుట్ట: అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెక్ పెట్టారు పంజగుట్ట పోలీసులు. అయిదుగురు నిందితులను, వీరికి సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లను, హోంగార్డును అరెస్టు చేశారు. మంగళ వారం పశ్చిమ మండల డీసీపీ విజయ్‌కుమార్, పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, బిహార్‌కు చెందిన పాత నేరగాళ్లు బృందంగా ఏర్పడ్డారు. రెండేళ్లుగా హైదరాబాద్, ముంబై, సూరత్ తదితర ప్రధాన నగరాల్లో రద్దీ ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకుని సెల్ ఫోన్లు, పర్సులు, బంగారు ఆభరణాలను చోరీ చేసేవారు. 10 నుంచి 12 ఏళ్ల పిల్లల చేతా దొంగతనాలు చేయించేవారు. పిల్లలు రద్దీ ప్రాంతాల్లో కాళ్ల మధ్యలోంచి త్వరగా వెళ్లిపోవచ్చు. ఒకవేళ దొరికినా పిల్లలే కదా అని వదిలేస్తారనే ధీమాతో డబ్బులు బాగా అవసరం ఉన్న వారిని ఎంపిక చేసుకుంటారు. వారి తల్లిదండ్రు లకు కొంత ముట్టజెప్పి వీరిని వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్లి దొంగతనాలు చేయిస్తుంటారు.

నిందితులు దొరికారు ఇలా ...



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ విజయ్ కుమార్

ఈ నెల 23 ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ వద్ద ముఠాలోని సభ్యుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన అల్ అమీన్ గాజీ (24) రద్దీ ఉన్న ప్రదేశం చూసుకుని శ్రీనివాస్ అనే ప్రయాణికుడి ఫోన్ దొంగతనం చేసి పారిపోయేందుకు యత్నించగా అతడిని పట్టుకుని మెట్రో సెక్యూరిటీ సిబ్బందికి అప్ప జెప్పగా.. వారు పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. నిం దితున్ని లోతుగా విచారించగా.. వీరు ఒక బృందంగా వచ్చి ఎంఎస్ మక్తాలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నట్లు చెప్పాడు. బృందం మొత్తం ఎర్రమంజిల్ మెట్రో వద్దే ఉన్నారని.. వీరిలో ఇద్దరికి 58 సెల్‌ఫోన్ ఇచ్చి ఝార్ఖండ్‌కు పంపించినట్లు సమాచారమిచ్చాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు బిహార్‌కు చెందిన మహ్మద్ షానవాజ్ (39), జోను కుమార్ (22), ఝార్ఖండ్‌కు చెందిన గోవింద కుమార్ (32), జుగేశ్వర్ నోనియా (31), మహ్మద్ ముక్తార్ షేక్ (28)లతో పాటు ఓ మైనర్‌ను అరెస్టు చేశారు. తాము చోరీ చేసిన సెల్‌ఫోన్లు దేశం దాటించి బంగ్లాదేశ్‌లో అమ్ముతున్నట్లు నిందితులు చెప్పారు.

దొంగలతో కలిసిన కానిస్టేబుళ్లు, హోంగార్డు..



నిందితులకు సహకరించిన కానిస్టేబుళ్లు, హోంగార్డు

- నిందితులను లోతుగా విచారించగా.. వీరికి గాంధీనగర్ పోలీ స్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించే కె.అశోక్ (45), కానిస్టేబుల్ పి.సోమన్న (38), సైఫాబాద్ ఠాణా కానిస్టేబుల్ సాయిరామ్ (34)లు సహకరిస్తున్నట్లు ఆధారాలు లభిం చాయి. నిందితుల బృందంలోని సభ్యుడు షానవాజ్‌ను ఎస్.ఆ ర్.నగర్ పోలీసులు ఒక కేసు నిమిత్తం గతంలో అరెస్టు చేశారు. ఆ సమయంలో హోంగార్డు అశోక్ ఎస్.ఆర్.నగర్ క్రైమ్ విభా గంలో విధులు నిర్వర్తించేవాడు. నిందితుడు షానవాజ్‌ను చోరీ కేసు నుంచి ఇతను బయటపడేశాడు. నిందితుల బృందం ఎప్పుడు హైదరాబాద్‌కు వచ్చినా హోంగార్డు అశోక్‌కు గ్రూప్ సభ్యుల ఫొటోలు పెట్టి వీరు మనవారే.. ఎక్కడైనా దొరికితే పట్టుకోవద్దు అని ముందుగానే సమాచారం పంపుతాడు.
- గత జూన్ నెలలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితుల గ్రూప్‌లో ఒక సభ్యుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పుడు షానవాజ్.. హోంగార్డు అశోక్‌కు ఫోన్ చేసి తనను విడిపించాలని కోరాడు. అశోక్ గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసే సోమన్న అనే కానిస్టేబుల్ సాయంతో సైఫాబాద్‌లో విధులు నిర్వహించే సాయిరామ్‌కు చెప్పి నిందితుడిని తప్పిం చారు. ఇందుకోసం ఈ గ్రూప్‌లోని సభ్యుడు హోంగార్డు భార్య అకౌంట్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.19 వేలు ద్వారా పంపగా.. హోంగార్డు సోమన్నకు రూ.6 వేలు ఇచ్చాడు. సోమన్న సాయిరామ్‌కు రూ.3 వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆధారాలతో సహా దొరకడంతో వీరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకు న్నామని బృందాన్ని నడిపించే ప్రధాన నిర్వాహకులు ఝార్ఖం డ్‌కు చెందిన కంచన్ నోనియా (34), రాహుల్ కుమార్ యాదవ్ (30)తో పాటు షాను (25), రింకులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.





ఆశామాషీగా కాదు..

తమ డిమాండ్ల సాధనకు ఆశా వర్కర్లు కదం తొక్కారు. నగరంలోని కోఠి ఉమెన్స్ కళాశాల చౌరస్తాలో బైఠాయించారు. ఆశాల ఆందోళనను విరమింపజేసేందుకు పోలీసులు నానా తంటాలు పడ్డారు. వేలాదిగా తరలివచ్చిన ఆశాలు గేట్లు ఎక్కి డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లోకి దూసుకు పోవడంతో తీవ్ర తోపులాట జరిగింది.



‘రికోచట్’తోనే తూటా తంటా!

జవాన్ల ప్రాక్టీస్ నేపథ్యంలో దిశ మారుతున్న బుల్లెట్లు

- రాళ్లు, చెట్లను తాకి సమీపంలోని జనావాసాల్లోకి..
- నార్సింగి ఠాణా పరిధిలో 15 రోజుల్లో రెండు ఉదంతాలు
- కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత మారిన విధానాలతోనే?

ఆర్మీ ఫైరింగ్ రేంజ్‌కు సమీపంలో పలు ప్రాంతాలు



సాక్షి, సిటీబ్యూరో: నార్సింగి పోలీసుస్టేషన్ పరి ధిలోని జనావాసాల్లోకి దూసుకువస్తున్న తూటాలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. అటు ఆర్మీ- ఇటు పోలీసు ఫైరింగ్ రేంజ్‌ల మధ్య నివ సించే వారు హడలిపోయేలా చేస్తున్నాయి. ఈ నెల 14న గంధంగూడలోని ఓ అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులోని ఫ్లాట్ కిటికీలోంచి ఓ బుల్లెట్ దూసుకుపోగా.. తాజాగా మంగళవారం విద్యానగర్ కాలనీలో నివసించే పద్మ కాలిని తూటా తాకుతూ వెళ్లడంతో ఆమెకు గాయమైం ది. ఆర్మీ ఫైరింగ్ రేంజ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న జవాన్లు కాల్చిన తూటాలు రికోచట్ అవటం వల్లే ఇలా జరుగుతోందని పోలీసులు వివరిస్తున్నారు. ఈ రికోచట్ కారణంగానే ఆ తూటా ముందు భాగంలో ఓ పక్క దెబ్బతిందని వివరిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఈ ప్రాంతాలన్నీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోకి వచ్చిన తర్వాత మారిన పరిస్థితులే దీనికి కారణమని చెబుతున్నారు.

తన చుట్టూ తాను తిరుగుతూ ముందుకు..

విద్యానగర్ కాలనీకి చెందిన బాధితురాలు పద్మ కాలికి తాకింది ఏకే-47లో వాడే 7.62 క్యాలిబర్ తూటాగా పోలీసులు తేల్చారు. దీన్ని బట్టి ఇది ఆర్మీ ఫైరింగ్ రేంజ్ నుంచి వచ్చినట్లు నిర్ధారిస్తు న్నారు. తుపాకీకి సంబంధించిన చాంబర్‌లో ఫైర్ అయ్యే తూటా బ్యారెల్ నుంచి అతి వేగంగా దూసుకువస్తుంది. ఈ బ్యారెల్ లోపలి భాగం రింగులతో కూడి ఉండటంతో బుల్లెట్ తన చుట్టూ తాను తిరుగుతూ.. వేగాన్ని పెంచుకుం టూ బయటకు వస్తుంది. ఇలా వచ్చిన తూటా ఎదురుగా ఉన్న వ్యక్తి దగ్గరగా ఉండే శరీరాన్ని చీల్చుకుంటూ అవతలి వైపునకు వెళ్తుంది. ఆ వైపు గోడ ఉంటే తగిలి కిందపడటం, చెక్క, ఫ్లైవుడ్ వంటి ఉంటే వాటిలోకి దూసుకుపోతుం ది. గాజు, అద్దాలు ఉంటే వాటినీ ఛిద్రం చేస్తూ తన ‘దారి’లో ముందుకు వెళ్లిపోతుంది. గన్‌పౌ డర్, బ్యారెల్‌లోని రింగుల ద్వారా వచ్చిన వేగం తగ్గే వరకు ఇలా వెళ్తూనే ఉంటుంది.

బలమైన వస్తువుల్ని తాకితే దిశ మారి..

అత్యంత వేగంగా ప్రయాణిస్తూ వెళ్లే తూటా లోహంతో చేసిన వస్తువులు, బండ రాళ్లు, ప్రత్యేకంగా పటిష్టత కోసం నిర్మించే గోడలకు తాకితే ఆ ధాటికి అది తన దిశను మార్చుకుం టుంది. దీన్నే సాంకేతిక పరిభాషలో రికోచెట్ అంటారు. వేగంగా ప్రయాణిస్తున్న మార్గంలో అడ్డుతగిలిన గట్టి వస్తువు కారణంగా దాని దిశను మార్చుకుని, ఒక్కోసారి ఒక్కో దిశలోకి దూసుకు పోతుంది. కొన్నిసార్లు బలమైన చెట్లను తాకిగా ఇలా జరుగుతుంది. నార్సింగిలోని ఆర్మీ ఫైరింగ్ రేంజ్‌లో ఉన్న రాళ్లు, చెట్లను తాకుతున్న తూటాలు ఇలా తమ దిశ మార్చుకుని సమీపంలోని కాలనీల్లోకి వస్తున్నట్లు పోలీసులు వివరిస్తు న్నారు. గదులు వంటి క్లోజ్డ్ ఏరియాల్లో ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా జరిగితే రికోచెట్ అయిన తూటా ఏ దిశలో, ఎవరికి తగులుతుం దో చెప్పలేని పరిస్థితి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఇలా రికోచెట్ అయిన తూటాలు సమీపంలోని వారి ప్రాణాలు తీసిన ఉదంతాలూ ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఆ విధానాలు మారిన కారణంగానే...

ఈ ఫైరింగ్ రేంజ్‌లకు చుట్టుపక్కల ఉన్న ప్రాం తాలు ఒకప్పుడు గ్రామ పంచాయతీల పరిధిలో ఉండేవి. అప్పట్లో అక్కడ గృహ నిర్మాణాలపై అనేక ఆంక్షలు ఉండేవి. ఆర్మీ అధికారుల నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తప్పనిసరి కావ డంతో పాటు భవనాల ఎత్తుకూ పరిమితులు ఉండేవి. మరోపక్క అప్పట్లో ఫైరింగ్ రేంజ్‌కు వెనుక వైపు నిర్మానుష్య ప్రాంతాలే ఎక్కువ. ఈ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడం, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో భాగమైన తర్వాత పరిస్థి తులు మారియి. ఎన్‌ఓసీతో పని లేకుండానే నిర్మాణాలకు అనుమతులు లభిస్తున్నాయి. వరుస ఉదంతాలు జరుగుతున్నా ఆర్మీ అధికా రులు స్పందిచట్లేదని స్థానికులు ఆరో పిస్తున్నారు. ఏళ్లుగా వినియోగిస్తున్న ఫైరింగ్ రేంజ్ చుట్టూ తూటాలు జనావాసాల్లోకి దూసు కురాకుండా రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ఆర్మీతో పాటు పోలీసు విభాగం సైతం ఇండోర్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేస్తే ఇలాంటి ఇబ్బందులు రావని చెబుతున్నారు.



బైరాగిగూడలో మరోసారి..

బుల్లెట్ తగిలి మహిళ కాలుకు గాయం





బుల్లెట్ తగిలి పద్మ కాలుకు అయిన గాయం

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి బైరాగిగూడ విద్యానగర్ కాలనీలో మంగళ వారం తుపాకీ తూటా కలకలం రేపింది. పద్మ అనే మహిళ కాలును తాకుతూ వెళ్లింది. త్రుటిలో ప్రాణాపాయం నుంచి ఆమె బయట పడింది. బాధితురాలు పద్మ, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో పద్మ తమ ఇంటి ముందు దుస్తులు ఆరేస్తుండగా కాలుకు అకస్మాత్తుగా ఏదో వస్తువు తగిలినట్ల య్యింది. కాలును గీసుకుని వెళ్లి రక్తస్రావమైం ది. ఆ ప్రాంతంలో వెతకగా బుల్లెట్ కనిపించిం ది. కాలికి కాకుండా శరీరం పైభాగంలో అది తగిలి ఉంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లేదని పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వెంటనే నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు బుల్లెట్‌ను స్వాధీనం చేసుకుని బాధితురాలిని గోల్కొండ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఆర్మీ బుల్లెట్‌గా గుర్తింపు..

గంధంగూడకు ఒకవైపు మిలిటరీ, మరోవైపు పోలీస్ ఫైరింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఇటీవల ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తుండటంతో బుల్లెట్లు చుట్టు పక్కల ఉన్న జవావాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంధంగూడలో మహిళకు తగి లిన బుల్లెట్ ఆర్మీదిగా గుర్తించామని, వారికి ప్రజలకు హాని కలిగే పరిస్థితులు వివరిస్తూ నోటీసు పంపుతామని పోలీసులు తెలిపారు. క్లూస్ టీంతో ఆదారాలను సేకిరించామని, తగు చర్యలు తీసుకుంటామన్నారు.

జీఐఎస్ మ్యాపింగ్ కోసం..

క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం

- మెరుగైన పట్టణ ప్రణాళికే లక్ష్యం
- పన్నుల వసూలు సులభతరం



ఉప్పల్‌లో జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సర్వేను ప్రారంభిస్తున్న డీసీ ఆంజనేయులు, ఇతర అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీస్ జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయి ప్రక్రియ ప్రారంభమైంది. మ్యాపింగ్‌కు సంబంధించి ఇప్పటికే శాటిలైట్ సర్వే పూర్తి కాగా.. డ్రోన్ సర్వే జరుగుతోంది. దీంతోపాటు తాజాగా క్షేత్రస్థాయి సర్వే ప్రారంభమైంది. మంగళ వారం ఉప్పల్, హయత్ నగర్, హైదర్ నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో సర్వే ప్రారంభమైందని, మిగతా ప్రాంతాల్లోనూ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు జీహెచ్ ఎంసీ అధికారులు పేర్కొన్నారు. మెరుగైన పట్టణ ప్రణాళిక కోసం చేపట్టిన ఈ సర్వేతో అన్ని ఆస్తులు, యుటిలిటీస్ వివరాలు కచి ్చతంగా మ్యాపింగ్ చేయడం వల్ల వాటిని భౌగోళికంగా సులభంగా గుర్తించవచ్చు. మరోవైపు జీహెచ్‌ఎంసీకి ఆస్తిపన్ను, ట్రేడ్‌లైసెన్స్ తదితర పన్నుల వసూలు కూడా సులభతరం కానుంది. వీటితో పాటు ఆస్తిపన్నుకు సంబంధించి ప్రజలకెదు రవుతున్న సమస్యల పరిష్కారానికీ మ్యాపింగ్ ఉపకరిస్తుందని, ఆన్‌లైన్ చెల్లిం పులు మరింత సులభతరమవుతాయని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. హై రిజల్యూషన్ మ్యాపింగ్ వల్ల రోడ్లు, పార్కులతో పాటు ఇతరత్రా సదుపాయాల వివరాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొంది.

ప్రజలు సహకరించాలి..

వనరుల నిర్వహణ కోసం చేపట్టిన ఈ సర్వేకు ఇంటి యజమానులు సహకరిం చాలని, సర్వే సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలని జీహెచ్‌ఎంసీ కోరింది. సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉం టాయని స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో సర్వే కోసం వచ్చే సిబ్బందికి భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, లేటెస్ట్ గా చెల్లించిన ఆస్తి పన్ను రసీదు, నల్లా బిల్లు, విద్యుత్ బిల్లు, యజమాని ఐడీ వివరాలు, ట్రేడ్ లైసెన్స్ నంబర్ (కమర్షియల్ భవనాల) వివరాలు అందించి సహకరిం చాలని జీహెచ్‌ఎంసీ విజ్ఞప్తి చేసింది.

ప్రతి ఇంటికీ యూనిక్ ఐడీ

సర్వేలో భాగంగా ప్రతి భవనానికి యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయిస్తారు. దీని వల్ల భవిష్యత్‌లో ఏవైనా విపత్తులు, ప్రమా దాలు వంటివి జరిగినప్పుడు సంబంధిత యంత్రాంగం వేగంగా అక్కడికి చేరుకునేం దుకు ఉపకరిస్తుంది. ఈ యూనిక్ నంబర్‌ను వాటర్‌బోర్డు, విద్యుత్ సంస్థలకు అనుసం ధానం చేయనున్నారు. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతాయని భావి స్తున్నారు.

యుటిలిటీస్ సమాచారం సైతం

జీహెచ్‌ఎంసీ పరిధిలోని పార్కులు, నాలాలు, నీటి సరఫరా లైన్లు, మురుగునీటి లైన్లు, ఆట స్థలాలు, రోడ్లు, వీధి దీపాలు, హాస్పిటళ్లు, ఫైర్ సర్వీస్ స్టేషన్లు, విద్యా సంస్థలు, పెట్రోలు బంకులు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, చెరువులు, ఖాళీ స్థలాలు, రైల్వే లైన్లు తదితర భౌగోళిక వివరాలన్నీ మ్యాపింగ్ చేయడం వల్ల వివిధ ప్రభుత్వ విభాగాలు తమ శాఖలకు సంబంధించిన పనులు చేయడం సులభమవుతుంది. అంతేకాదు జీహెచ్‌ఎంసీలోని వార్డులు, సర్కిళ్లు, స్లమ్స్ వివరాలు వంటివి కూడా సరిహద్దులతో సహా రికార్డు కానున్నాయి. తద్వారా ఆయా ప్రభుత్వ పథకాల అమలుకు, ప్రజల భాగస్వామ్యానికి మార్గం సుగమం కానుంది.

జీహెచ్‌ఎంసీకి పెరగనున్న ఆదాయం..

సర్వేతో ప్రతి భవనం విస్తీర్ణం, వినియోగం తదితరమైనవి కచ్చితంగా మ్యాపింగ్ చేస్తారు. ప్రస్తుతం చాలా భవనాల వాస్తవ విస్తీర్ణాలు, ఆస్తిపన్ను చెల్లిస్తున్న విస్తీర్ణాల్లో తేడాలున్నాయి. సర్వే వల్ల సరైన వివరాలు తెలుస్తాయి. తద్వారా జీహెచ్‌ఎంసీకి, ఆస్తిపన్ను, వాటర్‌బోర్డుకు నల్లా బిల్లుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరుగుతుం దని భావిస్తున్నారు.

యూనిఫైడ్ అప్లికేషన్!

భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులకు..

- ప్రతిపాదనలు ఆహ్వానించిన ఎన్ఐయూఎం

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ ద్వారా భవన నిర్మాణ, లే అవుట్ అనుమతులకు ప్రస్తుతమున్న విధానాన్ని అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. అనుమతుల జారీ విధా నంలో మరింత పారదర్శకతతో పాటు వేగంగా అనుమతులు జారీ చేసేందుకు ఈ విధానాన్ని అందుబాటులోకి తేనున్నారు. క్లౌడ్ బేస్డ్‌గా పని చేసే ఈ సిస్టమ్‌ను జీహెచ్‌ఎంసీతో పాటు హెచ్ ఎండీఏ, డీటీసీపీ పరిధిలోని ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ అమలు చేసేందుకు యూనిఫైడ్ అప్లికేషన్ కోసం తగిన డిజైన్, డెవలప్‌మెంట్, ఇతరత్రా పనుల కోసం తగిన నైపుణ్యమున్న ఐటీ, తదితర సం స్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించారు.

సింగిల్ విండో ద్వారా

భవనాలు, లే అవుట్ల అనుమతుల కోసం యూనిఫైడ్ అప్లికేషన్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఇతరత్రా విభాగాల నుంచి అవసరమైన అనుమతులు, సంబంధిత సంస్థల ద్వారా జారీ అయ్యే సదుపాయం ఉంటుంది. కొత్త భవనాల నిర్మాణానికి అనుమతులే కాక అదనపు అంతస్తులు,మార్పుచేర్పులకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. లే అవుట్‌కు సంబంధించి ఓపెన్ ప్లాట్లు, హౌసింగ్, గేటెడ్ కమ్యూనిటీల వంటివాటికి కూడా ఈ సదు పాయం వర్తిస్తుంది. ఫైనల్ లే అవుట్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, తదితరమైనవి జారీ అవుతాయి. ఆయా విభాగాల అనుసంధానంతో ఇతరత్రా విభాగాల నుంచి అవసరమైన ధ్రువీ కరణ, నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ల కోసం ఆయా కార్యాలయాలకు వెళ్ల నవసరం ఉండదు. సింగిల్ విండోతోనే పనులు జరుగుతాయి. అనుమతుల కోసం చెల్లించాల్సిన ఫీజుల్ని సైతం ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు. డెబిట్, క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ తదిత రాలతో ఫీజు చెల్లించవచ్చు.

యాక్ట్స్, రూల్స్ అనుకనుగుణంగా..

టీజీ బీపాస్ (2020యాక్ట్), తెలంగాణ బిల్డింగ్ రూల్స్-2012తో పాటు ఇప్పటి వరకు ఆయా రూల్స్, చట్టాలకు జరిగిన అమెండ్ మెంట్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకొని ఈ కొత్త విధానం ద్వారా అనుమతులు జారీ చేయనున్నారు. యూనిఫైడ్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ తదితరమైన వాటి కోసం మున్సిపల్ పరిపాలన శాఖకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐ యూఎం) ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్) ఆహ్వానించింది. ఎంపికయ్యే సంస్థ మూడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

అపార్టుమెంట్‌లో భారీ చోరీ

40 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ



విరిగిపోయిన ఇంటి తలుపు గడియ, క్లూస్‌టీం వివరాల సేకరణ



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదు రుగా ఉన్న ఓ అపార్టుమెంట్‌లో దొంగలు పడ్డారు. సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లిన ఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరి ధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ భోలక్‌పూర్ కృష్ణానగర్ కాలనీలోని భవానీ శ్రీ షీలా ఎవెన్యూ అపార్టుమెం ట్ 3వ అంతస్తులోని 303 ఫ్లాట్‌లో మాదాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉద్యోగి శ్రీనివాస్, ఆయన భార్య సబిత, ఇంజినీరింగ్ చదువుతున్న కుమార్తె అనుష్కతో కలిసి నివసిస్తున్నారు. మంగళవారం ఇంటికి తాళం వేసి సబిత బయటకు వెళ్లారు. కుమార్తె కాలేజీకి, శ్రీనివాస్ బ్యాంక్‌కు వెళ్లారు. మధ్యాహ్నం వేళ గుర్తు తెలియని దొంగలు అపార్టు మెంట్ మూడో అంతస్తులోకి ప్రవేశించారు. తాళం వేసిన గడియ కింది భాగాన్ని తొలగించి ఇంట్లోకి వెళ్లారు. అల్మరా, ఇతరత్రా ప్రదేశాల్లో దాచి ఉంచిన 14 తులాల బంగారం, రూ.లక్ష నగదును దొం గిలించారు. శ్రీనివాస్ కుమార్తె అనుష్క సాయం త్రం కాలేజీ నుంచి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో సామాన్లు చిందరవం దరగా పడి ఉండటం గమనించి పోలీసులకు సమా చారం ఇవ్వగా గాంధీనగర్ డివిజన్ ఏసీపీ మొగు లయ్య, ఇన్‌స్పెక్టర్ డి.రాజు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటా రనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎయిర్‌పోర్టులో ట్యాక్సీ డ్రైవర్ల ఆందోళన


ట్యాక్సీ స్టాండ్‌లో నిలిచిపోయిన వాహనాలు

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం సాయంత్రం నుంచి తెలంగాణ రాష్ట్ర ట్యాక్సీ డ్రైవర్ల ఆందోళన కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలు ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్‌లతో ప్రతిరోజు వ్యాపారం చేస్తున్నాయని, దీంతో తమకు ఉపాధి దొరకడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలు అనధికారికంగా నడుస్తున్నా పోలీసులు, జీఎంఆర్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ప్రశ్నించారు. దీనిపై ఆర్‌జీఐఏ పోలీసులు, జీఎంఆర్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. కాగా ట్యాక్సీలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నార్సింగి డ్రగ్స్ కేసులో వీఐపీలు!

- మరో 30 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు గుర్తించిన పోలీసులు
- హైదరాబాద్, బెంగళూరుకు చెందిన ఐటీ, వ్యాపార ప్రతినిధులే..
- నోటీసులు ఇచ్చి విచారించేందుకు పోలీసుల సన్నాహాలు
- ఇప్పటికే ఈ కేసులో ఐదుగురు పెడ్లర్లు అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: నార్సింగి డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నైజీరియా డ్రగ్ పెడ్లర్ల నుంచి మరో 30 మంది ప్రముఖులు డ్రగ్స్ తీసుకొని వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఆఫ్రికా దేశాల నుంచి మాదక ద్రవ్యాలను గోవా, ముంబై, ఢిల్లీ మీదుగా డ్రగ్స్ తరలించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ముఠాను నార్సింగి, తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీజీ న్యాబ్) పోలీసులు ఈనెల 16న పట్టుకున్న సంగతి తెలిసిందే. నిందితుల నుంచి రూ.కోట్లు విలువ చేసే 199 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు నైజీరియన్ పెడ్లర్లు అనోహా బ్లెస్సింగ్, అజీజ్ నోహిమ్ అడేషోలాలతో పాటు బెంగళూరుకు చెందిన అల్లం సత్యవెంకట గౌతమ్, బోరబండకు చెందిన సానబోయిన వరుణ్ కుమార్, కొరియోగ్రాఫర్ మహ్మద్ మహబూబ్ షరీఫ్‌లను అరెస్టు చేశారు.

సెల్‌ఫోన్లలో డేటాతో..

అరెస్టు సమయంలో నిందితుల సెల్‌ఫోన్లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులోని వాట్సాప్ చాట్స్, సందేశాలు, బ్యాంకు లావాదేవీలను పోలీసులు విశ్లేషించారు. దీంతో మరో 30 మంది వీఐపీల పేర్లు బయటికి వచ్చాయి. వీరంతా హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందిన ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారస్తులుగా గుర్తించారు. దీంతో వీరందరికీ నోటీసులు ఇచ్చి, విచారించేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.

అమన్‌తో సహా మరో 20 మంది..

డ్రగ్ పెడ్లర్ల నుంచి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన మరో 20 మంది మాదక ద్రవ్యాలు కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు పోలీసులు గతంలోనే గుర్తించారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఐదుగురికి డ్రగ్స్ సేవించినట్లు పాజిటివ్ వచ్చింది. దీంతో నిందితులను రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్‌తో పాటు ఫిల్మ్‌నగర్‌కు చెందిన కిషన్ రాతీ, బంజారాహిల్స్‌కు చెందిన అని, గచ్చిబౌలికి చెందిన ఆలుగడ్డల రోహిత్, గండిపేటకు చెందిన శ్రీచరణ్, బంజారాహిల్స్‌కు చెందిన ప్రసాద్, ఫిల్మ్‌నగర్‌కు చెందిన హృతిక్ కుమార్, పంజగుట్టకు చెందిన నిఖిల్ దావన్, గచ్చిబౌలికి చెందిన మధురాజు, రఘు, కనుమూరి కృష్ణంరాజు, వెంకట సత్యనారాయణ డ్రగ్స్ వినియోగిస్తున్నవారిలో ఉన్నారు. నైజీరియా నుంచి డ్రగ్స్‌ను సరఫరా చేసిన ప్రధాన సూత్రధారులు ఎబుకా సుజీ, ఫ్రాంక్లిన్‌లు ఇంకా పరారీలోనే ఉన్నారు.

బండ్లగూడ నుంచే చెల్లింపులు..

డ్రగ్స్ కింగ్‌పిన్ ఎబుకా సుజీ నుంచి బ్లెస్సింగ్‌కు డ్రగ్స్ సరఫరా జరుగుతుంది. ఈమె విమానాలు, రైళ్లు, బస్సుల్లో ప్రయాణం చేస్తూ హైదరాబాద్‌కు డ్రగ్స్‌ను రవాణా చేస్తోంది. ఇప్పటివరకు బ్లెస్సింగ్ 20 సార్లు నగరానికి మాదక ద్రవ్యాలను తీసుకొచ్చింది. ఈమె నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి గౌతమ్ అనే డ్రగ్ పెడ్లర్ వీటిని ఏపీలో రాజమహేంద్రవరం, ప్రకాశం జిల్లాల్లో వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. ఇందుకుగాను గౌతమ్‌కు నైజీరియన్ నుంచి 9 నెలల్లో రూ.10 లక్షల కమీషన్ అందిందని, బండ్లగూడలోని లుంబినీ కమ్యూనికేషన్స్ ద్వారా నగదు చెల్లింపులు జరిగినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు.

గొప్ప సాహితీవేత్త సినారె


సినారెకు నివాళులర్పిస్తున్న రమణ తదితరులు

చిక్కడపల్లి: ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి గొప్ప సాహితీవేత్త అని ప్రముఖ రచయిత రమణ వెలమకన్ని అన్నారు. మంగళవారం రాత్రి త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో నిర్వహించిన సినారె జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినారె ఆధునిక సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. విశ్వంభర కావ్యం కథా వస్తువు మానవుడని, ఆదిమ మానవుడు..ఆధునిక మానవుడిగా మారిన పరిణామ క్రమాన్ని చాలా చక్కగా వివరించారని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ సినారెకు గాన సభతో మంచి అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు నైషధం సత్యనారాయణ మూర్తి, అపర్ణ, గరిమెళ్ల సీత, శ్రీమణి పాల్గొన్నారు.

స్నేహం ముసుగులో లైంగిక దాడి

మిత్రుడితో కలిసి యువతిపై అఘాయిత్యం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: తనను నమ్మి వచ్చిన చిన్ననాటి స్నేహితురాలికి మద్యం తాగించి.. స్నేహితుడితో కలిసి లైంగిక దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసీపీ పి.కాశిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, గౌతంరెడ్డి అనే యువకుడు పాఠశాల స్నేహితులు. యువతికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో పార్టీ చేసుకునేందుకు సోమవారం రాత్రి 7.30కు వీరిద్దరూ కలిసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంకార్ నగర్ కాలనీలోని బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ ఇద్దరూ మద్యం తాగారు. ఆ తర్వాత ఇదే రెస్టారెంట్‌లో గౌతంరెడ్డి గది అద్దెకు తీసుకుని యువతిని తీసుకెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడిని కూడా గదికి పిలిచాడు. ఇద్దరు కలిసి యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మద్యం మత్తు నుంచి తేరుకున్న యువతి గదిలో గౌతంరెడ్డి తో పాటు మరో వ్యక్తి ఉండడంతో తనపై లైంగిక దాడి జరిగిందన్న విషయాన్ని గమనించి గట్టిగా కేకలు వేసింది. దీంతో కంగారు చెందిన ఇద్దరు యువకులు అక్కడ నుంచి పారిపోయారు. బాధితురాలు విషయాన్ని రెస్టారెంట్ సిబ్బంది దృష్టి తీసుకెళ్లగా వారు ఆమె స్నేహితులకు సమాచారం అందించారు. వెంటనే యువతి స్నేహితులు రెస్టారెంట్‌కు వచ్చి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు గౌతంరెడ్డిని అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఏసీపీ కాశిరెడ్డి వెల్లడించారు.

స్నాచర్‌ను పట్టించిన ‘రెడీ టు రేస్’ స్టిక్కర్..

- ఐదు రోజుల పాటు సీసీ ఫుటేజీలు, బైక్ నెంబర్ల వడబోత..
- ఎట్టకేలకు చిక్కిన స్నాచర్లు..

బంజారాహిల్స్: స్నాచింగ్ చేసే క్రమంలో పోలీసులకు చిక్కకుండా బైక్ నెంబర్ కనిపించకుండా నెంబర్ ప్లేట్‌పై కాగితం అంటించి మొబైల్ స్నాచింగ్‌కు పాల్పడిన యువకుడిని ఆ బైక్ వెనుక ఉన్న ఓ స్టిక్కర్ పట్టించింది. జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు ఐదు రోజుల పాటు శ్రమించి వందలాది సీసీ కెమెరాలను పరిశీలించి, వందల్లో బైక్ నెంబర్లను వడబోసి ఎట్టకేలకు మొబైల్ స్నాచర్లను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్‌లో నివసించే రామకృష్ణ అనే వ్యక్తి ఈ నెల 24న రాత్రి 8 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని మెట్రో స్టేషన్ కింద తన భార్య కోసం వేచిచూస్తూ ఫోన్ మాట్లాడుతున్నాడు. అదే సమయంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ఇద్దరు యువకులు రామకృష్ణ చేతిలోని సెల్‌ఫోన్ లాక్కొని, గట్టిగా వెనక్కి నెట్టేసి పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇక్కడి నుంచి సీసీ కెమెరాలను యూసుఫ్‌గూడ, ఎస్ఆర్‌నగర్ వరకు వందల్లో వడపోయగా, నెంబర్ ప్లేట్‌పై నెంబర్లు కనిపించకుండా స్టిక్కర్ అంటించిన బైక్ కనిపించింది. సిరీస్ మాత్రమే కనిపించడంతో ఈ సిరీస్‌పై ఎన్ని బైక్‌లు ఉన్నాయో వివరాలు ఇవ్వాల్సిందిగా ఆర్టీఏకు లేఖ రాశారు. దీంతో ఆ సిరీస్‌పై 957 బైక్‌లు ఉన్నాయని, వాటి వివరాలను పోలీసులకు ఇచ్చారు. అందులో స్నాచర్‌కు చెందిన బైక్‌ను పట్టుకునేందుకు ఇంకో రెండు రోజులు శ్రమించారు. ఓ కేటీఎం బైక్ వెనుక ‘రెడీ టు రేస్’ అనే స్టిక్కర్ అంటించి ఉండగా అంతకు మూడు రోజుల ముందే ట్రాఫిక్ చలానా పడినట్లు తేలింది. ఆ నెంబర్‌తో బైక్ నెంబర్‌ను ట్రేస్ చేయడమే కాకుండా స్నాచర్ మొబైల్ నెంబర్ కూడా పట్టుబడింది. ఆ నెంబర్ ఆధారంగా బేగంపేటలో ఉంటున్న స్నాచర్ కుర్రా కిరణ్‌కుమార్ (19)ని అదుపులోకి తీసుకుని విచారించగా టీఎస్08 జీడీ 1803 నెంబర్ బైక్‌పై తన స్నేహితుడితో వచ్చి స్నాచింగ్ చేసినట్లుగా వెల్లడించారు. తనతో పాటే ఎస్ఆర్‌నగర్‌లోని రాయల్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న 17 ఏళ్ల సహ విద్యార్థితో జల్సాలకు అలవాటు పడి..ఇలా అడ్డదారుల్లో ఈజీ మనీ కోసం రోడ్డెక్కినట్లుగా గుర్తించారు. వ్యసనాలకు అలవాటుపడ్డ ఈ ఇద్దరూ సెల్‌ఫోన్ దొంగిలించి అమ్ముకుని తమ సరదాలు తీర్చుకోవాలని ఈ స్నాచింగ్‌లకు పాల్పడినట్లుగా తేలింది. పోలీసులు బైక్‌ను సీజ్ చేశారు. కిరణ్‌కుమార్‌ను జైలుకు పంపించారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. మొత్తానికి ఐదు రోజుల పాటు సీసీ ఫుటేజీలను, బైక్‌లను వడపోసి నిందితులను పట్టుకోవడంలో టెక్నాలజీని ఉపయోగించుకున్న క్రైమ్ పోలీసులను ఉన్నతాధికారులు ప్రశంసించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న స్నాచర్ బైక్

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

లక్డీకాపూల్: నగరంలో చెత్త కనిపించకుండా పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అదనపు, జోనల్ కమిషనర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శానిటేషన్, స్వచ్ఛ ఆటో హాజరు శాతం మెరుగు పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సహాయ వైద్యాధికారులతో పాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్లు తమకు నిర్దేశించిన సమయంలో ఉదయం పూట తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని సూచించారు. చెత్త, గ్రీన్ వేస్ట్, (సీఅండ్‌డీ) భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాల్సిన బాధ్యత డీసీలు, సహాయ వైద్యాధికారులదేనన్నారు. జోనల్ కమిషనర్లు కూడా ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సీఆర్‌ఎంపీ రోడ్లపై పాట్ హోల్స్, రోడ్డు మరమ్మతులు, రోడ్డుపై మార్కింగ్ లైనింగ్, ఫుట్‌పాత్ మీడియంలో మొక్కలు నాటేందుకు సంబంధించిన ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా గ్యాప్‌లను పూర్తి చేయించాలని జోనల్ కమిషనర్లను ఆమ్రపాలి ఆదేశించారు.

మరో 10 నిమిషాలైతే చెక్కేసే వాడే..

- సోషల్ మీడియాలో యువతితో పరిచయం..
- ప్రేమ పేరుతో మోసగించి..నగరానికి రప్పించి లైంగిక దాడి
- ఆపై..ఆస్ట్రేలియా పారిపోయేందుకు యత్నం
- చివరి నిమిషంలో ఎయిర్‌పోర్టులో పట్టుకున్న మహంకాళి పోలీసులు

రాంగోపాల్‌పేట్: సోషల్ మీడియాలో ఓ యువతిని పరిచయం చేసుకుని..ప్రేమ, పెళ్లి అంటూ మాయమాటలతో లోబర్చుకుని.. లైంగిక దాడికి పాల్పడి..ఆస్ట్రేలియా పారిపోయేందుకు యత్నించిన ఓ యువకుడిని మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. 10 నిమిషాల్లో విమానం ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న నిందితుడిని చాకచక్యంగా అరెస్టు చేశారు. ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా గంగాపూర్ గ్రామానికి చెందిన బండారం స్వామి (29) బీఎస్సీ పౌల్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసి పంజాబ్, రాయ్‌పూర్‌లలోని పౌల్ట్రీ పరిశ్రమలో ఉన్నత ఉద్యోగాలు చేశాడు. గత కొద్ది నెలల క్రితం ఆస్ట్రేలియాలో ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. అక్కడికి వెళ్లాక ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు చెందిన ఓ రెస్టారెంట్‌లో పనిచేసే 27 ఏళ్ల యువతితో స్నేహం చేశాడు. ఇలా ఇద్దరూ ఒకరికొకరు సామాజిక మాధ్యమాల ద్వారా మాట్లాడుకుంటూ ఉన్నారు. ఆ యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలుకుతూ వచ్చాడు.

నగరానికి రప్పించి..

ఇదిలా ఉండగా..స్వామి తండ్రి గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో తండ్రిని చూసేందుకు జూన్ 26వ తేదీన ఇండియాకు తిరిగి వచ్చాడు. ఆ సమయంలో రాయ్‌పూర్‌లోని యువతికి ఫోన్ చేసి..పెళ్లి చేసికుంటానని, హైదరాబాద్ వస్తే తన తల్లిదండ్రుల వద్దకు తీసుకుని వెళతానని స్వామి నమ్మబలికాడు. దీంతో ఈ నెల 2వ తేదీన ఆ యువతి రాయ్‌పూర్ నుంచి బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరింది. 3వ తేదీ ఉదయం 11 గంటలకు బోయిన్‌పల్లిలో బస్సు దిగి ఉండగా..తన ద్విచక్ర వాహనంపై వెళ్లి రిసీవ్ చేసుకుని..అంతకు ముందే పార్క్‌లేన్‌లోని ఓ హోటల్ 4వ అంతస్తులో బుక్ చేసిన హోటల్ గదికి ఆమెను తీసుకెళ్లాడు. కొద్దిసేపటికి స్వామి ఆ యువతికి కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. రెండు రోజుల పాటు హోటల్‌లోనే ఉంచి..తన తల్లిదండ్రులు ఊరు వెళ్లారని, 10 రోజుల తర్వాత వస్తానని నమ్మించి 5వ తేదీన మళ్లీ ఆ యువతిని రాయ్‌పూర్ పంపించాడు. ఆ తర్వాత యువతి ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో పాటు తనకు ఫోన్ చేయవద్దని, పెళ్లి లాంటివి ఏమి లేవని చెప్పాడు. దీంతో ఆ యువతి స్థానిక ఎస్పీని సంప్రదించగా ఆయన రాయ్‌పూర్‌లోని విధానసభ పోలీసులకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించాడు. యువతితో పాటు హైదరాబాద్ చేరుకున్న అక్కడి పోలీసుల సమాచారం మేరకు 29వ తేదీన సాయంత్రం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్ఐలు జాన్ పరదేశి, వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుడి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆధారంగా పాస్‌పోర్టు తదితర వివరాలు సేకరించారు.

10 నిమిషాల్లో ఎగిరిపోయేందుకు సిద్ధం..

నిందితుడు స్వామి సోమవారం రాత్రి 9.30 నిమిషాలకు శ్రీలంక మీదుగా ఆస్ట్రేలియా వెళ్లిపోతున్నాడన్న సమాచారం మహంకాళి పోలీసులకు 8 గంటలకు తెలిసింది. వెంటనే పోలీసులు ఎయిర్‌పోర్టులోని సీఐఎస్ఎఫ్, శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు చేరవేశారు. నిందితుడు 5 గంటలకే ఎయిర్‌పోర్టు చేరుకుని చెక్ ఇన్, ఇమిగ్రేషన్ పూర్తి చేసుకుని లాంజ్‌లో వేచిచూస్తున్నాడు. ఇంకో పది నిమిషాల్లో విమానం ఎగిరిపోతుందనే సమయానికి హుటాహుటిన లోపలికి వెళ్లిన పోలీసులు..నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను రక్షించండి



అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారం, కొత్తగూడెం, పిగ్లీపూర్ గ్రామాల్లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములతో పాటు లే అవుట్లలో ప్రజావసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలు, ఖాళీ స్థలాలను ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ పలువురు నాయకులు, గ్రామస్తులు మంగళవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మూడు గ్రామాల పరిధిలోని ఆయా భూములను కాజేయడానికి కొత్తగూడెం గ్రామానికి చెందిన నార్లకొండ వెంకటేశ్ మరి కొంతమందితో ముఠాగా ఏర్పడి ఆక్రమించుకుంటున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఆ ముఠా సభ్యులు రూ.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ, ప్రజా భూములు ఆక్రమించారని ఆరోపించారు. ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విలువైన భూములను కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, పాపయ్యగౌడ్, గడ్డం కుమార్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు ఉన్నారు.

పట్టాలు దాటుతూ వ్యక్తి మృతి

సికింద్రాబాద్: ప్లాట్‌ఫామ్ మారేందుకు పట్టాలు దాటే ప్రయత్నంలో రైలు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... నిజామాబాద్ అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన ఎస్.వెంకటరమణ (45) ప్రైవేటు ఉద్యోగి. సోమవారం రాత్రి నిజామాబాద్ వెళ్లేందుకు వెంకటరమణ సికింద్రాబాద్ చేరుకున్నాడు. 8వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తను వెళ్లాల్సిన రైలు కోసం వేచి చూస్తున్నాడు. నిజామాబాద్ రైలు 9వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వస్తుందని అనౌన్స్‌మెంట్ రావడంతో పట్టాలు దాటుకుని అవతలి ప్లాట్‌ఫామ్ వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంతలో 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చిన తుంగభద్ర రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటరమణను రైల్వే పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. కొద్ది గంటలపాటు చికిత్స పొందిన ఆయన మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

బ్యాంకును మోసగించిన కేసులో కాంగ్రెస్ నేత అరెస్టు

- శంషాబాద్‌లోని ఇద్దరు ఇండస్‌ఇండ్ బ్యాంక్ మేనేజర్లు కూడా..
- ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఖాతా నుంచి రూ.40 కోట్లు బదిలీ
- ఖాతాదారునికి తెలియకుండా అనధికారికంగా లావాదేవీలు
- ముగ్గుర్ని అరెస్టు చేసిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు


నిందితుడు బషీద్

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంక్ ఖాతాదారునికి తెలియకుండా రూ.40 కోట్లు కాజేసిన కేసులో ఇద్దరు బ్యాంక్ మేనేజర్లతో సహ కాంగ్రెస్ నాయకుడు షేక్ బషీద్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. బషీద్ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తరుపున రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశాడని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) డీసీపీ కె.ప్రసాద్ తెలిపారు. కేసు పూర్తి వివరాలివీ..ముంబైలోని నారిమన్ పాయింట్‌లోని ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థకు ఖాతా ఉంది. బ్యాంక్ అంతర్గత ఆడిట్‌లో భాగంగా జులై 12న ఈ ఖాతా నుంచి శంషాబాద్‌లోని ఇండస్‌ఇండ్ బ్యాంకుకు రూ.15 కోట్లు, రూ.25 కోట్లు చొప్పున రెండు విడతల్లో రూ.40 కోట్ల నగదు బదిలీ అయినట్లు బ్యాంక్ అధికారులు గుర్తించారు. ముంబైలోని ప్రధాన కార్యాలయం అనుమతి లేకుండా అనధికారికంగా ఈ నగదు బదిలీ జరిగినట్లు తేలడంతో జోనల్ హెడ్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ జోనల్ హెడ్ (ఆపరేషన్స్) మణికందన్ రామనాథన్ జులై 19న సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బహుమతిగా ఫార్చ్యూనర్ కార్లు..

కొట్టేసిన సొమ్ముతో బషీద్ రెండు టయోటా ఫార్చ్యూనర్ కార్లను కొనుగోలు చేశాడు. వీటిలో ఒకటి బ్యాంక్ మేనేజర్ రామస్వామికి బహుమతిగా అందించాడు. ఆ తర్వాత మిగిలిన సొమ్ముతో బషీద్ ఢిల్లీకి పరారయ్యాడు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితులు రామస్వామి, రాజేష్‌లను హైదరాబాద్‌లో, బషీద్‌ను ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అరెస్టయిన ఏ-3 బషీద్‌పై గతంలో హైదరాబాద్ కమిషనరేట్‌లోని సీసీఎస్‌లో, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, బోయిన్‌పల్లి పీఎస్‌లతో పాటు సైబరాబాద్‌లోని నార్సింగి, వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట్ ఠాణాలలో పదికి పైగా చీటింగ్ కేసులున్నాయి. బషీద్ పలు సినిమాలను నిర్మించడంతో పాటు నటించాడు కూడా.

బ్యాంక్ మేనేజర్ల పనే..

శంషాబాద్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంక్ మేనేజర్ కనుగుల రామస్వామి, సర్వీస్ డెలివరీ మేనేజర్ సపాయి రాజేశ్ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులు. ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ ఖాతాలో రూ.కోట్లలో జరుగుతున్న లావాదేవీలను గుర్తించిన ఇరువురు నిందితులు పక్కా పథకం వేశారు. జులై నెలలో జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారి షేక్ బషీద్ పేరుతో బ్యాంక్ అకౌంట్‌ను తెరిచారు. ఈ ఖాతాకు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ చెక్, ఆర్టీజీఎస్ లేకుండా అనధికారికంగా రూ.40 కోట్ల నగదును బదిలీ చేశారు. క్షణాల్లోనే ఈ అకౌంట్ నుంచి జాతీయ, ప్రైవేట్ బ్యాంక్‌ల్లోని 20 వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. ఈ సొమ్ములో కొంత మొత్తాన్ని వేర్వేరు ఏటీఎంల నుంచి విత్ డ్రా చేశారు.

అవినీతి వ్యతిరేక పోరాటంలో భాగస్వామినవుతా

ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్ మహిళా విభాగం అధ్యక్షురాలు దీపాదేవి


చింతలూరి దీపాదేవిగౌడ

బంజారాహిల్స్: ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ బస్తీకి చెందిన చింతలూరి దీపాదేవిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు ఆమెకు నియామక పత్రంతో పాటు గుర్తింపు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా దీపాదేవి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా సంస్థ చేస్తున్న పోరాటాల్లో తాను కూడా భాగస్వామినవుతానని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరులకు అన్యాయం జరిగితే, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఈ సంస్థ తరుపున పోరాటం చేస్తామని వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన సంస్థ ప్రతినిధులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా యువకుడిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌లో నివాసం ఉండే శైలేష్ కుమార్‌సింగ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 28న బోనాల వేడుకల్లో పాల్గొనడానికి లోకేశ్వర్ కుటుంబంతో కలసి నారాయణగూడ వెళ్ళి అర్ధరాత్రి తిరిగి వెంగళరావునగర్ వచ్చాడు. ఈ క్రమంలో కారును పార్క్ చేసి ఇంటికి వెళుతుండగా అదే కాలనీకి చెందిన ఉమేష్, వివేక్‌లు శైలేష్‌కుమార్‌ను దుర్భాషలాడుతూ దాడి చేశారు. లోకేష్ కుటుంబ సభ్యులు విడదీయడానికి ప్రయత్నించినా వినలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ ఆర్‌టీఆర్160



లక్డీకాపూల్ : నగర మార్కెట్‌లోకి టీవీఎస్ సరికొత్త బైక్‌ను విడుదల చేసింది. సోమాజీగూడలోని అంజలి టీవీఎస్ షోరూమ్‌లో అపాచీ ఆర్‌టీఆర్ 160 బైక్‌ను షోరూమ్ ఏఎస్ఎం సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడికి | సమాయత్తం!

• యూపీహెచ్‌సీ పరిధిలో మొదలైన జ్వర సర్వే • వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రులకు తరలింపు

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలతో అప్రమత్తం
- పీహెచ్‌సీల పరిధిలో జ్వరపీడితుల వివరాలు నమోదు


బంజారాహిల్స్‌లో ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బంజారాహిల్స్: వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమాయత్తమయ్యారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో ఇంటింటా జ్వర సర్వే ముమ్మరంగా జరుగుతుంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షౌకత్‌నగర్, శ్రీరామ్‌నగర్, వినాయకనగర్, బోరబండ, పంజగుట్ట, సోమాజీగూడ, ఖైరతాబాద్ యూపీహెచ్‌సీల పరిధిలో ఉన్న 33 బస్తీ దవాఖానాల పరిధిలో గత కొద్ది రోజుల నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే చేపడుతున్నారు. తాజాగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యాధికారులకు జారీ చేసిన ఆదేశాలతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లోని పీహెచ్‌సీల వైద్యులు అప్రమత్తమయ్యారు. ఈ సర్వేలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు భాగస్వాములు అవుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పిస్తున్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 50 ఇళ్లల్లో నివసించే వారి ఆరోగ్య వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు.

జ్వర లక్షణాలు ఇలా..

జ్వరం, ఒంటి నొప్పులు, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నాయా..? లేదా..? అని ఇంటింటికీ వెళ్లి సంబంధిత వైద్య సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఒకవేళ జ్వర లక్షణాలు ఉంటే ఎన్ని రోజుల నుంచి జ్వరం వస్తుంది..మందులు తీసుకున్నా సరే జ్వరం అలాగే ఉంటుందా..? అనే వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఏ సమయంలో జ్వర తీవ్రత ఎక్కువ ఉండి, ఆ సమయంలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి..? అనే వివరాలను కూడా సేకరిస్తున్నారు. గతంలో కొవిడ్ సమయంలో మూడు విడతల్లో ఇంటింటా జ్వర సర్వే చేపట్టారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లో 1.45 లక్షల మంది ఆరోగ్య వివరాలను సేకరించడమే కాకుండా అవసరమైన వారికి తగిన మందులు కూడా ఇచ్చారు. దీని ద్వారా జ్వరం బారిన పడిన వారు ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లకుండానే కోలుకున్నారు. అయితే గత ఏప్రిల్ నుంచి ఈసారి వాతావరణ మార్పులు భిన్నంగా ఉన్నాయి. ప్రతియేటా ఆగస్టు నుంచి డెంగీ కేసులు నమోదు కాగా ఈసారి జనవరి నుంచే ఈ వ్యాధి పంజా విసురుతోంది. ప్రతి బస్తీ దవాఖానా పరిధిలోనూ డెంగీ కేసులు నమోదవుతుండడం పట్ల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ సర్వేను మరింత పారదర్శకంగా చేపట్టారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు సంక్రమిస్తే వాటిని నమోదు చేసుకోవడమే కాకుండా వారిని ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఆ చుట్టుపక్కల 300 ఇళ్లను సర్వే చేయడమే కాకుండా జీహెచ్ఎంసీకి సమాచారం ఇవ్వడం ద్వారా అక్కడ దోమల నివారణకు జీహెచ్ఎంసీ చర్యలు చేపడుతుంది. ప్రజారోగ్యానికి ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలుపుతున్నారు.





కలెక్టరేట్ ముట్టడికి తరలిన ఓబీసీ మోర్చా నేతలు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీజేపీ ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దుంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు వల్లెపు శంకర్, మంజలి నరసింహ, సీతల అనిల్‌కుమార్ తదితరులు ముట్టడి కార్యక్రమంలో పాల్గొని బీసీల సంక్షేమ కార్యక్రమాల అమలుకు వెంటనే నిధులు మంజూరు చేయాలనని డిమాండ్ చేశారు.

పార్కులో కనీస వసతులు కల్పించాలని నిరసన

వెంగళరావునగర్: కృష్ణకాంత్ పార్కులో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం సీనియర్ నాయకులు సి.హెచ్.చంద్రశేఖర్ రావు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కును మంగళవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం పార్కు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ట్రాక్ పూర్తిగా అధ్వానంగా ఉందని, బాత్రూంలు సరిగ్గా లేవని, కనీసం నీటి వసతి కూడా లేదని, బెంచీలు, కుర్చీలు కూడా విరిగిపోయి ఉన్నాయని అన్నారు. తక్షణమే వాటికి మరమ్మతులు నిర్వహించి బాత్రూంలు శుభ్రం చేసి ఉపయోగంలోనికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, నాయకులు ఎం.రవీంద్రబాబు, వై.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలి

ఖైరతాబాద్: ఆయుష్ విభాగంలో బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని, జీవో 80ని అమలు చేయడం లేదని అఖిల భారత షెడ్యూల్డ్ కులాల, హక్కుల తెగల పరిరక్షణ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ప్రధాన కార్యదర్శి రాసూరి చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు. బదిలీలపై నాలుగు సంవత్సరాలు దాటిన వారిని పరిగణలోకి తీసుకోవాల్సి ఉన్నా, ఒక సంవత్సరం సర్వీసు చేసిన వారిని బదిలీ చేస్తున్నారన్నారు. 20 సంవత్సరాలు ఒకే దగ్గర పని చేసే వాళ్లను అక్కడే ఉంచడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ విషయంపై ఆయూష్ డైరెక్టర్‌తో పాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శికి వినతి పత్రాలు అందించామని తెలిపారు.

సెల్‌ఫోన్ పోతే ఫిర్యాదు చేయాలి

పంజగుట్ట: సెల్‌ఫోన్ పోయినా, స్నాచింగ్‌కు గురైనా వెంటనే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చెయ్యాలని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 వేల చైన్‌పోతే ఫిర్యాదు చేస్తారు కానీ 90 వేల ఫోన్ పోతే చాలా మంది ఫిర్యాదు చెయ్యరని ఆయన అన్నారు. పోయిన ఫోన్ దేశవిద్రోహ శక్తులకో, సైబర్ నేరస్తుల చేతికి వెళితే అమాయక ప్రజలు విచారణ పేరుతో ఇబ్బందులు పడాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మీవద్ద ఆధారం ఉంటుందన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి

పంజగుట్ట: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవించంద్ర అధ్యక్షతన ఈ నెల 14, 29వ తేదీల్లో సమావేశమైన సంఘం సభ్యులు అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఆది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షనీయమన్నారు.

ఐక్యంగా పనిచేస్తేనే రాజ్యాధికారం

బీసీ సాధికారిక సంఘం అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాని రామకృష్ణగౌడ్

ఫిలింనగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలనాటికి రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలంతా ఐక్యంగా పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సాధికారిక సంఘం అధ్యక్షులు ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఆయన 133 కులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చినప్పుడు హక్కులు సాధ్యమవుతాయని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో బీసీ ఎమ్మెల్యేలను గెలిపించుకోవాలని అన్నారు. నియోజక వర్గాలు, మండలాలు, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి బీసీలను బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీవీఆర్ భాస్కర్‌రావు, కులసంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు మహేందర్, చంద్రశేఖర్, కోల శ్రీనివాస్, రాచమల్లు, అయ్యావుల రాములు, వీరాంజనేయులు, కాసారం రమేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యపై 'ఎక్స్'లో హీరో రాజశేఖర్ ఫిర్యాదు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–70లోని అశ్విని లేఅవుట్‌లో కొంతకాలంగా డ్రైనేజీ లీకుకావడంతో దుర్వాసన, దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలంటూ సినీ హీరో రాజశేఖర్ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ×ఎక్స్₹లో ట్వీట్ చేశారు. ఈ సమస్య తీవ్రంగా ఉందని, తాను ఫిర్యాదు చేసిన తరువాత కూడా ఇంతవరకు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. మేయర్‌కు కూడా ఫిర్యాదును ట్యాగ్ చేశారు. అయితే డ్రైనేజీ లీకేజీ సమస్య జలమండలి పరిష్కరిస్తుందన్న విషయాన్ని రాజశేఖర్ తెలియక పోవడంతో ఆయన జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది. కనీసం జలమండలి అధికారులైనా రాజశేఖర్ చేసిన ఫిర్యాదును పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సినీహీరో రాజశేఖర్ చేసిన ట్వీట్

కండక్టర్‌పై దాడి

పంజగుట్ట: ఫుట్‌బోర్డుపై ఉండకుండా బస్సు లోపలకు రావాలి అన్నందుకు కండక్టర్‌పై విద్యార్థులు దాడి చేసిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వెళుతుంది. ఈ క్రమంలో ఎస్సార్‌నగర్ వద్ద కొంతమంది విద్యార్థులు బస్సు ఎక్కి ఫుట్‌బోర్డుపైనే ఉండడంతో కండక్టర్ శ్రీనివాస్ బస్సులోపలకు రావాలని సూచించాడు. దీంతో విద్యార్థులు కండక్టర్ శ్రీనివాస్‌పై దాడి చేసి పారిపోయారు. కండక్టర్ శ్రీనివాస్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనీలాండరింగ్ పేరుతో ప్రైవేట్ ఉద్యోగినికి టోకరా

హిమాయత్‌నగర్: మనీలాండరింగ్ కేసు నమోదైందని ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన 31 ఏళ్ల మహిళా ప్రైవేట్ ఉద్యోగినికి ట్రాయ్ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి తన మొబైల్ నంబర్ నుంచి అక్రమంగా సందేశాలు వస్తున్నాయని చెప్పారు. దీనిపై ఖార్గర్ పోలీస్ స్టేషన్ నుంచి ఆర్డర్ ఉందని చెప్పారు. అనంతరం కేటుగాళ్లు పోలీసుల మారువేశంలో స్కైప్ వీడియో కాల్ చేశారు. తన బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరించి అందులో ఎంత బ్యాలెన్స్ ఉందో తెలుసుకుని, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఆమె బ్యాంక్ ఖాతాలలో ఉన్న డబ్బును వెరిఫై చేసి తిరిగి చెల్లిస్తామని చెప్పారు. అనంతరం జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్ నిందితుడని, తాను వాగ్మూలంలో బాధితురాలు పేరు చెప్పాడని, ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ.20లక్షలు చెల్లించాలని చెప్పారు. బాధితురాలి కోసం న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పి విడతల వారీగా రూ. 4,99,700 కాజేసి మోసం చేశారు. దీంతో బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

పంటలు బాగా పండుతాయి

రంగంలో జోగిని కోనేటి మధమ్మ


భవిష్యవాణి వినిపిస్తున్న కోనేటి మధమ్మ

బంజారాహిల్స్: ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు బాగా పడుతాయని రంగం వేడుకలో కోనేటి మధమ్మ భవిష్యవాణి వినిపించారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో నల్ల పోచమ్మ ఆలయం వద్ద రంగం వేడుకలు వైభవంగా జరిగాయి. పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ళు, వందలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ జోగిని కోనేటి మధమ్మ పచ్చికుండపై నిల్చొని అమ్మవారి ఎదుట భక్తులకు భవిష్యవాణి వినిపించారు. బస్తీలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారని, అందరూ సుఖశాంతులతో ఉంటారని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. యువత చెడు మార్గంలో వెళ్తున్నారని వారితో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించాలని అంతా మంచి జరుగుతుందని ఆమె అన్నారు. రంగం సందర్భంగా బస్తీలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్ ఆలయ కమిటీ నేతలు పాల్గొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాజకీయ పార్టీల కుట్రలో పడి విడిపోవద్దు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చెన్నయ్య తదితరులు

పంజగుట్ట: రాజకీయ పార్టీల కుట్రల్లో పడి ఎస్సీలు విడిపోరాదని, అందరం ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకోగలమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కుట్రలకు వ్యతిరేకంగా ఆగస్టు 8 నుంచి 10 వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాల సంఘాలన్నింటినీ కలుపుకుని పోయి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద హలో మాల.. చలోఢిల్లీ పేరుతో మహాధర్నా కరపత్రాన్ని మంగళవారం మాలమహానాడు జాతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో వందలాది మంది నాయకులతో మహా ధర్నా చేసి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టకుండా అడ్డుకుంటామని తెలిపారు. అనంతరం మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరిని నియమించి ఆమెకు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పాల్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కారంపూడి మైనర్ బాబు, రంతు లక్ష్మణ్, బడుగు సాల్మాన్, కందుకూరి జార్జ్, గొట్టిపాటి యోగి పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి రథయాత్ర



రహమత్‌నగర్: అమ్మవారి దయ వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆకాంక్షించారు. ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్2 బస్తీలో స్థానిక బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య నేతృత్వంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన అమ్మవారి రథయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు. బస్తీ నాయకులు చెన్నయ్య, వెంకటేశ్, భరత్ ప్రసాద్, కాశీ, దశరథ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



బంజారాహిల్స్: అమ్మవారి ఊరేగింపును చూడటానికి వెళ్లిన ఓ వృద్ధుడు అనుమానాస్పదస్థితిలో అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా అంతర్‌గామి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కుందారపు రాములు (70) యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లో నివసించే తన కొడుకు శ్రీనివాస్ ఇంటికి వచ్చాడు. ఈ నెల 28న సాయంత్రం 3 గంటల సమయంలో బస్తీలో అమ్మవారి బోనాల ఊరేగింపు జరుగుతుండగా తిలకించేందుకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదు. దీంతో తన తండ్రి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు. వివరాలు తెలిస్తే 8019946671 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఈదమ్మకు బోనం.. కదిలిన బస్తీ జనం..

వినాయకనగర్ ఈదమ్మ ఆలయంలో వైభవంగా బోనాలు


వేడుకల్లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్.. ఆలయ కమిటీ ప్రతినిధులు...


ఈదమ్మ ఆలయానికి వస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలోని ఈదమ్మ–ఎల్లమ్మ ఆలయంలో బోనాల వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. గత అయిదు రోజులుగా ఈ ఆలయంలో ఈదమ్మ విగ్రహ పునఃప్రతిష్ట వేడుకలు జరుగుతున్న సంగతి తెలిసిందే. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ఆఖరి రోజు మంగళవారం బోనాలు సమర్పించాలని ఆలయ కమిటీ నిర్ణయించడంతో బస్తీ యావత్తు బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. దీంతో బస్తీలో పండుగ వాతావరణం నెలకొంది. బస్తీవాసులు పెద్ద సంఖ్యలో ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సంపంగి కిరణ్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆకృతి ఎగ్జిబిషన్


సరికొత్త డిజైన్లతో కూడిన నగలు ప్రదర్శిస్తున్న ఆకృతి డైరెక్టర్ శశినాథ తదితరులు

లక్డీకాపూల్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ డక్కన్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్న ఆకృతి ఎగ్జిబిషన్ నగల, వస్త్ర ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ శశినాథ ఈ నెల29న ఎగ్జిబిషన్‌ను ప్రారంభించగా సరికొత్త డిజైన్లతో కూడిన నగలు, ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందించిన డిజైన్ వేర్ దుస్తులు ముఖ్యంగా మహిళల మనస్సు దోచుకుంటున్నాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండే ఈ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగియనున్నదని నిర్వాహకులు తెలిపారు.

అమ్మవారికి బోనం సమర్పించిన విజయారెడ్డి



ఖైరతాబాద్: బోనాల పండుగలను పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్‌లోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అమ్మవారికి బోనం సమర్పించారు. మంగళవారం స్థానిక బస్తీ మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సభ్యులతో కలసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఆలయ పూజారి విజయారెడ్డికి ప్రత్యేక స్వాగతం పలికారు.

తెలంగాణ సంస్కృతి గొప్పది : గవర్నర్



గవర్నర్ రాధాకృష్ణన్‌కు పుస్తకం అందజేస్తున్న బాలస్వామి

లక్డీకాపూల్: తెలంగాణ ప్రజలు చాలా మంచివారని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని గవర్నర్ రాధాకృష్ణన్ కొనియాడారు. జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పగుడాకుల బాలస్వామి ఆధ్వర్యంలో పలువురు గవర్నర్ రాధాకృష్ణన్‌ను సోమవారం రాత్రి కలిసి వీడ్కోలు పలికారు. ఇక్కడి బోనాల మాదిరిగానే తమ సొంత రాష్ట్రమైన తమిళనాడులో కూడా ఉత్సవాలు జరుగుతాయని గుర్తుచేశారు. మాజీ గవర్నర్ సౌందరరాజన్ రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి గవర్నర్‌గా ఐదు నెలల పాటు రాధాకృష్ణన్ రాష్ట్రానికి సేవలు అందించి మహారాష్ట్రకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గవర్నర్‌కు చిరు సత్కారం చేసి, పుస్తకం అందజేసినట్లు బాలస్వామి పేర్కొన్నారు.

నర్సింగ్ కౌన్సిల్ ప్రక్షాళన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నీల వెంకటేష్, వంశీకృష్ణ తదితరులు

కాచిగూడ: అవినీతి,అక్రమాలకు నిలయంగా మారిన తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌ను తక్షణమే ప్రక్షాళన చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ బండ విద్యావతి గత 11 ఏళ్లుగా అక్కడే తిష్టవేసి అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కొంతమంది 5 నుంచి 20 వరకు నర్సింగ్ కాలేజీలు నడుపుతున్నారని, అవి కేవలం పేపర్లకే పరిమితమై ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. కాలేజీల్లో సరిగ్గా తనిఖీలు చేయకుండానే ఆయా కళాశాలల కరస్పాండెంట్లతో కుమ్మక్కై కోట్లాది రూపాయలను అక్రమంగా సంపాదించారని, ఈ విషయమై గతంలో రెండుసార్లు విద్యావతి సస్పెండయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు శివకృష్ణ, అడ్వకేట్ వంశీ, మధు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గృహహింస బాధితులకు సత్వర సేవలు



సాక్షి, సిటీబ్యూరో: గృహహింస బాధితులకు సమగ్రంగా సత్వర సేవలను అందించాలని సైబరాబాద్ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ కర్ణం సృజన ఆదేశించారు. వివిధ ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సహాయ వ్యవస్థలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ మేరకు సైబరాబాద్‌లోని పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం షీ టీమ్స్, మానవ అక్రమ రవాణా నియంత్రణ విభాగం, సఖీ, భరోసా సెంటర్ల ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ బాధితులకు సమర్థవంతమైన సహాయక చర్యల అభివృద్ధి, పటిష్టమైన యంత్రాంగం, ఏకీకృత విధానం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు సునీత, జమేష్ బాబు, లక్ష్మారెడ్డి, రంగారెడ్డి డీడబ్ల్యూఓ పద్మజ, మేడ్చల్–మల్కాజ్‌గిరి డీడబ్ల్యూఓ కృష్ణారెడ్డి, సంగారెడ్డి డీడబ్ల్యూఓ లలిత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఈఈఈ–2024 సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బేగంపేట్ హోటల్ ప్లాజా వేదికగా బుధవారం అంతర్జాతీయ సస్టైనబుల్ ఎనర్జీ అండ్ ఫ్యూచర్ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఐఈఈఈ–2024) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో భారత్‌లోపాటు విదేశాల ఇంజనీర్లు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పాల్గొని రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్టేషన్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఇంటెలిజెంట్ చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టాండర్డ్స్ పై నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ వేదికలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఇండియా కౌన్సిల్–ఉమెన్ ఇన్ ఇంజినీరింగ్ ప్రతినిధులు పలు అంశాలపై చర్చించనున్నారని సదస్సు కన్వీనర్ డాక్టర్ ఫణీంద్ర బాబు బొబ్బా పేర్కొన్నారు.

సినారె రచనలు స్ఫూర్తిదాయకం



రామారావుకు పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ లక్ష్మణ్

గన్‌ఫౌండ్రీ: పద్మవిభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి రచనలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సి.నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత వై.ముకుంద రామారావుకు కిన్నెర– సినారె సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ సినారె సాహిత్యలోకంలో ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ సినారె తెలుగుజాతికి గర్వకారణమన్నారు. అంతకుముందు నిర్వహించిన సినారె సంగీతవిభావరి ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సారస్వత పరిషత్ కార్యదర్శి చెన్నయ్య, రచయిత వి.ఆనంద్, సంస్థ కార్యదర్శి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐకి ఆ కేసు అప్పగించండి

వాణిజ్యపన్నుల స్కామ్‌పై ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: వాణిజ్యపన్నుల శాఖలో జరిగిన రూ.వెయ్యి కోట్ల స్కామ్ కేసును సీబీఐకి అప్పగించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రభుత్వాన్ని కోరారు. వాణిజ్య పన్నుల శాఖలో ఎన్నడూ లేని విధంగా స్కామ్ జరిగిందని, దీనిలో బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన సోమేష్‌కుమార్ ఉండటం దారుణమని అన్నారు. రూ. వెయ్యికోట్ల స్కామ్ కేసును సీబీఐకి అప్పగించాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు మంగళవారం ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. సీబీఐకి ఈ కేసును అప్పగిస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

అంతుచిక్కని నొప్పులు



పోలీస్‌స్టేషన్ సమీపంలో రాజీవ్ గృహకల్పవాసుల నీటిసంపు

- జగద్గిరిగుట్ట 'రాజీవ్ గృహకల్ప'వాసుల తిప్పలు
- 300 మంది మోకాళ్లు, కీళ్లు, ఒళ్లు నొప్పులతో సతమతం
- కేంద్ర ప్రభుత్వానికి 'ఎక్స్'లో ఫిర్యాదు చేసిన స్థానికులు

జగద్గిరిగుట్ట: ఉన్నట్టుండి వారికి కాళ్లనొప్పులు.. మరికొద్ది రోజులకు కీళ్లనొప్పులు.. వీటితో నరకయాతన అనుభవిస్తుండగానే ఒళ్లు నొప్పులు.. ఇవి కారణం తెలియని నొప్పులు.. ముప్పేట దాడి చేస్తున్నాయి. డాక్టర్లకు కూడా వీటి అంతుచిక్కడం లేదు. మందులు వాడినా నొప్పులు నయంకావడంలేదు. ఒకరు కాదు, ఇద్దరు కాదు.. ఈ విధంగా ఆ కాలనీలో వందల మంది మంచాన పడ్డారు. ఇదీ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప దుస్థితి. ఇక్కడ సుమారు 1,556 కుటుంబాలు నివసిస్తున్నాయి. రెండు నెలల నుంచి యువకులు, వృద్ధులు, మహిళలనే తేడా లేకుండా మూడు వందల మంది మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీవాసులు ఇటీవల మంచినీటి సమస్యతో సతమతమయ్యారు. తరచూ మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు రావడంతో తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. కాగా, ఇటీవల వీరికి జలమండలి ద్వారా కృష్ణా, గోదావరి మంచినీటి సరఫరా మొదలైంది. ఈ నీటిని తాగిన తర్వాతే అనారోగ్యానికి గురై మంచాన పడ్డామని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక యువకులు కేంద్ర ప్రభుత్వానికి 'ఎక్స్'లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆశ వర్కర్లు సర్వే చేయడం ప్రారంభించారు. కలుషితనీరే కారణమా లేక మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. ఆశ వర్కర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి అందరి ఆధార్ కార్డులతోసహా వివరాలు తెలుసుకొని ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిసింది.



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న వాటర్ ట్యాంక్



మందులు వాడినా తగ్గడం లేదు

గత రెండు నెలలుగా నాకు ఆరోగ్యం సరిగా ఉండటంలేదు. డాక్టర్ పరీక్షించగా రిపోర్ట్‌లలో ఎటువంటి సమస్యా లేదు. డాక్టర్ ఇచ్చిన మందులు వాడినా నొప్పులు తగ్గడం లేదు. నాలాగా ఇప్పటికే చాలామంది ఇక్కడ మంచాన పడ్డారు. కీళ్లనొప్పులతో ఇంకా ఎన్నిరోజులు ఇలా బాధపడాలో అర్థమవడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే ఇంకా చాలామందికి ఇబ్బందులు కలగవచ్చు.

– సరస్వతి, బాధితురాలు



కారణాలు తెలుసుకోవాలి

నేను ఈ రాజీవ్ గృహకల్పలో గత 15 ఏళ్లుగా ఉంటున్నాను. ఎప్పుడూ ఇటువంటి సమస్య నాకు ఎదురుకాలేదు. కొద్దిరోజులుగా నాకు మోకాళ్ల నొప్పులే కాకుండా జ్వరం కూడా తగ్గడం లేదు. వీటికి తాగునీరే కారణమని కొందరు అంటున్నారు. నీళ్ల వేడి చేసుకొని తాగుతున్నాం. అయినా సమస్య మాత్రం అలానే ఉంది. ఇప్పటికైనా చొరవ చూపి నొప్పులకు కారణాలేమిటో తెలుసుకోవాలి.

– సువార్త, బాధితురాలు..

పదోన్నతి టీచర్ల సభకు ఏర్పాట్లు

- ఆగస్టు 2న ఎల్బీ స్టేడియంలో నిర్వహణ
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ఆగస్టు 2వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన ఉన్నత స్థాయి అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సభ జరగనున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే బస్సులను ఎక్కడ పార్కింగ్ చేయాలో జిల్లాలవారీగా సూచించాలన్నారు. బస్సులను నిజాం కళాశాల, ఎన్టీఆర్ స్టేడియం తదితర తదితర ప్రాంతాలలో పార్కింగ్ చేయాలని, సభాప్రాంగణం క్లీనింగ్, శానిటేషన్ పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, రాష్ట్ర ఎస్సీ డెవలప్మెంట్ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి ఎ.శరత్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌పోర్టు జాయింట్ సెక్రటరీ ఎస్.హరీష్, మైనారిటీ, గురుకుల కార్యదర్శి ఆయేషా మసరత్ ఖానం, స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఎండి సోనీ బాలాదేవి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, వెంకట నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

నగరంలో నేడు..

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ డక్కన్ హోటల్‌లో ఆకృతి ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ ప్రదర్శన నేటితో ముగియనున్నది.
- టీఐఈ ఎడిషన్ ఓపెన్ మైక్ (ప్లాట్‌ఫాం ఫర్ నెట్‌వర్కింగ్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్స్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్) ఈవెంట్ మాదాపూర్ దుర్గం చెరువు ఎదురుగా ఉన్న ప్లాట్ నెం.28లో సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- బిల్డింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై డీజిల్ ప్రాజెక్ట్ డెలివరీ సొల్యూషన్స్‌పై ప్రత్యేక ఈవెంట్‌ను లక్డీకాపూల్‌లోని హోటల్ హాంప్‌షైర్ ప్లాజాలో ఆటో డెస్క్ నిర్వహిస్తుంది.

ఫసియుద్దీన్‌కు అభినందనలు

రహమత్‌నగర్: బోరబండలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించిన కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌ను బస్తీవాసులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, వనజ లక్ష్మణ్‌గౌడ్‌లు మాట్లాడుతూ బాబా ఫసియుద్దీన్ నిర్వహించిన బోనాల ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. మహిళా నాయకురాలు కృష్ణవేణి, సరళ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు సంస్థలా.. జేబు సంస్థలా..

ఆప్ ధర్నాలో ఇండియా కూటమి నేతల ధ్వజం

కవాడిగూడ: దేశంలో ప్రతిపక్ష పార్టీలను అణచివేసేందుకు అధికారబీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను జేబు సంస్థలుగా వాడుకుంటోందని ఇండియా కూటమి నేతలు మండిపడ్డారు. ఈడీ, సీబీఐలను ప్రధాన సాధనాలుగా వాడుతూ నిరాధారంగా విపక్ష నేతలను టార్గెట్ చేసి జైల్లో బంధిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ మంగళవారం దేశవ్యాప్త ధర్నాలలో భాగంగా ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, వైశ్య ఫెడరేషన్ చైర్మన్ కాలువ సుజాత, సీపీఐ, సీపీఎం నేతలు బాల మల్లేష్, డీజీ నర్సింహారావు, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు హాజరై సంఘీభావం తెలిపారు. వినోద్‌రెడ్డి మాట్లాడుతూ ఆధారాలు లేని ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టు చేసిన అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు బుర్రా రాముగౌడ్, డాక్టర్ సాల్మాన్‌రాజు, డాక్టర్ ఎస్‌కే అన్సారీ, ఎం.ఎ.మాజీద్, మహిళా విభాగం నాయకులు యమునాగౌడ్, విజయ ముల్లంగి తదితరులు పాల్గొన్నారు.



ఆమ్ ఆద్మీపార్టీ నిరసనలో ఇండియా కూటమి నేతలు

బల్దియాలో బదిలీలు

రఘుప్రసాద్, సామ్రాట్ అశోక్ తిరిగి జీహెచ్ఎంసీకి..

సాక్షి, సిటీబ్యూరో: వివిధ ప్రభుత్వ విభాగాల బదిలీల్లో భాగంగా మంగళవారం జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న పలువురు మునిసిపల్ కమిషనర్ స్థాయి అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. ఈమేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీకి రాక ..

గవర్నర్ కార్యాలయంలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న సీఎస్ రఘుప్రసాద్‌ను, సీడీఎంఏలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ఎస్.సామ్రాట్ అశోక్‌ను జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. వీరిద్దరూ గతంలో జీహెచ్ఎంసీలో జోనల్/అడిషనల్ కమిషనర్లుగా పనిచేశారు. వీరితో పాటు ఇతర ప్రాంతాల నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయిన వారిలో సీడీఎంఏ నుంచి పి.శ్రీధర్, వెయిటింగ్‌లో ఉన్న అరుణ కుమారి చరణ్, గద్వాల్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న డి.శంకర్‌సింగ్ ఉన్నారు.

జీహెచ్ఎంసీ నుంచి వెళ్లింది వీరే...

జీహెచ్ఎంసీలోని వివిధ కార్యాలయాల్లో వివిధ పోస్టుల్లో ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారిలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సెక్రటరీగా పనిచేస్తున్న టి.దశరథ్‌ను గద్వాల్ మున్సిపల్ కమిషనర్‌గా, యూబీడీలో జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ. విజయలక్ష్మిని వరంగల్ మెప్మా డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇంకా జీహెచ్ఎంసీలో వివిధ సర్కిళ్లలో డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లుగా పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారిలో జె.సువార్త, సీహెచ్ రాజేందర్‌రెడ్డి, బి.సంధ్య, వి.ప్రశాంతి, డి.ఢాకు నాయక్, ఎ.నాగమణి, బి.రాజేశ్‌కుమార్, సీహెచ్. జ్యోత్స్న, ఎస్.నాగేందర్, ఆర్.పుష్పలత ఉన్నారు.

అణు ఖనిజాల వృద్ధిలో ఏఎండీ కీలకం

- డైరెక్టర్ జనరల్ డాక్టర్ మొహంతి
- ఘనంగా ఏఎండీ 75వ వ్యవస్థాపక దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: అణుశక్తి విభాగం (డీఏఈ) పరిధిలోని అణు ఖనిజాల అన్వేషణ, పరిశోధన డైరెక్టరేట్(ఏఎండీ) అణు ఖనిజాల వనరుల అభివృద్ధిలో కీలకంగా మారిందని అణుశక్తి కమిషన్(ఏఈసీ) చైర్మన్, అణుశక్తి విభాగం(డీఏఈ) కార్యదర్శి డాక్టర్ ఏకే మొహంతి అన్నారు. సంస్థ 75వ వ్యవస్థాపక వేడుకలు మంగళవారం న్యూఢిల్లీ, బెంగళూరు, జంషెడ్‌పూర్, షిల్లాంగ్, జైపూర్, నాగ్‌పూర్, చర్లపల్లి(హైదరాబాద్)లోని ఏడు ప్రాంతీయ కేంద్రాలు, తిరువనంతపురం, విశాఖపట్నం, కలకత్తాల్లో ఉన్న మూడు విభాగ కార్యాలయాలతోపాటు హైదరాబాద్ బేగంపేటలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ వేడుకలకు డాక్టర్ ఏకే మొహంతి ముఖ్యఅతిథిగా, న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్ చైర్మన్ అండ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కోమల్ కపూర్ గౌరవఅతిథిగా హాజరయ్యారు. ఏఎండీ మాజీ డైరెక్టర్ డాక్టర్ కె.కె. ద్వివేది, ఏఎండీ డైరెక్టర్ ధీరజ్ పాండే, అదనపు డైరెక్టర్లు డాక్టర్ ప్రభాకర్ కుమార్, ప్రేమ్ కుమార శర్మలతోపాటు పలువురు ఏఎండీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ చారిత్రక సందర్భానికి గుర్తుగా ఏఎండీ 75 సంవత్సరాల సేవల స్మారక ప్రత్యేక లోగోను డాక్టర్ మొహంతి ఆవిష్కరించారు. డైరెక్టరేట్ సాధించిన అద్భుత విజయాలకు సంబంధించి ఐదు అంతర్గత ప్రచురణలను కూడా విడుదల చేశారు. డా.హోమీ బాబా అణుశక్తి కార్యక్రమమనే భావనను రూపొందించినప్పటి నుంచి అణు ఖనిజాల కోసం ఏఎండీ అన్వేషణ వ్యూహం, అణు విజ్ఞానం, సాంకేతికత అభివృద్ధి కార్యక్రమాలు దేశీయంగా జరిగాయని పేర్కొన్నారు. ఏఎండీ తన సామర్థ్యంలో వైవిధ్యాన్ని కనబరుస్తున్నదని, అరుదైన ఖనిజాలు, అరుదైన భూ మూలకాలు వంటి కీలకమైన, వ్యూహాత్మక అంశాలపై అన్వేషణ ప్రారంభించిందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరి ప్రశంసలు పొందాయి.

రుణాలతో మహిళా సంఘాలు బలోపేతం

అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



సాక్షి సిటీ బ్యూరో: తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఆర్థిక సంవత్సరం 2024–25నకుగాను స్వయం సహాయక సంఘ సభ్యులకు ఎస్.హెచ్.జి. ద్వారా ఋణాలు (స్త్రీ నిధి, బ్యాంకు లింకేజి , సీబీఓ నిధులు) అందించి ఆర్థికంగా బలోపేతం చేస్తుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధిక గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇందిరా మహిళాశక్తి పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సాంబశివరావు, మెప్మా అనిల్ కుమార్, ఎల్డిఎం శివప్రసాద్, డీడబ్ల్యూఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'మోడల్ ఐక్యరాజ్యసమితి' సక్సెస్



హెచ్‌సీయూలో నిర్వహించిన మోడల్ ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

హెచ్‌సీయూలో నిర్వహణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'మోడల్ ఐక్యరాజ్య సమితి'విజయవంతమైంది. మంగళవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మోడల్ యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ కార్యక్రమాన్ని 'గ్రీన్ ఆరిజన్స్: నావిగేటింగ్ ది క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్'అనే అంశం ఆధారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనీషియేటివ్ అంశాలపై విద్యార్థులు చర్చించారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) జాతీయస్థాయిలో తరచూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సంబంధాల సంక్లిష్టత, ప్రపంచ సమస్యలపై చర్చ, సంభాషణలు, సహకారం ద్వారా పరిష్కారాలకుగాను విద్యార్థులు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తమకు విలువైన అనుభవం ఏర్పడిందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. హెచ్‌సీయూ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ చిట్టెడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్(ఎంయూఎన్ఓ) కేవలం విధి విధానాలపై అవగాహన కల్పించడమే కాకుండా భావి ప్రపంచ పౌరులకు పరస్పర సహకారం, సహాయం, నిర్మాణాత్మక చర్చల విలువను గుర్తించే శిక్షణా స్థలమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రజ్ఞపరమిత మిశ్రా, డాక్టర్ ఎం.నాగరాజు, డాక్టర్ అలోక్ కుమార్ పాండే, వెంకటేష్, సాహితీ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పోటెత్తిన జనం



చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి రోజు అని ప్రచారం కావడంతో పాతబస్తీకి చెందిన మహిళలు ఇల్లు, రేషన్ కార్డు, పింఛన్ వంటి అర్జీలతో ప్రజావాణికి పోటెత్తారు. ముఖ్యంగా మహిళలు గుంపులు గుంపులుగా తరలివచ్చారు. అయితే ఈ విషయంలో ప్రజావాణి అధికారులు దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయడంతో సమాధానపడ్డారు. ఈ క్రమంలో మధ్యాహ్న భోజన సరఫరాదారుల సంఘం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వేడి వేడిగా వడ్డిస్తున్నామన్నారు. అందుకు ప్రభుత్వం చెల్లిస్తున్నది స్వల్పమే అయినప్పటికి తమకు ఉపాధిని కల్పిస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించాలన్న ఆలోచన చేయడం తగదన్నారు. దీనిపై స్పందించిన చిన్నారెడ్డి సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇక ప్రజావాణిలో మొత్తం 455 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 94 అర్జీలు వచ్చాయి. అదే విధంగా పౌరసరఫరాల శాఖకు సంబంధించి 77, విద్యుత్ శాఖ 45, హౌజింగ్ 44 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 40, ఇతర శాఖలకు సంబంధించి 155 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

రోహిత్ సెంచరీ

జై భగవతి 258 ఆలౌట్– ఎ2–డివిజన్ రెండు రోజుల లీగ్



సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీఏ ఎ2–డివిజన్ రెండు రోజుల లీగ్ క్రికెట్‌లో జై భగవతి జట్టు ఓపెనర్ దువ్వలూరి రోహిత్ (155 బంతుల్లో 125; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కాడు. అవర్స్ జట్టుతో మంగళవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జై భగవతి టీమ్ 79.3 ఓవర్లలో 258 పరుగుల వద్ద ఆలౌటైంది. జై భగవతి ఇన్నింగ్స్‌లో రోహిత్ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. మిగతా వారిలో నిహాల్ (27) చెప్పుకోదగ్గ స్కోరు చేశాడంతే! ఓపెనింగ్ వికెట్‌కు వీళ్లిద్దరు 96 పరుగులు జోడించారు. తర్వాత ఇంకెవరూ కనీసం 20 పరుగులైనా చేయలేకపోయారు. అవర్స్ బౌలర్లలో ధనుశ్ (6/66) ప్రత్యర్థి బ్యాటర్లను వణికించాడు. జశ్వంత్ 3 వికెట్లు తీశాడు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 31, జూలై, 2024





“

ఈ వాతావరణం హెవీ వెయిట్/ రిపిటీషన్స్ చేయడానికి సపోర్ట్ చేస్తుంది. సో, స్ట్రెంగ్త్ ట్రెయినింగ్‌కి ఎక్కువ టైమ్ కేటాయించాలి. వైరల్ ఫీవర్స్ ఫ్లూ వచ్చేది ఈ సీజన్‌లోనే కాబట్టి, ఇమ్యూనిటీని బూస్ట్ చేసే ప్రత్యేకమైన వర్కవుట్స్ చేయించాలి. ఈ వాతావరణంలో మజిల్స్ బద్ధకిస్తాయి. కాబట్టి వర్కవుట్‌కి ముందు వార్మ్ అప్‌కి కేటాయించే సమయాన్ని కొంత పెంచి చేయిస్తాం. వారానికి 3 నుంచి 4 గంటల పాటు రోజూ 45 నిమిషాలు వ్యాయామం ఈ సీజన్‌లో చాలా ఉపయుక్తం.

– ఎం.వెంకట్, సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ లైఫ్‌స్టైల్ కోచ్



వర్షాకాలం వర్కవుట్స్..

జంపింగ్ జాక్స్..

వర్షాకాలంలోనూ వదలకుండా..

సీజనల్ వర్కవుట్స్‌పై దృష్టి అవసరం	కురిసే సీజన్.. కసరత్తులకు రీ డిజైన్..	ఫ్లూ, వైరల్ ఫీవర్లు దరిచేరకుండా..	ఇమ్యూనిటీని పెంచేందుకు వ్యాయామం తప్పనిసరి

మాన్‌సూన్ వర్కవుట్స్ సూచిస్తున్న సిటీ ట్రైనర్స్

చెమట పడుతోందని వేసవిలో, ముసురు పట్టిందని వానాకాలంలో, మంచుకురుస్తోందని చలికాలంలోనూ వ్యాయామాన్ని మానకూడదు. ఏ సీజన్‌కు తగ్గట్టు ఆ తరహా వర్కవుట్స్ ప్లాన్ చేసుకోవచ్చని ఫిట్‌నెస్ ట్రైనర్స్, నిపుణులు అంటున్నారు. వ్యాయామాన్ని స్కిప్ చేయడం మంచి అలవాటు కాదని, దీని వల్ల సీజనల్ వ్యాధుల ప్రభావం తట్టుకునే ఇమ్యూనిటీపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. అందుకే సీజన్‌కు తగ్గట్టుగా వర్కవుట్‌ని డిజైన్ చేసుకోవాలని వ్యాయామ నిపుణులు సూచిస్తున్నారు. నగరంలో సీజన్‌కు అనుగుణంగా వర్కవుట్ డిజైన్ అనేది ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతోంది. దీంతో ఫిట్‌నెస్ ఫ్రీక్‌లకు వెసులుబాటుగా ఉండే ట్రెయినర్లకు డిమాండ్ పెరుగుతోంది.

– సాక్షి, సిటీబ్యూరో

వర్షాకాలంలో వ్యాయామ ఆసక్తి తగ్గడానికి అధిక తేమ స్థాయిలు, సూర్యకాంతి లేకపోవడం, వాతావరణ పీడనంలో మార్పులు వంటి కారణాలు ఉన్నాయి. వాతావరణ పీడనం పడిపోవడం అనేది మన శరీర ప్రసరణ వ్యవస్థను ప్రభావితం చేసి, అలసట, శక్తి లేకపోవడం వంటి అనుభూతులకు గురిచేస్తాయి. కానీ వర్షాకాలంలో ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం మానసిక స్థితిని మెరుగుపరచడంలో మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుందని అంటున్నారు. దీంతో పలువురు నిపుణులు సింపుల్ వర్కవుట్స్‌పై సలహాలు, సూచనలు అందిస్తున్నారు...

ఎండలు ఉన్నాయని కొందరు వానలు ఉన్నాయని కొందరు వర్కవుట్‌కి బద్ధకిస్తుంటారు. కొందరు మాత్రం సీజన్లతో సం

మార్పు చేర్పులు అవసరం..

బంధం లేకుండా జిమ్స్‌కు వస్తుంటారు. కనీసం వారానికి 3 నుంచి 4 సార్లు చేసేవారిని సిన్సియర్ అని చెప్పొచ్చు. అదే కరెక్ట్ విధానం కూడా. ఈ సీజన్‌లో తెల్లవారుఝామున బాగా ముసురుపట్టి ఉన్నప్పుడు ఉదయం లేచిన వెంటనే ఎక్సర్‌సైజ్ చేయాలనే మూడ్ రాదు. కాబట్టి లేవగానే ఇంట్లోనే కొన్ని స్ట్రెచ్చింగ్ వర్కవుట్స్ చేశాక జిమ్‌కి రావచ్చు. వాకింగ్, జాగింగ్, యోగా వంటివి అవుట్‌డోర్‌లో చేసే అలవాటు వల్ల వానాకాలంలో రెగ్యులారిటీ మిస్ అవుతుంది. కాబట్టి ఇన్‌డోర్ వర్కవుట్స్ ఎంచుకోవడం మంచిది.

సమయానికి తగినట్లు..

- స్పాట్ జాగింగ్ చాలా తక్కువ స్పేస్‌లో కదలకుండా చేసే జాగింగ్ ఇది. అవుట్‌డోర్‌లో జాగింగ్‌కి సమానమైన ప్రతిఫలాన్ని అందిస్తోంది. చేతులను స్వింగ్ చేయడం వంటి తదితర మార్పు చేర్పుల ద్వారా ఫుల్‌బాడీకి వర్కవుట్ ఇవ్వొచ్చు.
- జంపింగ్ జాక్స్, క్లైంబర్స్, హై నీస్, సిజర్ చాప్స్ వంటివి ఒకే ప్రదేశంలో కదలకుండా చేయవచ్చు. వీటిని మూడు సెట్స్‌గా విభజించుకుని చేయడం వల్ల మంచి ఫలితాలు అందుతాయి.
- స్కిప్పింగ్ రోజంతా చురుకుగా ఉంచే అద్భుతమైన మాన్ సూన్ వర్కౌట్. రోప్ స్కిప్పింగ్ లేదా జంపింగ్ అధిక సంఖ్యలో కేలరీలను బర్న్ చేస్తుంది. ఇది అన్ని సీజన్‌లలోనూ చేయవచ్చు.
- వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండటానికి ఇండోర్ యోగా ఒక గొప్ప మార్గం. వృక్షాసనం వంటి ఆసనాలతో చల్లని వాతావరణంలో ప్రయోజనకరంగా ఉంటుంది.
- వ్యాయామాల్లో వైవిధ్యం కోసం డంబెల్స్ లేదా రెసిస్టెన్స్ బ్యాండ్‌ల వంటి కొన్ని ప్రాథమిక వ్యాయామ పరికరాలను ఉపయోగించవచ్చు.
- సాధారణ నీటికి ప్రత్యామ్నాయంగా హెర్బల్ టీలు, కొబ్బరి నీళ్లను ఉపయోగించడం ద్వారా చురుకుదనాన్ని, ఉత్తేజాన్ని పొందవచ్చు.
- ఆన్‌లైన్‌లో లేదా ఫిట్‌నెస్ యాప్‌ల ద్వారా అందుబాటులో ఉన్న ఫిట్‌నెస్ ఇచ్చే డ్యాన్స్ వీడియోలను అనుసరించాలి.
- ఇండోర్ స్విమ్మింగ్ పూల్ అందుబాటులో ఉంటే స్విమ్మింగ్ ల్యాప్‌లు లేదా ఆక్వా ఏరోబిక్స్ క్లాసులలో పాల్గొనాలి.
- వర్షాకాలంలో బద్ధకాన్ని ఎదుర్కోవడానికి, సాధారణ శారీరక శ్రమతో పాటు సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, వీలైనంత వరకూ సూర్యరశ్మి శరీరానికి సోకేలా చూసుకోవడం చాలా ముఖ్యం.





హోం బేకర్స్..!

ఇంట్లో కిచెన్‌లోనే బేకరీ ఏర్పాటు



కాస్తంత సృజనాత్మకతకు ఆలోచన తోడైతే అద్భుతాలు సృష్టించొచ్చు. పలువురు యువత ఇదే విషయాన్ని నిరూపిస్తున్నారు. చిన్నప్పటి నుంచి కళల పట్ల ఉన్న ఆసక్తికి, ఆలోచనను జత చేసి ఎంట్రప్రెన్యూర్స్‌గా విజయతీరాలను చేరుకుంటున్నారు. సాధారణంగా బిజినెస్ చేయాలంటే పెట్టుబడి, అనువైన ప్రాంతం దొరకాలి.. అంత కష్టపడి వ్యాపారం చేస్తే, అది సక్సెస్ అవుతుందా అనే అనుమానం ఉంటుంది. అందుకే ఈ తరం యువత సరికొత్త మార్గాన్ని ఎంచుకుంటోంది. క్లౌడ్ కిచెన్ కాన్సెప్ట్‌తో ముందడుగు వేస్తున్నారు. ఇటీవల హోం బేకర్స్ నడుపుతూ వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడుతున్నారు.

– సాక్షి, సిటీ బ్యూరో

- ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు కృషి
- క్లౌడ్ కిచెన్ కాన్సెప్ట్‌తో ముందుకు
- స్పెషల్ థీమ్స్‌తో ఔరా అనిపించుకుంటున్న యువత



పలు థీమ్స్‌తో కేక్స్ తయారీ..

సాధారణంగా పుట్టినరోజు, పెళ్లి, న్యూఇయర్ ఇలా చాలా సందర్భాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటుంటాం. అయితే ఎప్పుడూ ఒకే రకమైన కేక్ కట్ చేస్తుంటే మజా ఏముంటుందని, కొందరు విభిన్న రకాల కేకులు ఆర్డర్ చేస్తుంటారు. పిల్లల కోసం స్పైడర్‌మ్యాన్, ఏనుగు, బార్బీ, పెళ్లి రోజు, ఎంగేజ్‌మెంట్ కోసం ప్రత్యేక థీమ్స్‌తో కేకులు తయారు చేస్తుంటారు. కస్టమర్లకు నచ్చిన థీమ్స్ తయారు చేసేందుకు తాము ఎంతో కష్టపడుతుంటామని చెబుతున్నారు.

పూర్తి సహజంగా..


ఎలాంటి రసాయనాలూ లేకుండా పూర్తిగా సహజ పదార్థాలతో తయారుచేయాలనే ఉద్దేశంతో చాలామంది హోం బేకర్స్‌ను ప్రారంభించినట్టు చెబుతున్నారు. దీంతో పాటు పరిశుభ్రమైన వాతావారణంలో మన ఇంట్లో తయారు చేసినట్టుగానే కస్టమర్లకు పదార్థాలు తయారు చేసి ఇస్తామని పేర్కొంటున్నారు. చాలా బేకరీల్లో డాల్డాతో తయారుచేస్తారని, అయితే తాము మాత్రం బట్టర్, బ్రౌన్ షుగర్‌ను వాడతామని హోం బేకరీ నిర్వాహకులు చెబుతున్నారు.

ఇంట్లో కిచెన్‌లోనే..

సాధారణంగా బేకరీ ఏర్పాటు చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కానీ హోం బేకరీని తక్కువ ఖర్చుతోనే ఇంట్లో కిచెన్‌లోనే ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎలాగూ ఇంట్లో వంటకాలను చాలా పరిశుభ్రమైన పరిసరాల్లోనే తయారు చేస్తుంటారు. కాబట్టి అక్కడే చిన్న ఓవెన్ వంటి చిన్న చిన్న పరికరాలతో కేకులు, కుకీస్ తయారు చేస్తున్నారు. కేక్స్, కుకీస్‌తో పాటు మఫిన్స్, చీజ్ కేకులు, డోనట్స్ వంటి ఉత్పత్తులతో చుట్టు పక్కల వారితో ఔరా అనిపించుకుంటున్నారు.

సాధికారత కోసం..

చాలా మంది మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలనే ఉద్దేశంతోనే ఈ హోం బేకర్స్ ప్రారంభిస్తున్నటు చెబుతున్నారు. ఇంట్లో వారిపై ఆధారపడకుండా సొంత గుర్తింపు తెచ్చుకోవాలనే తాపత్రయమే వారిలో కనిపిస్తోంది. తమలో ఉన్న సృజనాత్మకతను నలుగురూ మెచ్చుకుంటే అంతే చాలు అని చెబుతున్నారు.



ఇది కూడా సమాజ సేవే..

ఆరోగ్యకరమైన పదార్థాలు అందిస్తే కూడా సమాజానికి సేవ చేసినట్టే అనేది నా నమ్మకం. కాస్త భిన్నంగా కనిపించడమే కాకుండా, మన పనులు భిన్నంగా ఉండి, సమాజంలో గుర్తింపు రావాలనేది నా తాపత్రయం. అందులో భాగంగానే హోం బేకర్స్ కాన్సెప్ట్ ఆలోచన వచ్చింది. నా కేక్స్ డిజైన్స్ బాగున్నాయని అందరూ మెచ్చుకుంటుంటే ఆ ఆనందం మాటల్లో చెప్పలేను.

– సాయి శ్రీ, ఓవెన్ కుక్ డిలైట్





చాలా టేస్టీగా ఉంటాయి..

నేను చాలా సార్లు హోం బేకర్స్ నుంచి కేక్స్ ఆర్డర్ చేసుకున్నాను. సాధారణ బేకరీల కన్నా ఇక్కడ చాలా హైజీనిక్‌తో పాటు రుచికరంగా ఉంటాయి. ఎలాంటి డిజైన్ కావాలంటే అలాంటి డిజైన్స్‌లో ఇస్తుంటారు. తక్కువ ధరలోనే మంచి కేక్స్ వస్తున్నాయి.

– మెరుగు శివ ప్రకాశ్ నాయుడు





12 రోజులు.. 5 వేలు కిలో మీటర్లు

అమెరికాలో సైక్లింగ్ పోటీలు

భారత్ నుంచి ఎంపికైన తొలివ్యక్తి

హైదరాబాదీ రవీందర్‌రెడ్డి ఘనత

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ సైక్లింగ్ పోటీల్లో అత్యంత కఠినమైన రేస్ ఎక్రాస్ అమెరికా (వరల్డ్ అల్ట్రా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ) సైక్లింగ్ ఈవెంట్. దీనికి అర్హత సాధించానని హైదరాబాద్ బండ్లగూడకు చెందిన రవీందర్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 10 నుంచి సైక్లింగ్ పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. భారత్ నుంచి తొలిసారి ఈ పోటీల్లో పాల్గొంటున్న తొలి వ్యక్తి తానేనని, 12 రోజులు, 12 నగరాల మీదుగా 5 వేల కిలో మీటర్ల నిరంతరాయంగా సైక్లింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈస్ట్ అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రారంభమై న్యూజెర్సీలో ముగుస్తుందన్నారు. ప్రపంచంలో 60 ఏళ్ల పైబడిన వారు ఇద్దరు, 50 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసులో 5 గరు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి ప్లస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే ప్రాంతాల్లో ఈ సైక్లింగ్ ఉంటుందన్నారు. పేద పిల్లలకు ఫండ్ రైజింగ్‌లో భాగంగా ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నారని, గతంలో 29 మంది సైక్లిస్టులు రూ.100 కోట్ల ఫండ్ రైజ్ చేశారని గుర్తుచేశారు. గతంలో రేస్ ఎక్రాస్ ఇండియా, రేస్ ఎక్రాస్ ఆసియా పోటీల్లో విజేతగా నిలిచానని తెలిపారు. రేస్ ఎక్రాస్ అమెరికా ఈటల్లోనూ 50 ఏళ్ల కేటగిరిలో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ముందస్తు ట్రయల్స్‌లో భాగంగా ప్రస్తుతం అమెరికాలో సైక్లింగ్ చేయనున్న రూట్‌లో ట్రయల్ వేస్తున్నారు.

అధునాతన జీవన విధానం పేరుతో పెంచుకుపోతున్న శరీర కాలుష్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఫ్యాషన్, బ్యూటీ, ట్రెండ్స్ మాయలో పడిపోయి గత తరం ఆరోగ్యకరమైన పద్ధతులు, సంస్కృతికి సంపూర్ణంగా దూరమవుతున్నాం. ఇప్పటికైనా మేల్కొని స్వీయ సంరక్షణకు, భవిష్యత్ తరం ఆరోగ్య భద్రతకు అమ్మమ్మల కాలం నాటి పద్ధతులను అంతరించిపోకుండా ప్రయత్నం చేయాలని ప్రముఖ సింగర్ స్మిత చెబుతున్నారు. దీని కోసం నగరంలోని ఫిల్మ్ నగర్ వేదికగా ప్రత్యేకంగా 'ఓల్డ్ స్కూల్ బృందావనం'ను ఆమె ప్రారంభించారు.. – సాక్షి, సిటీబ్యూరో

ఓల్డ్ స్కూల్ బృందావనం

పాత తరానికి కొత్త ఊపిరి

- నగరంలో కొత్త కాన్సెప్ట్
- ప్రాచీన వైద్యం, కళ, సాంస్కృతిక పద్ధతుల కొనసాగింపు
- ఒత్తిడి జీవితాలకు అప్పటి థెరపీలతో సాంత్వన
- బృందావనాన్ని స్వతహాగా ప్రారంభించిన సింగర్ స్మిత..

తాతల కాలం నాటి ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాల్లోని పద్ధతులను నగరవాసులకు అందించాలనే లక్ష్యంతో సనాతన పద్ధతులతో సౌందర్య పోషణకు శ్రీకారం చుట్టారు సింగర్ స్మిత. ఓల్డ్ స్కూల్ రిచువల్స్ నేపథ్యంలో దేశంలోనే మొదటిసారిగా 'ఓల్డ్ స్కూల్ బృందావనం'ను సొంతంగా ప్రారంభించడం సంతోషంగా ఉందని స్మిత తెలిపారు. ఈ కేంద్రం పాత తరం వైవిధ్యాన్ని కొనసాగించడమే కాకుండా ఈ తరానికి ఆరోగ్య వైద్యంగా దోహదపడుతుందని, వైద్యం, స్వీయ-సంరక్షణ, కళలకు ఏకైక స్థానంగా సంప్రదాయ పద్ధతులకు ఆధునిక లగ్జరీ సమ్మేళనాన్ని అందిస్తామని చెబుతున్నారు..

ఆనాటి వైద్యం.. ఈనాటి వైవిధ్యం..

ఈ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రత్యేకమైన క్రిస్టల్ ఆయిల్-ఇన్ఫ్యూజ్డ్ థెరపీలు, నేచురోపతిక్ హీలింగ్ పద్ధతులు, చర్మం, జుట్టు, శరీర సంరక్షణ ఆచారాలను అందిస్తున్నాం. ఇవన్నీ పెద్దలతో పాటు చిన్నారులకూ పాతకాలం నలుగు సంరక్షణను అందిస్తుందని ఆమె వివరించారు. ఈ ఉత్పత్తుల్లో ఎలాంటి రసాయనాలు లేకుండా నాచురల్ ప్రొడక్ట్స్‌ను మాత్రమే వాడతామని, ఎలాంటి జీవహింస చేయకుండా, పురాతన రహస్యాల నుంచి ఉత్పత్తుల తయారీ ఉంటుందని అన్నారు. పాత పద్ధతులలే అయినప్పటికీ 8 ఏళ్లుగా సైంటిఫిక్ పరిశోధనలు చేపట్టి, దాదాపు 2 లక్షల మంది వినియోగదారులపై పరీక్షలు చేశాకే అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నగరంలోనే కాకుండా మరి కొద్ది రోజుల్లో గోవా, ఫోర్ట్ కొచ్చి, చెన్నైలలో ప్రారంభించనున్నామని అన్నారు.





తాజ్ డెక్కన్‌లో మెగా ఎగ్జిబిషన్

షాపింగ్ ప్రియులను ఆకట్టుకునేందుకు భారీ ఆఫర్లతో స్టార్ హోటల్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం కానుంది. మార్కెట్‌లో ఉన్న అనేక బ్రాండెడ్ దుస్తులు, ఫుట్ వేర్, మహిళల మనసు దోచుకునే హ్యాండ్ బ్యాగ్స్, బెడ్ షీట్లు, మరెన్నో రకాల వస్తువులన్నీ ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. అంతేకాదు ఏకంగా 70 శాతం రాయితీ ఇస్తున్నామని నిర్వాహకులు ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో ఆగస్టు 3 నుంచి 6వ తేదీ వరకూ అందుబాటులో ఉండనుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ షాపింగ్ చేసుకోవచ్చు. ఈ ఎగ్జిబిషన్ ఎంట్రీ ఉచితం. –సాక్షి, సిటీబ్యూరో

సాక్షి బిజినెస్
బుధవారం
31-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	99	81,455
నిఫ్టీ ▲	21	24,857

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,131	▽ 239
డోజోన్స్	40,646	▲ 106
ఎఫ్‌టీఎస్ఈ 100	8,274	▽ 18
డాక్స్	18,411	▲ 91
షాంఘై	2,879	▽ 13
నికాయ్	38,526	▲ 57

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	67,310
బంగారం (22 క్యారెట్లు)	64,100
వెండి (కేజీ)	89,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.47	109.04
€	యూరో	ఎస్‌బీఐ	89.53	91.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.82	55.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.95	55.88
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.00	64.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.66	12.48

మాజీ సైనికులకు కార్పొరేట్ 'సెల్యూట్'!



రక్షణ దళాల్లో పనిచేసి రిటైర్ అయిన మాజీ సైనికోద్యోగులకు కార్పొరేట్ కంపెనీలు రారమ్మంటూ రెడ్ కార్పెట్ వేస్తున్నాయి. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా అలవోకగా పని చేసే శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ప్రాజెక్టుల అమలులో కచ్చితత్వం వంటి ప్రత్యేక నైపుణ్యాలను ఉపయోగించుకోవడంపై ఫోకస్ చేస్తున్నా యి. కొన్ని విభాగాల్లో నిపుణుల కొరతను అధిగమిస్తున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- రక్షణ దళాల మాజీ సిబ్బందికి కంపెనీల రెడ్ కార్పెట్
- నిపుణుల కొరతకు చెక్
- శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ బలం
- జాబితాలో టాటా, రిలయన్స్, మారుతీ, ఓఎన్‌జీసీ తదితర దిగ్గజాలు

దేశంలో మాజీ సైనికుల వెంట పడుతున్న టాప్ కంపెనీలు, బడా కార్పొరేట్ సంస్థల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అతిపెద్ద కార్పొరేట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఏకంగా 2,000 మంది మాజీ సైనికోద్యోగులను నియమించుకుంది. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య మూడో వంతు ఎక్కువ. దీంతో ఈ కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో రక్షణ దళాల మాజీ సిబ్బంది 7,500 మందికి ఎగబాకారు. ఇంత భారీ సంఖ్యలో ఎక్స్‌–సర్వీస్‌మెన్ ఉన్న కంపెనీగా కూడా రిలయన్స్ రికార్డు సృష్టించింది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం టాటా గ్రూప్ కంపెనీలు, మారుతీతో పాటు అదానీ గ్రూప్, ఆర్‌పీజీ గ్రూప్, వేదాంత, సొడెక్సో, ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ వంటి సంస్థలు సైతం మాజీ సైనిక సిబ్బందిని నియమించుకుంటున్న జాబితాలో టాప్‌లో ఉన్నాయి.

ఏటా 60,000 మంది పదవీ విరమణ...

త్రివిధ దళాల్లో (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఏటా పదవీ విరమణ చేస్తున్న రక్షణ సిబ్బంది సంఖ్య దాదాపు 55,000–60,000 వరకు ఉంటుందని అంచనా. వీరిలో ఆఫీసర్ ర్యాంకుల్లో ఉన్నవారు 1,200–1,300 (సుమారు 2%) మంది వరకు ఉంటారు. అంతేకాకుండా, 50 ఏళ్లు పైబడిన చాలా మంది అధికారులు స్వచ్ఛందంగా రిటైర్ అయ్యేందుకు మొగ్గు చూపుతుండటం విశేషం. ఇలా వైదొలగుతున్న వారిలో ఎక్కువగా రిలయన్స్, అదానీ, ఎల్‌అండ్ టీ, టాటా గ్రూప్ వంటి బడా కార్పొరేట్ కంపెనీల్లో హెచ్‌ఆర్, అడ్మిన్, సరఫరా వ్యవస్థలు ఇతర త్రా విధుల్లో చేరుతున్నారని త్రివిధ దళాల మాజీ సైనికుల సంక్షేమ సంఘం చీఫ్ మెంటార్, పూర్వ అధ్యక్షుడు కమోడోర్ సుధీర్ పరకాల చెబుతున్నారు. సరుకు రవాణా (లాజిస్టిక్స్), ఈ–కామర్స్, వేర్‌–హౌసింగ్ పరిశ్రమతో పాటు ఆటోమొబైల్, తయారీ, విద్యుదుత్పత్తి, టెలికం వంటి రంగాల్లో ఎక్స్‌–సర్వీస్‌మెన్‌కు దండిగా అవకాశాలు లభిస్తున్నాయి. ఇంజనీరింగ్, మెషీన్ విభాగాలు, అడ్మినిస్ట్రేషన్ విధుల్లో ఎక్కువగా నియమించుకుంటున్నాయి.

ప్రత్యేక సామర్థ్యాలు ప్లస్...

మాజీ సైనికోద్యోగులకు అత్యుత్తమ ఫిట్‌నెస్‌కు తోడు క్రమశిక్షణ వంటి ప్రత్యేకతల కారణంగా సంస్థకు అదనపు బలం చేకూరుతోందని రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టులను పక్కాగా అమలు చేసే సామర్థ్యం, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించే నైపుణ్యాలు, ప్రతికూల ప్రదేశాలను తట్టుకుని పని చేసే ధైర్య సాహసాలు... కంపెనీలు ఏరికోరి మరీ వారిని నియమించుకునేలా చేస్తున్నాయన్నారు. దీనివల్ల వైవిధ్యంతో పాటు కొన్ని విభాగాల్లో నిపుణుల కొరత కూడా తీరుతుందనేది హైరింగ్ నిపుణుల మాట. 'రక్షణ దళాల్లో ఏళ్ల తరబడి పని చేసేటప్పుడు అలవడిన క్రమశిక్షణ, వారికి ఇచ్చే కఠోర శిక్షణ కారణంగా మాజీ సైనిక సిబ్బందికి ప్రత్యేక సామర్థ్యాలు అలవడతాయి. ముఖ్యంగా సమస్యల పరిష్కార తీరు, టీమ్ వర్క్, మల్టీ టాస్కింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి విషయాల్లో వారు ఆరితేరి ఉంటారు. అందుకే టాటా, ఆదిత్య బిర్లా, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, వేదాంత గ్రూప్ వంటి బడా కార్పొరేట్లు మాజీ సైనికుల హైరింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాయి' అని సియెల్ హెచ్‌ఆర్ అంటోంది.

ఓఎన్‌జీసీ: కంపెనీ నిబంధనల మేరకు మాజీ సైనికోద్యోగులకు ఎగ్జిక్యూటివ్ స్థాయి నియామకాల్లో 5 ఏళ్ల వయో సడలింపును ప్రకటించింది.

రిలయన్స్: గత ఆర్థిక సంవత్సరంలో 2,000 మంది మాజీ సైనికులను నియమించుకుంది. ఈ సంఖ్య 7,500కు చేరింది.

వేదాంత: రక్షణ దళాల మాజీ సిబ్బంది నియామకం కోసం 2023–24లో ప్రత్యేక పాలసీ చర్యలు చేపట్టింది.

క్వాల్‌కామ్ చౌక 5జీ ఫోన్ చిప్‌సెట్

రూ. 8 వేల లోపునకు ఎంట్రీ లెవెల్ ఫోన్ల ధర



న్యూఢిల్లీ: 5జీ స్మార్ట్‌ఫోన్ల ధరలను మరింత తగ్గించేందుకు తోడ్పడేలా భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా స్నాప్‌డ్రాగన్ 4ఎస్ జెన్2 చిప్‌సెట్‌ను ప్రవేశపెట్టినట్లు క్వాల్‌కామ్ వెల్లడించింది. ఎంట్రీ లెవెల్ స్థాయి హ్యాండ్‌సెట్ల కోసం డిజైన్ చేసిన ఈ చిప్‌తో స్మార్ట్‌ఫోన్ల ధరలు 99 డాలర్ల (సుమారు రూ.8,300) లోపు స్థాయికి తగ్గే అవకాశం ఉందని 'స్నాప్‌డ్రాగన్ ఫర్ ఇండియా' కార్యక్రమంలో కంపెనీ తెలిపింది. ఐడీసీ డేటా ప్రకారం ప్రస్తుతం దేశీయంగా అత్యంత తక్కువకు లభించే 5జీ ఫోన్ రేటు రూ. 9,999గా ఉంది. ఈ చిప్‌సెట్‌ను ముందుగా షావోమీ తదితర బ్రాండ్లు ఉపయోగించనున్నట్లు క్వాల్‌కామ్ తెలిపింది. ఇతర సంస్థలతో కూడా చర్చలు జరుగుతున్నాయని వివరించింది. ఈ చిప్‌సెట్‌తో తయారు చేసే తొలి డివైజ్‌ను ఈ ఏడాది ఆఖరు నాటికి ప్రకటించే అవకాశం ఉందని తెలిపింది. దీన్ని భారత మార్కెట్ కోసం దేశీయంగా డిజైన్ చేసి, అభివృద్ధి చేసినట్లు క్వాల్‌కామ్ ఇండియా ప్రెసిడెంట్ సవి సోయిన్ తెలిపారు. కార్యక్రమం సందర్భంగా భారత మార్కెట్ కోసం ఉద్దేశించిన స్నాప్‌డ్రాగన్ ఎక్స్ సిరీస్ చిప్‌సెట్లను కంపెనీ ఆవిష్కరించింది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..

పసిడి డిమాండ్‌కు ధరల చెక్	4 ఐపీవోలకు సెబీ గ్రీన్‌సిగ్నల్

గ్లోబల్ ఇన్వెస్టర్ల చూపు.. భారత్ వైపు!



ఈ సువర్ణావకాశాన్ని వదులుకోవద్దు.. ● భారత కార్పొరేట్లకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేలా భారత్ పరుగులు తీస్తోందని.. దీంతో ప్రపంచ స్థాయి దిగ్గజ ఇన్వెస్టర్లందరూ భారత్‌లో పెట్టుబడులకు ఉవ్విళ్లూరుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత కార్పొరేట్లు ఈ 'వికసిత్ భారత్ ప్రస్థానంలో సువర్ణావకాశాన్ని అందిపుచ్చుకోవాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. బడ్జెట్ తదనంతరం భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్ దిశగా పయనం' సదస్సునుద్దేశించి మోదీ ప్రసంగించారు. 'నేడు ప్రపంచమంతా భారత్ వృద్ధితో పాటు మీ (పారిశ్రామిక వర్గాలు) వైపే చూస్తోంది. ప్రపంచ ప్రగతికి భారత్ మూల స్తంభంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధంగా ఉన్నారు. ప్రపంచ నాయకుల్లో సైతం భారత్ పట్ల పూర్తి ఆశావాదం నెలకొంది. భారతీయ పారిశ్రామిక రంగానికి ఇదో సువర్ణావకాశం, దీన్ని మనం వదులుకోకూడదు' అని మోదీ చెప్పారు.

వృద్ధి జోరు.. ధరలకు కళ్లెం

ప్రపంచమంతా అధిక ద్రవ్యోల్బణం, వృద్ధి మందగమనంతో పాటు భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో వృద్ధి జోరు ద్రవ్యోల్బణానికి కళ్లెం వేయడం ద్వారా భారత్ వృద్ధి, స్థిరత్వాలకు దిక్సూచిగా నిలుస్తోందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఇప్పుడు 8 శాతం జీడీపీ వృద్ధితో పురోగమిస్తోంది. దీన్ని ప్రకారం చూస్తే, ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ప్రస్తుత ఐదో స్థానం నుంచి మూడో ర్యాంకుకు చేరుకునే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. ఈ ఘనతను తన మూడో విడత హయాంలోనే సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. '5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం, సంతృప్త స్థాయి విధానం, జీరో ఎఫెక్ట్–జీరో డిఫెక్ట్, ఆత్మనిర్భర్ భారత్ లేదా వికసిత్ భారత్ ప్రతిజ్ఞ అనేవి నేషన్ ఫస్ట్ విషయంలో మా నిబద్ధతకు నిదర్శనం' అని మోదీ వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, వర్ధమాన రంగాల్లో ప్రపంచ శక్తిగా నిలిపేందుకు దేశీ పారిశ్రామిక రంగం ప్రభుత్వంతో పోటీ పడాలని చెప్పారు.

ఉద్యోగ కల్పనపైనే బడ్జెట్లో దృష్టి...

కోట్లాదిగా ఉద్యోగాలిచ్చే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)ను ప్రోత్సహించేందుకు బడ్జెట్లో పలు చర్యలు తీసుకున్నామని మోదీ గుర్తు చేశారు. ఇండస్ట్రీ 4.0 ప్రమాణాల మేరకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించిందన్నారు. భారత్ 1.4 లక్షల స్టార్టప్‌లకు నిలయం. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా వంటి స్కీమ్‌లతో 8 కోట్ల మంది కొత్త వ్యాపారాలను మొదలుపెట్టారని చెప్పారు. 4 కోట్ల మంది యువతకు మేలు చేకూర్చేలా రూ.2 లక్షల కోట్లతో పీఎం ప్యాకేజీని బడ్జెట్లో ప్రకటించామన్నారు. దేశంలోని 100 జిల్లాల్లో పెట్టుబడులకు సిద్ధంగా ఉండే ఇన్వెస్ట్‌మెంట్ పార్కులను నెలకొల్పనున్నామని, ఈ 100 నగరాలు వికసిత్ భారత్‌లో నయా కేంద్రాలుగా ఆవిర్భవించనున్నట్లు ప్రధాని తెలిపారు.

ఐవోసీ లాభం పతనం

క్యూ1లో రూ. 2,643 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 81 శాతం పడిపోయి రూ. 2,643 కోట్లకు పరిమితమైంది. రిఫైనరీ, మార్కెటింగ్ మార్జిన్లు క్షీణించడానికితోడు, తక్కువ ధరల్లో ఎల్‌పీజీ అమ్మకాలు(అండర్ రికవరీ) ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 13,750 కోట్లకుపైగా ఆర్జించింది. ఈ కాలంలో రూ. 5,156 కోట్లమేర ఎల్‌పీజీ సబ్సిడీ అందలేదని కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం దాదాపు ఫ్లాట్‌గా రూ. 2.15 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రతీ బ్యారల్ చమురు శుద్ధిపై స్థూల మార్జిన్లు(జీఆర్‌ఎం) 6.39 డాలర్లుగా నమోదయ్యాయి. గత క్యూ1లో 8.34 జీఆర్‌ఎం సాధించింది.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు 1.6% లాభంతో రూ. 183 వద్ద ముగిసింది.

మూడోరోజూ ముందుకే..



అమ్మకాల ఒత్తిడితో సూచీల లాభాలు పరిమితం

ముంబై: ఇంధన, ఆటో షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మూడో రోజూ ముందడుగేశాయి. సెన్సెక్స్ 99 పాయింట్లు పెరిగి 81,455 వద్ద, నిఫ్టీ 21 పాయింట్లు లాభపడి 24,857 వద్ద జీవితకాల గరిష్టస్థా యిలో ముగిశాయి. అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫ్లాట్‌గా మొదలైన సూచీలు ప్రథమార్ధంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. మిడ్ సెషన్ తర్వాత అమ్మకాల ఒత్తిడి నుంచి తేరుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 459 పాయింట్లు బలపడి 81,815 వద్ద, నిఫ్టీ 136 పాయింట్లు ఎగసి 24,972 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. చివర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడడంతో పరిమిత లాభాలతో ముగిశాయి. మూడు రోజుల జోరుతో రూ.3.98 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం ఆల్‌టైం హై రూ. 460.91 లక్షల కోట్లకు చేరింది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏఆర్‌సీఐ, హైదరాబాద్‌లో 15 పోస్టులు

హైదరాబాద్ బాలాపూర్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ).. అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్–05, టెక్నికల్ అసిస్టెంట్–07, టెక్నీషియన్–03.
» విభాగాలు: వెల్డర్,టర్నర్,ఎలక్ట్రీషియన్,సివిల్,మెకానికల్, మెటలర్జీ,హెచ్‌ఆర్,ఫైనాన్స్,స్టోర్స్,సెక్రటేరియట్ వర్క్స్, కెమిస్ట్రీ.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: అసిస్టెంట్, టెక్నీషియన్ పోస్టులకు 28 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: అసిస్టెంట్ పోస్టుకు రూ.57,960, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.69,120, టెక్నీషియన్ పోస్టుకు రూ.51,300
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 26.08.2024.
» రాతపరీక్ష తేది: 22.09.2024. » పరీక్ష కేంద్రం:హైదరాబాద్
» ట్రేడ్/స్కిల్ టెస్ట్: 06.10.2024.
» వెబ్‌సైట్: http://www.arci.res.in

ఎస్‌బీఐ బ్యాంక్‌లో స్పోర్ట్స్ కోటాలో 68 ఆఫీసర్/క్లరికల్ స్టాఫ్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ).. స్పోర్ట్స్ కోటాలో ఆఫీసర్/క్లరికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 68.
» పోస్టుల వివరాలు: ఆఫీసర్–17, క్లరికల్ స్టాఫ్–51.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడల్లో సాధించిన సర్టిఫికెట్లు కలిగి ఉండాలి.» వయసు: ఆఫీసర్ పోస్టుకు 30 ఏళ్లు, క్లరికల్ పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు ఆఫీసర్ పోస్టుకు రూ.85,920, క్లరికల్ స్టాఫ్ పోస్టుకు రూ.64,480.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ప్రాక్టికల్ అసెస్‌మెంట్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 24.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 14.08.2024
» వెబ్‌సైట్: https://bank.sbi/careers

ఏపీ హైకోర్టులో 12 లా క్లర్క్ పోస్టులు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒప్పంద ప్రాతిపదికన లా క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 12
» అర్హత: న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థి ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లోనూ అడ్వకేట్‌గా నమోదు చేసుకుని ఉండకూడదు.
» వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు రూ.35,000.
» ఎంపిక విధానం: విద్యార్హత, వైవా వాయిస్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్(రిక్రూట్‌మెంట్), హైకోర్టు ఆఫ్ ఏపీ, అమరావతి, నేలపాడు, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 06.08.2024.
» వెబ్‌సైట్: https://aphc.gov.in

హెవీ వెహికల్ ఫ్యాక్టరీ, చెన్నైలో అప్రెంటిస్‌లు

చెన్నైలోని అవడిలో హెవీ వెహికల్ ఫ్యాక్టరీలో గ్రాడ్యుయేట్, డిప్లొమా, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరిలో పనిచేయాల్సి ఉంటుంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 320
» ఖాళీల వివరాలు:
» కేటగిరీ–1: విభాగాల వారీగా ఖాళీలు: మెకానికల్ ఇంజనీరింగ్–50, ఎలక్ట్రికల్ -ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–30, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ –07, సివిల్ ఇంజనీరింగ్–05, ఆటోమొబైల్ ఇంజనీరింగ్–18.
» కేటగిరీ–2: విభాగాల వారీగా ఖాళీలు: మెకానికల్ ఇంజనీరింగ్–50, ఎలక్ట్రికల్–ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–30, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–07, సివిల్ ఇంజనీరింగ్–05, ఆటోమొబైల్ ఇంజనీరింగ్–18.
» కేటగిరీ–3:నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–100
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్, బీఏ/బీఎస్సీ/బీకాం /బీబీఏ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» స్టైపెండ్: నెలకు ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లకు రూ.9000, డిప్లొమా ఇంజనీర్ అప్రెంటిస్‌లకు రూ.8000.
» ఎంపిక విధానం:విద్యార్హత,షార్ట్‌లిస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 29.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.08.2024.
» ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది: 26.08.2024.
» సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు:09.09.2024 నుంచి 11.09.2024
» వెబ్‌సైట్: http://www.boatsrp.com

టెట్‌కి సిద్ధమవ్వండిలా!

ఆంధ్రప్రదేశ్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో బీఈడీ, డీఈడీ తదితర ఉపాధ్యాయ విద్య కోర్సులు పూర్తి చేసిన వారు టెట్‌కు సన్నద్ధత ప్రారంభించారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే.. డీఎస్సీకి అర్హత లభిస్తుంది. టెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు ఉంటుంది. ఈ నేపథ్యంలో.. ఏపీ టెట్ పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఏపీ టెట్ 2024

- అక్టోబర్ 3 నుంచి టెట్ పరీక్షలు

టెట్.. నాలుగు పేపర్లు

- ఏపీ టెట్‌ను పేపర్–1ఎ,1బి,పేపర్–2ఎ, 2బిల పేరుతో మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. బోధన తరగతుల వారీగా అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించాల్సిన విధంగా ఈ పేపర్లను వర్గీకరించారు.
- పేపర్–1ఎ: 1–5వ తరగతి వరకు ఉపాధ్యాయులకు అవసరమైన పరీక్ష.
- పేపర్–1బి: 1–5వ తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌కు అవసరమైన పరీక్ష.
- పేపర్–2ఎ: 6 నుంచి 8వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌గా బోధించాలనుకునే వారు ఉత్తీర్ణత సాధించాల్సిన పేపర్.
- పేపర్–2బి: 6 నుంచి 8వ వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారు హాజరు కావల్సిన పరీక్ష.

అర్హతలివే

పేపర్‌ను బట్టి ఇంటర్మీడియెట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతోపాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ తత్సమాన అర్హతలు ఉండాలి. ప్రస్తుత విద్యాసంవత్సరం చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులూ దరఖాస్తుకు అర్హులే.

పరీక్ష విధానాలు

- పేపర్–1ఎ, 1బి: పేపర్–1ఎ,పేపర్–1బిలను 5 విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి; లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2 (ఇంగ్లిష్), మ్యాథమెటిక్స్; ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150ప్రశ్నలు అడుగుతారు.ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.లాంగ్వేజ్–1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.

పేపర్–2ఎ

- ఈ పేపర్‌లో నాలుగు విభాగాలు (చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు– 30 మార్కులు); లాంగ్వేజ్–1 (30 ప్రశ్నలు–30 మార్కులు); లాంగ్వేజ్–2 ఇంగ్లిష్ (30 ప్రశ్నలు–30 మార్కులు); సంబంధిత సబ్జెక్ట్ (60 ప్రశ్నలు–60 మార్కులు)గా పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని, లాంగ్వేజ్ టీచర్లు సంబంధిత లాంగ్వేజ్‌ను ఎంచుకుని పరీక్ష రాయాలి. అదే విధంగా సబ్జెక్ట్ పేపర్‌లో మ్యాథమెటిక్స్‌లో.. 24 కంటెంట్– 6 పెడగాజి ప్రశ్నలు ఉంటాయి. సైన్స్ సబ్జెక్ట్‌లో.. ఫిజికల్ సైన్స్ నుంచి 12 ప్రశ్నలు, బయలాజికల్ సైన్స్ నుంచి 12 ప్రశ్నలు చొప్పున కంటెంట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. మిగతా 3 ప్రశ్నలు సైన్స్ పెడగాజి నుంచి ఉంటాయి. సోషల్ విభాగంలో 48 కంటెంట్ ప్రశ్నలు–12 పెడగాజి ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ సబ్జెక్ట్ మెథడాల జీకి సంబంధించి 48 కంటెంట్–12 పెడగాజి ప్రశ్నలు ఉంటాయి.

పేపర్–2బి

- పేపర్–2బిని కూడా పేపర్–2ఎ మాదిరిగా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. మొదటి మూడు విభాగాలు పేపర్–2ఎ లోవే ఉంటాయి. నాలుగో విభాగంగా మాత్రం డిజేబిలిటీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్ అండ్ పెడగాజి ఉంటుంది. ఈ విభాగంలో 60 మార్కులకు 60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాలు కలిపి 150 ప్రశ్నలతో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- నాలుగో విభాగంలో అభ్యర్థులు తాము స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆ సబ్జెక్ట్ నుంచి 48 కంటెంట్, 12 పెడగాజి ప్రశ్నలు అడుగుతారు.

టెట్ పరీక్షలో రాణించేలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

శిశువు మనస్తత్వం సంబంధిత అంశాలపై దృష్టి పెట్టాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు;శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు; ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం– నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి.

లాంగ్వేజ్

లాంగ్వేజ్–1లో అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలో.. అదే విధంగా లాంగ్వేజ్ -2గా పేర్కొన్న ఇంగ్లిష్‌లో భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుంచి నుంచి అయిదో తరగతి వరకు; ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, సమకాలీన అంశాలపైనా దృష్టి పెట్టాలి.

- సైన్స్: ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్–2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై దృష్టిపెట్టాలి.
- సోషల్ స్టడీస్: హైస్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ఒక అంశానికి సంబంధించి అన్ని కోణాల్లోనూ చదవాలి.
- మెథడాలజీ: ఈ విభాగంలో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి.

టెట్‌తోపాటే డీఎస్సీకి ప్రిపరేషన్

- టెట్‌తోపాటు డీఎస్సీకి సమాంతర ప్రిపరేషన్ సాగించడం మేలు. అందుకోసం ఎస్‌జీటీ అభ్యర్థులు జీకే, కరెంట్ అఫైర్స్ సిలబస్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి. భౌగోళిక నామాలు, నదీతీర నగరాలు, దేశాలు–రాజధానులు, ప్రపంచంలో తొలి సంఘటనలు, అవార్డులు, సదస్సులు, వార్తల్లో వ్యక్తులు, బడ్జెట్, అంతర్జాతీయ రాజకీయ అంశాలు, శాస్త్రసాంకేతిక అంశాలు తెలుసుకోవాలి.
- అదే విధంగా విద్యా దృక్పథాలు; విద్యా మనోవిజ్ఞాన శాస్త్రంపై పూర్తి అవగాహన పొందాలి. కంటెంట్‌కు సంబంధించి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి.

ఏపీ టెట్ ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఆగస్ట్ 3
- హాల్ టికెట్ డౌన్‌లోడ్: 2024, సెప్టెంబ్ 22 నుంచి
- టెట్ తేదీలు: 2024, అక్టోబర్ 3 నుంచి 20 వరకు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://aptet.apcfss.in

7 నెలల గర్భవతిగా ఫెన్సింగ్ బరిలోకి దిగి...

ఈజిప్ట్ ఫెన్సర్ నదా హాఫెజ్ ప్రిక్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లడంతో సఫలమైంది. గతంలో రెండుసార్లు ఒలింపిక్స్ బరిలోకి దిగి విఫలమైన ఆమె తన మూడో ప్రయత్నంలో పారిస్ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. అయితే ఇందులో విశేషం ఏమీ లేదు. కానీ నదా ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి! ఇలాంటి స్థితిలో ఆమె ఫెన్సింగ్ సాబెర్ ఈవెంట్‌లో పోటీ పడింది. మెడిసిన్‌లో డిగ్రీ చదవడంతో పాటు జిమ్నాస్ట్ కూడా అయిన నదా ఆఫ్రికా క్రీడల్లో చాంపియన్. ఒలింపిక్స్ ప్రిక్వార్టర్స్‌లో ఓటమి తర్వాత ఆమె ఈ విషయాన్ని వెల్లడించింది. 'నా కడుపులో ఒక చిన్న ఒలింపియన్ కూడా పెరుగుతోంది. నేను, నా పాప శారీరకంగా, మానసికంగా ఒకే రకమైన సవాల్‌ను ఎదుర్కొన్నాం. గర్భవతిగా ఉండి ఇలా ఆడటం చాలా కష్టమైన విషయం. అయితే జీవితాన్ని, ఆటను సమంగా చూడగలిగినందుకు నేను సంతోషంగా ఉన్నా. ప్రిక్వార్టర్స్ వరకు చేరడం పట్ల గర్వపడుతున్నా' అని నదా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.



క్వార్టర్ ఫైనల్లో భారత హాకీ జట్టు

ఐర్లాండ్‌పై 2–0 గోల్స్ తేడాతో విజయం



పారిస్: గత ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి... పూర్వవైభవాన్ని గుర్తు చేసిన భారత పురుషుల హాకీ జట్టు.. 'పారిస్' గేమ్స్‌లోనూ అదే జోరు కొనసాగిస్తోంది. పూల్ 'బి'లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత హాకీ జట్టు 2–0తో ఐర్లాండ్‌ను ఓడించింది. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక 'డ్రా' నమోదు చేసుకున్న టీమిండియా 7 పాయింట్లతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మంగళవారం ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (13వ, 19వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో సత్తా చాటాడు. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు రాగా.. అందులో కేవలం ఒక్క దాన్ని మాత్రమే గోల్‌గా మలచగలిగింది. మరోవైపు ఐర్లాండ్ 10 పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసింది. తొలి రెండు క్వార్టర్స్‌లో ఒక్కో గోల్ చేసిన టీమిండియా... ద్వితీయార్ధంలో గోల్ కొట్టలేకపోయింది. మన డిఫెండర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చగా.. గోల్ కీపర్ శ్రీజేశ్ అడ్డుగోడలా నిలిచి ప్రత్యర్థి ప్రయత్నాలను భగ్నం చేశాడు. గ్రూప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఐర్లాండ్ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. రెండు గ్రూప్‌ల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్‌కు చేరుతాయి. తదుపరి మ్యాచ్‌లో గురువారం బెల్జియంతో భారత్ తలపడనుంది.

అమిత్, జైస్మిన్ అవుట్



పారిస్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లు నిరాశ పరిచారు. పురుషుల 51 కేజీల విభాగంలో తొలి రౌండ్‌లో 'బై' దక్కించుకున్న అమిత్ పంఘాల్ మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 1-4తో పాట్రిక్ చిన్‌యెంబా (జాంబియా) చేతిలో ఓటమి చవిచూశాడు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ బరిలోకి దిగిన తొలి బౌట్‌లోనే నిష్క్రమించిన అమిత్ ఈసారి కూడా అదే ప్రదర్శన పునరావృతం చేశాడు. మహిళల 57 కేజీల విభాగం తొలి రౌండ్‌లో జైస్మిన్ (భారత్) 0-5తో నెస్తీ పెటిసియో (ఫిలిప్పీన్స్) చేతిలో ఓడిపోయింది.

గ్రూప్ 'టాపర్'గా సాత్విక్–చిరాగ్ జోడీ



భారీ అంచనాలతో విశ్వక్రీడల బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట.. అందుకు తగ్గట్లే వరుస విజయాలతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ గ్రూప్ 'సి'మ్యాచ్‌లో మూడో సీడ్ సాత్విక్–చిరాగ్ జోడీ 38 నిమిషాల్లో 21-13, 21-13తో ఫజర్–రియాన్ (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్న ఈ రెండు జోడీలు గ్రూప్ విజేత స్థానం కోసం పోటీ పడ్డాయి. గ్రూప్ దశలో మిగిలిన మ్యాచ్‌లు ముగిసిన అనంతరం బుధవారం క్వార్టర్ ఫైనల్ 'డ్రా' విడుదల కానుంది. ఇక మహిళల డబుల్స్ గ్రూప్ 'సి'లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జంట వరుసగా మూడో పరాజయంతో ఒలింపిక్స్ నుంచి విజయం లేకుండానే నిష్క్రమించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో అశ్విని–తనీషా జంట 15-21, 10-21తో మాపసా–ఏంజెలా (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓడింది. కాగా, ఇవే తన చివరి ఒలింపిక్ క్రీడలని 34 ఏళ్ల అశ్విని పొన్నప్ప ప్రకటించింది.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	జపాన్	7	2	4	13
2	చైనా	6	6	2	14
3	ఫ్రాన్స్	5	8	4	17
4	ఆస్ట్రేలియా	5	4	0	9
5	దక్షిణ కొరియా	5	3	3	11
6	అమెరికా	4	8	10	22
7	బ్రిటన్	3	5	3	11
32	భారత్	0	0	2	2

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

రెండో రౌండ్‌లోనే ధీరజ్ ఓటమి



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. ఇప్పటికే పురుషుల టీమ్ విభాగంలో ఆకట్టుకోలేకపోయిన ధీరజ్.. వ్యక్తిగత విభాగంలో హోరాహోరీగా పోరాడి వెనుదిరిగాడు. మంగళవారం పురుషుల తొలి రౌండ్‌లో ధీరజ్ 7-1తో ఆడమ్ లీ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు. అనంతరం రెండో రౌండ్‌లో చివరి వరకు పోరాడిన ధీరజ్ 5-6తో ఎరిక్ పీటర్స్ (కెనడా) చేతిలో ఓడాడు. ఐదు సెట్‌ల తర్వాత ఇద్దరూ 5-5తో సమంగా నిలిచారు. దాంతో 'షూట్ ఆఫ్' నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లో ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేశారు. అయితే ధీరజ్ కొట్టిన బాణం కంటే కెనడా ప్లేయర్ కొట్టిన బాణం కేంద్ర బిందువుకు సమీపంగా ఉండటంతో కెనడా ప్లేయర్‌ను విజేతగా ప్రకటించారు. మహిళల విభాగంలో భారత్ ఆర్చర్ భజన్ కౌర్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో భజన్ 7-3తో సిఫా (ఇండోనేసియా)పై గెలిచింది. అనంతరం రెండో రౌండ్‌లో 6-0తో మజర్ (పోలాండ్)పై నెగ్గింది. భారత్‌కే చెందిన అంకిత తొలి రౌండ్‌లో 4-6తో వియోలెటా (పోలాండ్) చేతిలో ఓడిపోయింది.

భారత్ 'సూపర్' క్లీన్‌స్వీప్



- రింకూ సింగ్, సూర్యకుమార్ స్పిన్ మ్యాజిక్‌తో మ్యాచ్ 'టై'
- సూపర్ ఓవర్లో టీమిండియా గెలుపు
- చేజేతులా ఓడిన శ్రీలంక
- 2 నుంచి వన్డే సిరీస్

పల్లెకెలె: భారత్ బ్యాటింగ్‌లో మాత్రమే చెత్తగా ఆడింది. కానీ శ్రీలంక మొత్తానికే చెత్త చెత్తగా ఆడి చేజేతులా ఓడింది. మరోవైపు ఓటమి ఖాయమైన మ్యాచ్‌లో టీమిండియా సూపర్ ఓవర్లో గెలిచి టి20 సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (37 బంతుల్లో 39; 3 ఫోర్లు) కుదురుగా ఆడాడు. తీక్షణ 3, హసరంగ 2 వికెట్లు తీశారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక కూడా సరిగ్గా 20 ఓవర్లలో 8 వికెట్లు 137 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయ్యింది. కుశాల్ పెరీరా (34 బంతుల్లో 46; 5 ఫోర్లు), కుశాల్ మెండిస్ (41 బంతుల్లో 43; 3 ఫోర్లు) రాణించారు. వాషింగ్టన్ సుందర్ వేసిన సూపర్ ఓవర్లో శ్రీలంక 3 బంతులాడి 2 వికెట్లు కోల్పోయి 2 పరుగులే చేసింది. 3 పరుగుల లక్ష్యాన్ని తొలి బంతికే బౌండరీతో భారత్ అధిగమించింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆగస్టు 2న మొదలవుతుంది.

డ్రామా మొదలైందిక్కడే...

లంక 15 ఓవర్లలో 108/1 స్కోరు చేసింది. చేతిలో 9 వికెట్లున్న లంక 30 బంతుల్లో 30 పరుగులు చేస్తే సరిపోతుంది. రవి బిష్ణోయ్ 16వ ఓవర్లో కుశాల్ మెండిస్‌ను అవుట్ చేస్తే, 17వ ఓవర్లో సుందర్... హసరంగ (3), అసలంక (0)లను పెవిలియన్ చేర్చాడు. 18వ ఓవర్లో ఏకంగా 11 బంతులేసిన ఖలీల్ 12 పరుగులిచ్చాడు. 12 బంతుల్లో 9 పరుగుల సమీకరణం లంకకే అనుకూలంగా ఉండగా... రింకూ సింగ్ 19వ ఓవర్లో 3 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. ప్రధాన బౌలర్ సిరాజ్‌ను పక్కనబెట్టి ఆఖరి ఓవర్ వేసిన సూర్యకుమార్ 2 వికెట్లు తీసి 5 పరుగులే ఇచ్చాడు. అంతే మ్యాచ్ 'టై' అయ్యింది.

నిర్లక్ష్యంగా బ్యాటింగ్

ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఒకవేళ విఫలమైఉంటే భారత్ వంద పరుగులు కూడా దాటేది కాదు. ఎందుకంటే అప్పటికే యశస్వి జైస్వాల్ (10), సంజూ సామ్సన్ (0), రింకూ సింగ్ (1) అవుటవడంతో 14 పరుగులకే 3 వికెట్లు, కాసేపటికే కెప్టెన్ సూర్యకుమార్ (8), శివమ్ దూబే (13) పెవిలియన్ చేరడంతో 48కే సగం వికెట్లు కూలాయి. ఈ దశలో గిల్... రియాన్ పరాగ్ (18 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో కలిసి జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. తర్వాత వాషింగ్టన్ సుందర్ (18 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) చేసిన స్కోరుతో భారత్ ఆమాత్రం స్కోరు చేసింది.

తీరుమారని లంక

లంక లక్ష్యం చేరేందుకు టాప్–3 బ్యాటర్లు నిసాంక (27 బంతుల్లో 26; 5 ఫోర్లు), కుశాల్ మెండిస్, పెరీరా చక్కని బాటవేశారు. 15.1 ఓవర్లలో లంక 110/1 స్కోరుతో పటిష్టంగా నిలిచింది. మరుసటి బంతికి మెండిస్ అవుటయ్యాక ఒక్కసారిగా పరిస్థితి మారింది. హసరంగ (3), అసలంక (0), పెరీరా, రమేశ్ మెండిస్ (3), తీక్షణ (0)ఇలా 22 పరుగుల వ్యవధిలో 7 వికెట్లను పారేసుకోవడంతో ఛేదించే స్కోరును సమం చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తీక్షణ 10; గిల్ (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) హసరంగ 39; సామ్సన్ (సి) హసరంగ (బి) విక్రమసింఘే 0; రింకూ సింగ్ (సి) పతిరణ (బి) తీక్షణ 1; సూర్యకుమార్ (సి) హసరంగ (బి) ఫెర్నాండో 8; శివమ్ దూబే (సి) కుశాల్ మెండిస్ (బి) రమేశ్ 13; పరాగ్ (సి) రమేశ్ (బి) హసరంగ 26; సుందర్ (బి) తీక్షణ 25; రవి బిష్ణోయ్ (నాటౌట్) 8; సిరాజ్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-11, 2-12, 3-14, 4-30, 5-48, 6-102, 7-105, 8-137, 9-137. **బౌలింగ్:** విక్రమసింఘే 4-0-17-1, తీక్షణ 4-0-28-3, ఫెర్నాండో 2-0-11-1, రమేశ్ 3-0-26-1, హసరంగ 4-0-29-2, కమిందు 3-0-24-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) పరాగ్ (బి) రవి బిష్ణోయ్ 26; కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 43; పెరీరా (సి అండ్ బి) రింకూ సింగ్ 46; హసరంగ (సి) బిష్ణోయ్ (బి) సుందర్ 3; అసలంక (సి) సామ్సన్ (బి) సుందర్ 0; రమేశ్ (సి) గిల్ (బి) రింకూ సింగ్ 3; కమిందు (సి) రింకూ సింగ్ (బి) సూర్య 1; విక్రమసింఘే (నాటౌట్) 4; తీక్షణ (సి) సామ్సన్ (బి) సూర్య 0; ఫెర్నాండో (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-58, 2-110, 3-117, 4-117, 5-129, 6-132, 7-132, 8-132. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-28-0, సిరాజ్ 3-0-11-0, సుందర్ 4-0-23-2, రవి బిష్ణోయ్ 4-0-38-2, పరాగ్ 4-0-27-0, రింకూసింగ్ 1-0-3-0, సూర్యకుమార్ 1-0-5-2.

సినిమా

నిర్మాతల మండలి ఏకపక్ష నిర్ణయం సరికాదు

– నడిగర్ సంఘం



ధనుష్

తమిళ నిర్మాతల మండలి, నడిగర్ సంఘం మధ్య వార్ మొదలైందా? అంటే అలాంటి వాతావరణమే కనిపిస్తోంది. ఇందుకు కారణం నిర్మాతల మండలి తీసుకున్న నిర్ణయాలే. ఈ మండలి ఈ నెల 29న ఒక ప్రకటన విడుదల చేసింది. తమిళ నిర్మాతల మండలి, యాక్టివ్ నిర్మాతల మండలి, డిస్ట్రిబ్యూటర్స్ సంఘం కలిసి నిర్వహించిన సమావేశంలో చేసిన తీర్మానాలను ఆ ప్రకటనలో వెల్లడించారు. ముఖ్యంగా నటీనటులు ముందుగా నటించడానికి అంగీకరించి, అడ్వాన్స్‌లు తీసుకున్న చిత్రాల్లోనే నటించాలని, అదే విధంగా నటీనటుల పారితోషికం, నిర్మాణ వ్యయం వంటి విషయాల గురించి నూతన విధి విధానాలను నిర్ణయించే వరకూ నవంబర్ 1వ తేదీ నుంచి షూటింగ్‌లను నిలిపి వేయాలని నిర్మాతల మండలి నిర్ణయించింది. ఆగస్ట్ 16 తర్వాత కొత్త చిత్రాల ఆరంభానికి అనుమతి లేదని కూడా నిర్మాతల సంఘం పేర్కొంది. అయితే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న చిత్రాల షూటింగ్‌లను అక్టోబర్ 30 లోగా పూర్తి చేయాలని తీర్మానం చేసింది. అలాగే నటుడు ధనుష్ పలువురు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారనీ, అందువల్ల ఆయనతో కొత్త చిత్రాలను నిర్మించే నిర్మా తలు తమిళ నిర్మాతల మండలి నిర్వాహకులతో చర్చించాకే ఆ సినిమా కార్యక్రమాలు మొదలుపెట్టాలనే తీర్మానం చేశారు. కాగా నిర్మాతల మండలి తీర్మానాలపై నడిగర్ సంఘం (దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు నడిగర్ సంఘం (నటీనటుల సంఘం) విడుదల చేసిన పత్రికా ప్రకటనలోని సారాంశం ఈ విధంగా...

తమిళ నిర్మాతల మండలి విడుదల చేసిన ప్రకటనలో నటీనటులకు సంబంధించిన తీర్మానాలు, నటుడు ధనుష్‌కు సంబంధించిన తీర్మానం తమను దిగ్భ్రాంతికి గురి చేశాయని నటీనటుల సంఘం పేర్కొంది. ధనుష్ గురించి ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదు రాలేదని, అకస్మాత్తుగా అతనిపై నిషేధం విధించడం ఏమాత్రం ఆమోదనీయం కాదని కూడా ఆ ప్రకటనలో ఉంది. సమస్యను తమతో చర్చించకుండా తీర్మానించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొంది. రెండు సంఘాలూ కలిసి మాట్లాడుకుని, నిర్ణయం తీసుకోవాల్సిన విషయాన్ని ఏకపక్షంగా నిర్ణయించి, పత్రికా ప్రకటనలా ఇవ్వడం సరి కాదని కూడా నటీనటుల సంఘం అభిప్రాయపడింది. తమిళ సినీ సంఘాల్లో ముఖ్యమైన నటీ నటీనటుల సంఘం నిర్వాహకులను సంప్రదించకుండా వేలాది మంది నటీనటులు, కార్మికుల జీవితాలను బాధించే విధంగా షూటింగ్‌లు నిలిపివేయాలని నిర్మాతల మండలి నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కూడా తాము విడుదల చేసిన నోట్‌లో నటీనటుల సంఘం పేర్కొంది. ఈ ఏక పక్ష తీర్మానాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, ఈ విషయమై దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం కార్యవర్గంతో చర్చించి తగిన చర్యలు గురించి వెల్లడించడం జరుగుతుందని పేర్కొంది.

– సాక్షి, చెన్నై

నిర్మాతల మండలి తీర్మానాన్ని ఖండిస్తున్నాం – కార్తీ



నటీనటుల సంఘం కోశాధికారి, నటుడు కార్తీ మీడియాతో మాట్లాడుతూ – "తమిళ నిర్మాతల మండలి ఏక పక్షంగా చేసిన తీర్మాలను ఖండిస్తున్నాం. ముఖ్యంగా నటుడు ధనుష్ పై ఎలాంటి ఫిర్యాదు లేకున్నా ఆయనపై చర్యలు తీసుకోవాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం" అన్నారు. నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, కార్యదర్శి విశాల్‌లను సంప్రదించాకే పత్రికా ప్రకటన విడుదల చేశామని కూడా కార్తీ పేర్కొన్నారు. అదే విధంగా నడిగర్ సంఘాన్ని సంప్రదించకుండా నిర్మాతల మండలి చేసిన తీర్మానాలను వ్యతిరేకిస్తున్నట్లు నటీనటుల సంఘం ఉపాధ్యక్షుల్లో ఒకరైన కరుణాస్ కూడా పేర్కొన్నారు.

ఆ పొరపాటు చేయను – నిర్మాత మహేశ్వర్ రెడ్డి



"**క**థలో ఊహించని మలుపులు ఉన్న సినిమాలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. 'శివం భజే' కథలో చాలా మలుపులు ఉన్నాయి'' అన్నారు మహేశ్వర్ రెడ్డి. అశ్విన్ బాబు హీరోగా నటించిన చిత్రం 'శివం భజే'. దిగంగనా సూర్యవన్షీ హీరోయిన్‌గా నటించారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ– ''శివం భజే'లో ఐదు జానర్లు ఉన్నాయి. మర్డర్, మిస్టరీ, ఆధ్యాత్మికం, యాక్షన్... ఇలాంటి అంశాలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్‌గా చాలా సినిమాలను పంపిణీ చేశాను. నిర్మాతగా ఇది నా తొలి చిత్రం. ఈ సినిమాపై నాకు నమ్మకం ఉంది కాబట్టే ఇంకా ఓటీటీ, శాటిలైట్ హక్కులు అమ్ముడుపోకుండానే థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. ఇక పెయిడ్ ప్రీమియర్స్ వేయడం అనేది నా దృష్టిలో పొరపాటు. 'శివం భజే' విషయంలో ఆ పొరపాటు చేయను. టికెట్ ధరలు ఎలా ఉన్నా కంటెంట్ బాగుండి, మంచి మౌత్ టాక్ వస్తే ఆ సినిమాను ఆడియన్స్ చూస్తారని నా నమ్మకం'' అని చెప్పుకొచ్చారు.



కల్యాణ్ రామ్

వెయ్యి మందితో ఫైట్

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎన్‌కేఆర్ 21' (వర్కింగ్ టైటిల్) క్లైమాక్స్ షూటింగ్ పూర్తయింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి, సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో ముప్పై రోజుల పాటు క్లైమాక్స్ సన్నివేశాలు చిత్రీకరించారు. ''క్లైమాక్స్ కోసం బ్రహ్మ కడలి అద్భుతమైన సెట్స్‌ని రూపొందించారు. పతాక సన్నివేశాల షూట్‌లో ప్రముఖ తారాగణంతో పాటు దాదాపు వెయ్యి మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ క్లైమాక్స్‌కే రూ. 8 కోట్లు ఖర్చు చేశాం. రామకృష్ణ యాక్షన్ కొరియోగ్రఫీని పర్యవేక్షించారు'' అని యూనిట్ పేర్కొంది.

కొందరు ఇండస్ట్రీని దోచుకుంటున్నారు

– నిర్మాత మల్కాపురం శివకుమార్



రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా హీరో హీరోయిన్లుగా, మన్నారా చోప్రా కీలక పాత్రలో నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ– ''మూడు ముళ్ళ బంధానికి భార్యాభర్తలు ఏ విధంగా కట్టుబడి ఉండాలనడానికి నిదర్శనమే 'తిరగబడర సామీ'. ఓ మామూలు కుర్రాడు ఏ పరిస్థితుల వల్ల వైలెంట్‌గా మారాడు? అనేది కథ. రాజ్ తరుణ్ – మాల్వీల వ్యక్తిగత అంశాలతో ఈ సినిమాకు సంబంధం లేదు. వాళ్లిద్దరి ప్రెజెన్స్‌తో ఓ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నాం. జేడీ చక్రవర్తితో ఓ సినిమా ప్లానింగ్ ఉంది. 'తిరుమల బాలాజీ', 'రాహు కేతు' వెబ్ సిరీస్‌లతో పాటు ఓ హిందీ సినిమా చేస్తున్నాం'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''కొందరు సినిమా ఇండస్ట్రీని దోచుకుంటున్నారు. టికెట్ ధరలను తగ్గించి నిర్మాత జ్ఞానవేల్ రాజా ('బడ్డీ' సినిమా టికెట్ ధర తగ్గించడాన్ని ఉద్దేశించి) రిలీజ్ చేయడాన్ని సపోర్ట్ చేస్తున్నా. నా సినిమాలకు టికెట్ ధరలు పెంచను'' అని చెప్పుకొచ్చారు.

తెలుగు నేర్చుకుని మరీ...

ఉత్తరాది బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే అవలీలగా తెలుగు మాట్లాడారు. 'మిస్టర్ బచ్చన్' సినిమా ద్వారా ఆమె తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలోని తన పాత్రకి తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. ఆమె మాతృభాష తెలుగు కాదు. అయినప్పటికీ కష్టపడి తెలుగు నేర్చుకొని తన పాత్రకు డబ్బింగ్ చెప్పి అందర్నీ సర్‌ప్రైజ్ చేశారామె. ఆమె అంకితభావం ప్రశంసనీయం అని చిత్రబృందం పేర్కొంది. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఆగస్టు 15న రిలీజ్ కానుంది.



భాగ్యశ్రీ

మన చరిత్ర తెలుస్తుంది

– అద్దంకి దయాకర్




అద్దంకి దయాకర్, బొమ్మకు మురళి

''ఇండియా ఫైల్స్' సినిమా చూస్తే అందరికీ మన చరిత్ర తెలుస్తుంది. మానవీయ కోణం అంటే ఏంటో కూడా ఈ సినిమాలో చూపించాం''అన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నటుడు అద్దంకి దయాకర్. బొమ్మకు హిమమాల సమర్పణలో డా. బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఇండియా ఫైల్స్'. అద్దంకి దయాకర్, ఇంద్రజ, 'శుభలేఖ' సుధాకర్, సుమన్ ముఖ్య తారలుగా నటించారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. కాగా సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ 'జై ఇండియా...' అనే పాటకి సంగీతం అందించి, పాడారు. ఈ పాట రిలీజ్ ఈవెంట్‌లో బొమ్మకు మురళి మాట్లాడుతూ– ''గద్దర్ అన్న ఇచ్చిన కథ 'ఇండియా ఫైల్స్'. మనిషి పుట్టుక నుండి ఇప్పటివరకు మన జీవన విధానంలో జరిగిన మార్పులు, సనాతన ధర్మం మన మధ్య ఎలా నడుస్తుంది? మన జీవితాన్ని ఎలా నడిపిస్తుంది? అనేది ఈ మూవీలో చెప్పాను'' అన్నారు. సంగీత దర్శకుడు రాజ్‌కిరణ్, గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'ఆడుజీవితం' (ది గోట్ లైఫ్) ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

జీవితాన్ని చూపిస్తుంది



సినిమాలకు కథలు ఎలా వస్తాయి అనుకుంటే మనలో నుండే. సాధారణ మనుషుల నుండి అసాధారణ చరిత్రకారుల జీవన విధానమే మన సినిమా కథలకు మూలం. ముఖ్యంగా నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ విషయాలను కూడా వెండితెర మీద అసాధారణ రీతిలో ప్రతిబింబిస్తున్నారు మన వర్తమాన దర్శకులు. ఆ కోవలో రిలీజైన సినిమానే బ్లెస్సీ దర్శకత్వం వహించిన 'ఆడుజీవితం'. ప్రముఖ మలయాళ నటుడు పృథ్వీరాజ్ నటించిన ఈ సినిమా ఓ కళాఖండమనే చెప్పాలి. కథ కన్నా ముందు కథానాయకుడి గురించి మాట్లాడుకోవడం చాలా ముఖ్యం. ఎవరైనా సినిమా పాత్రలో ఒదిగిపోవడానికి సాధ్యమైనంత వరకు ఆ పాత్రను ఆపాదించుకుంటారు. కాని ఈ సినిమా కథానాయకుడు పృథ్వీరాజ్ ఈ పాత్రకు ప్రాణం పోశాడు. కథాపరంగా కథానాయకుడు తన స్నేహితుడితో గల్ఫ్ ఎయిర్ పోర్టులో దిగుతాడు. వాళ్లిద్దరూ జీవనోపాధి కోసం ఓ ఏజెంట్ ద్వారా విదేశాలకు వెళతారు. అక్కడి భాష రాకపోవడం వల్ల ఒకడి మోసంతో ఇద్దరూ విడిపోయి ఎడారిలో పని వాళ్ళుగా మారి దుర్భర స్థితిలో మిగిలిపోతారు. తిన డానికి తిండి లేక అతి హీన స్థితిలో అక్కడి నుండి తిరిగి ఎలా ఇండియా వస్తారు అన్నదే సినిమా. ముఖ్యంగా పృథ్వీరాజ్ ఈ సినిమాలో చూపించిన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ సినిమా మొత్తానికి హైలైట్. కాస్త నిడివి ఎక్కువున్నా పృథ్వీరాజ్ తన నటనతో తనతో పాటు మనల్ని తీసుకువెళతాడు. సినిమా అంటే వినోదమే కాదు, వాస్తవానికి ప్రతీక అనేదానికి ఇదో మచ్చు తునక. సినిమాకి కథే కాదు సరైన కథానాయకుడు... ఇంకా సరిగ్గా చెప్పాలంటే పాత్రకి ప్రాణం పోసే పాత్రధారి దొరికినప్పుడు సినిమాని చూసినట్లుండదు, జీవితాన్ని చూసినట్లుంటుంది. మరి ఆ జీవితం చూడాలంటే హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆడుజీవితం' చూసేయండి.

– ఇంటూరు హరికృష్ణ

3 స్వాతంత్య్రం వచ్చాక ఒలింపిక్స్ క్రీడల్లో రెండు పతకాలు సాధించిన మూడో భారత ప్లేయర్ మనూ భాకర్. గతంలో రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్-కాంస్యం; 2012 లండన్-రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో-రజతం; 2020 టోక్యో-కాంస్యం) ఈ ఘనత సాధించారు.

6 ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచిన ఆరో భారతీయ షూటర్‌గా సరబ్‌జోత్ సింగ్ గుర్తింపు పొందాడు. గతంలో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్(డబుల్ ట్రాప్: రజతం -2004 ఏథెన్స్), అభినవ్ బింద్రా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: స్వర్ణం-2008 బీజింగ్), విజయ్ కుమార్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్: రజతం-2012 లండన్), గగన్ నారంగ్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: కాంస్యం -2012 లండన్), మనూ భాకర్ (2024 పారిస్: 2 కాంస్యాలు) ఈ ఘనత సాధించారు.

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలుస్తానని నేను అనుకోలేదు. ఈ అనుభూతి కొత్తగా ఉంది. దేశం తరపున సాధ్యమైనన్ని ఎక్కువ పతకాలు గెలవాలని కోరుకుంటా. టోక్యోలో వైఫల్యం చూశాను కాబట్టి ఆ పతకాల విలువ ఏమిటో నాకు ఇప్పుడు ఇంకా బాగా అర్థమవుతోంది. ప్రస్తుతానికి మరో మెడల్ సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉన్నా. తర్వాతి ఈవెంట్‌లో ఎలా ఆడతానో చెప్పలేను. నా శాయశక్తులా ప్రయత్నిస్తా. ఒకవేళ విఫలమైతే అభిమానులు నిరాశపడరనే అనుకుంటున్నా. నాపై కురుస్తున్న ఈ ప్రేమాభిమానులు ఇలాగే కొనసాగాలి. -మనూ భాకర్



మను మహారాణి

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్యం

సరబ్‌జోత్‌తో కలిసి మూడో స్థానం సొంతం

ఆగస్టు 2న మూడో ఈవెంట్ బరిలో మనూ భాకర్



పారిస్ వేదికగా మంగళవారం భారత మహిళా షూటర్ మనూ భాకర్ కొత్త చరిత్రను లిఖించింది. గతంలో ఏ భారత ప్లేయర్‌కూ సాధ్యంకాని ఘనతను మనూ సాధించి చూపించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా ఈ హరియాణా అమ్మాయి అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఆదివారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలిచిన 22 ఏళ్ల మనూ భాకర్... మంగళవారం అదే వేదికపై సహచరుడు సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా ఆమె చరిత్రకెక్కింది. తాను పోటీపడ్డ రెండు ఈవెంట్లలోనూ పతకాలు నెగ్గిన మనూకు మూడో పతకం సాధించే అవకాశం కూడా ఉంది. ఆగస్టు 2న ఆమె 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో బరిలోకి దిగుతుంది. క్వాలిఫయింగ్‌లో రాణించి ఫైనల్‌కు చేరితే ఆగస్టు 3న మూడో పతకంపై మనూ గురి పెడుతుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత క్వాలిఫయింగ్‌లో త్రుటిలో ఫైనల్ స్థానాన్ని చేజార్చుకున్న సరబ్‌జోత్... మనూతో కలిసి 'మిక్స్‌డ్'లో కాంస్యం నెగ్గి కెరీర్‌లోనే చిరస్మరణీయ ప్రదర్శన నమోదు చేశాడు.

పారిస్: రెండు రోజుల క్రితం పతకం సాధించిన విశ్వాసంతో భారత మహిళా యువ షూటర్ మనూ భాకర్ మరోసారి అదరగొట్టింది. పూర్తి సంయమనంతో, చెక్కు చెదరని ఏకాగ్రతతో లక్ష్యం దిశగా బుల్లెట్‌లు సంధించిన మనూ ఈ క్రమంలో కొత్త చరిత్రలో భాగమైంది. స్వాతంత్య్రం వచ్చాక ఒలింపిక్స్ క్రీడల్లో ఏ భారతీయ క్రీడాకారుడు సాధించని ఘనతను మనూ అందుకుంది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా మనూ భాకర్ రికార్డు నెలకొల్పింది. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మనూ భాకర్-సరబ్‌జోత్ సింగ్ (భారత్) జోడీ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో మనూ-సరబ్‌జోత్ ద్వయం 16-10 పాయింట్ల తేడాతో జిన్ ఓయె-లీ వన్‌హో (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో మనూ-సరబ్‌జోత్ 580 పాయింట్లతో మూడో స్థానంలో, జిన్ ఓయె-లీ వన్‌హో 579 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతక పోరుకు అర్హత సాధించారు. తర్హాన్ సెవల్ ఇల్యాదా-యూసుఫ్ డికెచ్ (టర్కీ) జోడీ 582 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో... జొరానా అరునోవిచ్-దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయం 581 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ-రజత పతక పోరుకు అర్హత పొందారు. మంగళవారం జరిగిన ఫైనల్లో జొరానా-దామిర్ ద్వయం 16-14తో తర్హాన్-యూసుఫ్ జంటను ఓడించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. తర్హాన్-యూసుఫ్ జోడీకి రజత పతకం లభించింది. 1900 పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో బ్రిటిష్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన నార్మన్ ప్రిచర్డ్ పురుషుల 200 మీటర్లు, 200 మీటర్ల హర్డిల్స్‌లో రెండు రజత పతకాలు సాధించాడు. అయితే ఈ ఘనత భారత్‌కు స్వాతంత్య్రం రాక ముందు నమోదైంది.

గత టోక్యో ఒలింపిక్స్‌లో సౌరభ్ చౌదరీతో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన మనూ భాకర్ క్వాలిఫయింగ్‌లో ఏడో స్థానంలో నిలిచి మెడల్ రౌండ్‌కు అర్హత పొందలేకపోయింది. అయితే ఈసారి సరబ్‌జోత్‌తో జత కట్టిన మనూ క్వాలిఫయింగ్‌లోనే కాకుండా కాంస్య పతక మ్యాచ్‌లోనూ నిలకడగా స్కోరు చేసి తన ఖాతాలో రెండో పతకాన్ని వేసుకుంది. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగం క్వాలిఫయింగ్‌లో 577 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయిన బాధను మర్చిపోయి సరబ్‌జోత్ 'మిక్స్‌డ్' ఈవెంట్‌లో గురి తప్పని లక్ష్యంతో పాయింట్లు సాధించి తన ఒలింపిక్ పతకం కలను నిజం చేసుకున్నాడు.

మిక్స్‌డ్ ఈవెంట్ పతక మ్యాచ్‌లో రెండు జోడీల్లో తొలుత 16 పాయింట్లు స్కోరు చేసిన జంటను విజేతగా ప్రకటిస్తారు. ఒక్కో అవకాశంలో రెండు జట్లలోని ఇద్దరేసి షూటర్లు లక్ష్యం దిశగా రెండు షాట్‌ల చొప్పున సంధిస్తారు. రెండు జోడీల్లో ఎక్కువ పాయింట్లు సాధించిన జంటకు 2 పాయింట్లు, తక్కువ స్కోరు చేసిన జోడీకి 0 పాయింట్లు కేటాయిస్తారు. 13 సిరీస్‌లపాటు జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో తొలి సిరీస్‌లో కొరియా జోడీ నెగ్గగా... ఆ తర్వాత వరుసగా నాలుగు సిరీస్‌లలో భారత జంట గెలిచి 8-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆరో సిరీస్‌లో కొరియా ద్వయం... ఏడో సిరీస్‌లో భారత జోడీ పైచేయి సాధించాయి. ఎనిమిదో సిరీస్‌లో కొరియా గెలుపొందగా... తొమ్మిది, పది సిరీస్‌లను భారత జోడీ సొంతం చేసుకొని 14-6తో విజయానికి చేరువైంది. అయితే 11వ సిరీస్‌లో, 12వ సిరీస్‌లో కొరియా ద్వయం పైచేయి సాధించి ఆధిక్యాన్ని 10-14కి తగ్గించింది. అయితే 13వ సిరీస్‌లో మనూ-సరబ్‌జోత్ జోడీ 19.6 స్కోరు చేయగా... కొరియా జంట 18.5 స్కోరు సాధించింది. దాంతో భారత జంట మొదటగా 16 పాయింట్లను అందుకొని విజయంతోపాటు కాంస్య పతకాన్ని దక్కించుకుంది.



కాంస్య పతకాలతో మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్

పతకం గెలవగానే నా మనసులో ఎన్నో చిన్ననాటి ఆలోచనలు వచ్చాయి. ఇన్నేళ్లుగా నాన్న, తాత నాకు అండగా నిలిచిన వైనం, తొలి రెండేళ్లు కోచింగ్ కోసం బస్సులో అంబాలాకు వెళ్లిన రోజులు గుర్తుకొచ్చాయి. ఈవెంట్‌కు ముందు రేంజ్‌లోకి అడుగు పెట్టే సమయంలో కొంత ఒత్తిడిని ఎదుర్కొన్నా. వ్యక్తిగత విభాగంలో వైఫల్యం తర్వాత నా కుటుంబసభ్యులు, కోచ్‌లు ఓదార్చి నాలో మళ్లీ స్ఫూర్తిని నింపారు. ఎక్కడ తప్పు జరిగిందో సరిదిద్దుకునే ప్రయత్నం చేశాను. నా విజయంలో ఆర్థిక పరంగా అండగా నిలిచిన భారత ప్రభుత్వ పాత్ర కూడా ఎంతో ఉంది.
-సరబ్‌జోత్ సింగ్

మనందరం గర్వపడే క్షణాలను మన షూటర్లు మళ్లీ అందించారు. మనూ, సరబ్‌జోత్‌లకు అభినందనలు. ఇద్దరూ చక్కటి ప్రదర్శన కనబర్చారు. భారత్ ఎంతో సంతోషిస్తోంది. -నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

వరుసగా రెండో ఒలింపిక్ పతకం సాధించడం మనూ భాకర్ నిలకడైన ప్రదర్శనను, అంకితభావాన్ని చూపిస్తోంది. కాంస్యం గెలిచిన మనూ, సరబ్‌జోత్‌లకు శుభాకాంక్షలు. వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి. -ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

మనూ, సరబ్‌జోత్... గతంలో ఏ భారత జోడీ సాధించని ఘనతను మీరు అందుకున్నారు. షూటింగ్‌లో ఇది భారత్‌కు తొలి టీమ్ మెడల్. ఈ క్షణాలను ఆస్వాదించండి. -అభినవ్ బింద్రా

ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించి మనూ, సరబ్‌జోత్ దేశం గర్వపడేలా చేశారు. ఇతర క్రీడాకారులకు మీ ప్రదర్శన స్ఫూర్తిగా నిలుస్తుంది.
-వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం

మనూ భాకర్






కాంస్య పతకం కోసం పోటీ జరిగిందిలా...

భారత్	పాయింట్లు	0	2	2	2	2	0	2	0	2	2	0	0	2	16
	మొత్తం స్కోరు	18.8	21.2	20.8	20.7	20.1	20.2	20,0	18.5	20.5	20.8	19.3	20.8	19.6	
మనూ భాకర్		10.2	10.7	10.4	10.7	10.5	10.0	10.6	8.3	10.0	10.5	9.6	10.6	9.4	
సరబ్‌జోత్		8.6	10.5	10.4	10.0	9.6	10.2	9.4	10.2	10.5	10.3	9.7	10.2	10.2	
కొరియా	పాయింట్లు	2	0	0	0	0	2	0	2	0	0	2	2	0	10
	మొత్తం స్కోరు	20.5	19.9	19.8	20.5	19.5	20.6	19.7	20.7	20.4	19.4	19.8	21.0	18.5	
జిన్ ఓయె		10.4	10.0	9.1	9.9	9.8	9.8	9.9	10.4	9.7	9.6	9.0	10.2	9.5	
లీ వన్‌హో		10.1	9.9	10.7	10.6	9.7	10.8	9.8	10.3	10.7	9.8	10.8	10.8	9.0	

'పిస్టల్'తో పంట పండించాడు!

పొలం నుంచి ఒలింపిక్ పోడియం వరకు రైతు బిడ్డ సరబ్‌జోత్ ప్రస్థానం

'కిసాన్ ద పుత్తర్ హై... దిల్ థోడా చడీ దా'... శనివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో త్రుటిలో ఫైనల్ చేరే అవకాశం కోల్పోయిన తర్వాత సరబ్‌జోత్‌తో అతని తండ్రి జతీందర్ సింగ్ చెప్పిన మాట ఇది. 'రైతు బిడ్డవు నువ్వు...బేలగా మారిపోయి బాధ పడవద్దు' అంటూ నాన్న స్ఫూర్తి నింపే ప్రయత్నం చేయగా... సరిగ్గా మూడు రోజుల తర్వాత ఆ బిడ్డ మళ్లీ తన తుపాకీని లక్ష్యంపై సరిగ్గా గురి పెట్టాడు. 'నా కొడుకు షూటింగ్‌ను చాలా ఇష్టపడ్డాడు. గత పదేళ్లుగా అందులో ఎంతో కష్టపడ్డాడు. గత ఈవెంట్‌లో ఫైనల్ అవకాశం కోల్పోయినప్పుడు అదే గుర్తు చేశాను. గతం మరిచి భవిష్యత్తుపై దృష్టి పెట్టమని చెప్పాను. ఆ నిరాశను దూరం చేసి అతను ఇప్పుడు ఒలింపిక్ పతకం గెలవడం చాలా గర్వంగా ఉంది' అని జతీందర్ సంతోషం వ్యక్తం చేశాడు.



నాన్న అండతో...

హరియాణా రాష్ట్రం అంబాలాలోని ధీన్ గ్రామం సరబ్‌జోత్ స్వస్థలం. ఐదు ఎకరాల వ్యవసాయదారుడు అయిన తండ్రి అక్కడి చాలా కుటుంబాల లాగే తన పెద్ద కొడుకు కూడా పొలంలో సహాయకారిగా ఉంటే చాలనుకున్నాడు. కానీ సరబ్‌జోత్ ఆలోచనలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. స్థానికంగా జరిగిన వేసవి శిబిరంలో కొంత మంది కుర్రాళ్ల చేతుల్లో ఉన్న ఎయిర్ గన్స్ అతడిని ఆకర్షించాయి. కాగితాలపై చిత్రించిన లక్ష్యాలను వారు కొడుతున్న తీరు మరింత ఇష్టాన్ని పెంచింది. కొన్నాళ్లకు ఆ శిబిరం ముగిసిపోయినా... ఆ టీనేజర్ మనసులో పిస్టల్ ముద్రించుకుపోయింది. దాంతో ధైర్యం చేసుకొని 13 ఏళ్ల ఆ కుర్రాడు తాను షూటింగ్ నేర్చుకుంటానంటూ తండ్రితో చెప్పేశాడు. ముందుగా సందేహించినా...ఆ తర్వాత తండ్రి తనను అంబాలాలోని షూటింగ్ అకాడమీలో చేర్పించాడు. అక్కడ ఓనమాలు నేర్పించిన కోచ్ అభిషేక్ రాణా ఇప్పటి వరకు కూడా కోచ్‌గా ఉంటూ సరబ్‌జోత్ ఒలింపిక్ పతక ప్రస్థానంలో కీలకపాత్ర పోషించడం విశేషం. ఆ వయసులోనే పొలంలో కష్టం చేసే అలవాటు ఉన్న ఆ అబ్బాయి తనకు సూపర్‌ఫిట్‌గా అనిపించాడని, నిర్విరామంగా గంటలకొద్దీ కదలకుండా నిలబడి సాధన చేసే వాడని రాణా గుర్తు చేసుకున్నాడు.

అలా మొదలై...

16 ఏళ్ల వయసులో తొలిసారి జాతీయ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో ఈ హరియాణా అబ్బాయి వెలుగులోకి వచ్చాడు. అప్పుడే అతను తన తండ్రి వద్ద తొలిసారి సొంతంగా కొత్త పిస్టల్ కొనివ్వమని అడిగే ధైర్యం చేశాడు. అదే సమయంలో నోట్లు రద్దు కారణంగా కొంత ఇబ్బందులు ఉన్నా... కొడుకు కోసం దాదాపు రూ. 2 లక్షలతో తండ్రి పిస్టల్ కొనిచ్చాడు. తనపై తండ్రి ఉంచిన నమ్మకాన్ని సరబ్‌జోత్ నిలబెట్టుకున్నాడు. తర్వాతి రెండేళ్ల పాటు ఆటలో మరింత రాటుదేలిన అతను 2019లో జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో స్వర్ణం సాధించి అంతర్జాతీయ స్థాయిలో విజయాన్ని రుచి చూశాడు. అదే ఏడాది ఆసియా చాంపియన్‌షిప్‌లలో 2 స్వర్ణాలు, ఒక కాంస్యం సరబ్‌ను భారత్ నుంచి మంచి భవిష్యత్తు ఉన్న పిస్టల్ షూటర్లలో ఒకడిగా మార్చింది. ఇదే జోరులో వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలు, ఆసియా క్రీడల్లో స్వర్ణ, రజతాలు సరబ్ ఖాతాలో చేరాయి. గత ఏడాది చాంగ్వాన్‌లో ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం గెలిచి ఒలింపిక్స్‌కు అర్హత సాధించినప్పుడే అతనిపై అంచనాలు పెరిగాయి.

లక్ష్యం చేరిన బుల్లెట్...

'నాకు వరల్డ్ కప్ విజయాలు అవసరం లేదు... వేరే ఇతర టోర్నీల్లో పతకాలు అవసరం లేదు... నాకు ఒలింపిక్స్ పతకం మాత్రమే కావాలి... గత ఎనిమిదేళ్లుగా నేను దీని గురించి కలగన్నాను... ఇప్పుడు నా గుండెల్లో ఒక రకమైన అగ్ని జ్వలిస్తోంది'... పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లే ముందు సరబ్‌జోత్ సింగ్ ఆత్మవిశ్వాసంతో చెప్పిన మాట ఇది. శనివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో పోటీ పడినప్పుడు కూడా అతను అంతే ఉత్సాహంగా కనిపించాడు. క్వాలిఫయింగ్‌లో జర్మనీ షూటర్ రాబిన్ వాల్టర్‌తో కలిసి 577 పాయింట్లతో సంయుక్తంగా ఎనిమిదో స్థానంలో నిలిచాడు. అయితే 10 పాయింట్ల షాట్‌లు వాల్టర్ కంటే ఒకటి తక్కువగా కొట్టడంతో అనూహ్యంగా ఫైనల్ చేరే అవకాశం చేజారింది. దాంతో ఆవేదనగా నిష్క్రమించిన అతను ఇప్పుడు మిక్స్‌డ్‌లో కాంస్యంతో ఆ భారం కాస్త దించుకున్నాడు. వేగంగా దూసుకెళ్లే కార్లు, పంజాబీ పాప్ సంగీతాన్ని ఇష్టపడే ఈ 23 ఏళ్ల షూటర్ తన ఇంట్లో, పరిసరాల్లో, సరదాగా ఆడే వీడియో గేమ్‌లపై కూడా ఒలింపిక్ రింగ్‌లను ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించుకున్నాడు. వాటిని చూడగానే తన లక్ష్యం ఏమిటో, తాను పడిన శ్రమ ఏమిటో ఇవి పదే పదే గుర్తుకొస్తుందని, తన కలను నెరవేర్చుకోవాలనే పట్టుదలను పెంచడం కోసం ఇలా చేసినట్లు అతను చెప్పుకున్నాడు. ఇప్పుడు ఒలింపిక్ పతకం గెలుచుకున్న క్షణాన 'నేను ఎన్నో ఫాస్ట్ కార్లను అద్దెకు తీసుకొని నోయిడా సర్క్యూట్‌లో వేగంగా డ్రైవింగ్ చేశాను. ఇప్పుడు నా కోసం ఒకటి కొనుక్కుంటాను. అది ఎంతో వేగంగా దూసుకెళ్లాలంటే 3-4 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగం అందుకోవాలి' అంటూ తన కోరికను అతను బయటపెట్టాడు.

-సాక్షి క్రీడా విభాగం



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

టేబుల్ టెన్నిస్

మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్: ఆకుల శ్రీజ x జియాన్ జెంగ్ (సింగపూర్) (మధ్యాహ్నం గం. 2:20 నుంచి).

ఆర్చరీ

మహిళల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: దీపిక x రీనా పర్నట్ (ఎస్తోనియా) (మధ్యాహ్నం గం. 3:56 నుంచి). పురుషుల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: తరుణ్‌దీప్ రాయ్ x టామ్ హాల్ (బ్రిటన్) (రాత్రి గం. 9:15 నుంచి).

ఈక్వెస్ట్రియన్

డ్రెసాజ్ వ్యక్తిగత గ్రాండ్ ప్రి: అనూష్ అగర్వల్లా (మధ్యాహ్నం గం. 1:30 నుంచి).

బాక్సింగ్

మహిళల 75 కేజీల ప్రిక్వార్టర్స్: లవ్లీనా బొర్గొహైన్ x సునీవా హాఫ్‌స్టడ్ (నార్వే) (మధ్యాహ్నం గం. 3:50 నుంచి). పురుషుల 71 కేజీల ప్రిక్వార్టర్స్: నిశాంత్ దేవ్ x జోస్ గాబ్రియల్ రోడ్రిగ్జ్ (ఈక్వెడార్) (అర్ధరాత్రి గం. 12:18 నుంచి).

బ్యాడ్మింటన్

మహిళల సింగిల్స్ గ్రూప్ లీగ్ మ్యాచ్: పీవీ సింధు x క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా) (మధ్యాహ్నం గం. 12:50 నుంచి). పురుషుల సింగిల్స్ గ్రూప్ లీగ్ మ్యాచ్: లక్ష్యసేన్ x జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) (మధ్యాహ్నం గం. 1:40 నుంచి). పురుషుల సింగిల్స్ గ్రూప్ లీగ్ మ్యాచ్): హెచ్ఎస్ ప్రణయ్ x డక్ ఫాట్ లీ (వియత్నాం) (రాత్రి గం. 11:00 నుంచి).

షూటింగ్

50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ పురుషుల క్వాలిఫికేషన్ రౌండ్: ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్ రౌండ్: శ్రేయసి సింగ్, రాజేశ్వరి కుమారి (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).



మనిక బత్రా సంచలనం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ మనిక బత్రా సంచలనం సృష్టించింది. మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లి విశ్వ క్రీడల్లో ఈ ఘనత సాధించిన తొలి భారత టీటీ ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో మనిక 11-9, 11-6, 11-9, 11-7తో ప్రపంచ 18వ ర్యాంకర్, భారత సంతతికి చెందిన ఫ్రాన్స్ క్రీడాకారిణి ప్రీతిక పవాడెపై విజయం సాధించింది. 1988 నుంచి ఇప్పటి వరకు 9 ఒలింపిక్స్‌ల్లో పాల్గొన్న మన టీటీ ప్లేయర్లు ఎవరూ సాధించలేని ఘనత మనిక బత్రా సొంతం చేసుకుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.